

Website : www.saisadguruvani.org
'దత్త జయంతి' ప్రత్యేక సంచిక
శ్రీ భరద్వాజ
సద్గురువాణి
సంపుటి - 19
అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2019
సంచిక - 4
శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు

**విజయదశమి రోజున శ్రీకాకుళంలో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**



**శ్రీ పి. కృష్ణారావు, శ్రీమతి సుబ్బలక్ష్మి**

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో
గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.



విజయదశమి, దీపావళి మరియు
దత్త జయంతి శుభాకాంక్షలతో...



**శ్రీ ఐ. రాజగోపాలరావు**
**శ్రీమతి వరలక్ష్మి**
**చి॥ పృథ్విరాజ్**
**చి॥ సంజయ్ కుమార్**
**గోవిందపురం గ్రామం, శ్రీకాకుళం జిల్లా.**

## జన్మదిన శుభాకాంక్షలు



**డిశెంబర్ 26వ తేదీన**
**జన్మదినం జరుపుకుంటున్న**
**శ్రీ బాడాన లక్ష్మీనారాయణ**
**శ్రీమతి బాడాన ముత్యాలమ్మ** ల కుమారుడు
**చి॥ బాడాన సంతోష్** కు

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

## జన్మదిన శుభాకాంక్షలు



**అక్టోబర్ 19వ తేదీన లావేరు మండలం,**
**అప్పాపురం గ్రామంలో జన్మదినం జరుపుకుంటున్న**
**శ్రీ ఎడ్ల నాగభూషణం**
**శ్రీమతి ఎడ్ల లక్ష్మి** దంపతుల ద్వితీయ కుమార్తె
**చి॥ ఎడ్ల లావణ్య** కు

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

శ్రీ భరద్వాజ
# సద్గురువాణి

సంపుటి - 19 అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2019 సంచిక - 4

**శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'దత్త జయంతి' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**



"జటాధరం పాండురంగం, శూలహస్తంకృపానిధం
సర్వరోగహరం దేవం, దత్తాత్రేయ మహం భజే"

## చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | - రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**


ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224, 9441467648

E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**

## విషయ సూచిక

1. విషయసూచిక ........ 1
2. మా మాట ........ 2
3. దత్తంభజే........ 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ........ 5
5. శ్రీక్షేత్ర కురువపురం ........ 7
6. విజయదశమి ........ 8
7. శ్రీగురు చరితామృతము ........ 9
8. పండుగలు - పర్వదినాలు ........ 11
9. శ్రీ బి.వి. నరసింహ స్వామి ........ 12
10. ఒక్క క్షణం ........ 13
11. ఆదర్శమూర్తి శ్రీ లాల్‌బహుదూర్ శాస్త్రి ........ 14
12. జిజ్ఞాస........ 15
13. పూర్ణ అంతరంగాలు ........ 17
14. శ్రీ ధునీవాలా దాదా........ 20
15. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ........ 21
16. మేము సహితం ........ 22
17. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో చిత్రమాలిక ........ 23
18. జన్మదిన శుభాకాంక్షలు........ 24
19. శ్రీ దత్తాత్రేయుడు........ 28
20. శ్రీ ఉపాసనీ మహారాజ్ ........ 29
21. దత్తజయంతి మహోత్సవములు ........ 30
22. శ్రీ దత్తసాంప్రదాయం ........ 31
23. శ్రీ సాయినాధుని అవతరణ ........ 32
24. మాస్టారి మానవత్వం ........ 33
25. హృదయజ్యోతి........ 34
26. శ్రీ మాణిక్యప్రభువు ........ 35
27. శ్రీగురుచరిత్ర పారాయణ ఫలితాలు ........ 37
28. శ్రీ పూర్ణానంద స్వామి ........ 38
29. తెలుసుకుందాము ........ 39
30. ఏరిన ముత్యాలు ........ 40








## మా మాట

**పాఠకులకు, రచయిత(త్రు)లకు, ప్రకటనకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు...**

సకల జనావళిని ఉద్ధరించాలనే అవతార లక్ష్యంతో త్రిమూర్తి స్వరూపమయిన శ్రీ దత్తాత్రేయుడు శ్రీ శిరిడీసాయినాధుడి రూపంలో అవతరించి, అనేక మిషలమీద కార్యకారణ సంబంధంగా తన వద్దకు లాగి, కోరికలు నెరవేర్చి, కష్టాలు తొలగించి, జిజ్ఞాసువులుగా మారిన వారిని, జ్ఞానవంతులుగా, తన స్వరూపులుగా మారుస్తున్నారు. కుల, మత, వర్ణాల, భేదాలు లేకుండా సర్వులను ఉద్ధరించే అవతారమూర్తి శ్రీ శిరిడీసాయిబాబా. నేడు ప్రపంచమంతా ఎదురుచూస్తున్న ఆధ్యాత్మిక చక్రవర్తి శ్రీ సాయిబాబా. మనకు జగద్గురువైన శ్రీసాయిబాబాను సేవించి వారి కృపకు పాత్రులవ్వటము మన ప్రథమ, ప్రధాన కర్తవ్యం. సేవ చేయటము అంటే మనకు వీలు కలిగినప్పుడో, బుద్ధి పుట్టినప్పుడో, అవసరమున్నప్పుడో చేసేది కాదు. సేవ అంటే, స్వాతి చినుకుకై ఆలుచిప్ప ఎదురుచూస్తున్నట్లు ఎదురుచూసి, కురిసిన మొదటి నీటి బిందువు ముత్యంగా మార్చుకొని, తనలో అది ఇముడ్చుకున్నట్లు, ఎప్పుడు గురువు ఆజ్ఞాపిస్తారో అని ఆయన నోటిమాటకై ఎదురుచూడటమే. "సరియైన సమయంలో సరియైన విధముగా, సరియైన పనిచేయటమే యోగము". సాయి తన గురుసేవకై చేసిన యోగము అదే. జ్ఞాన బోధకోసం తన గురువువెంట గుహలోనికి ప్రవేశించిన సాయి, 12 సంవత్సరాలు నిరంతరము తన గురువు ఎప్పుడు ఏమి చెప్తారో అని ఎదురుచూస్తూ ఉండిపోయారట. ధ్యానస్థులైన తన గురువు నోటికి ఆహారమందించి, విసర్జించిన మలమూత్రాదులను శుభ్రంచేసి, నిరంతరం తన గురువుపై దృష్టి నిలిపి ఉండిపోయినారట. అట్లా ఏకాగ్ర దృష్టితో చూస్తున్నప్పుడు తన కన్నులు బరువెక్కి, దృష్టికి అంతరాయంగా, కనురెప్పలు మూతపడితే, వాటిని పెరికివేస్తే బాగుంటుందని తలచారట. అదీ గురువు సేవకై ఎదురుచూడటం. "నా గురువును నేను సేవించినట్లు నన్ను సేవించేవారు ఒక్కరు కూడ కనిపించలేదు" అన్నారు సాయి. అయితే బాబాకు సేవ చేయటము అంటే ఆయనను పూజించటం కాదు, శాలువాలు, నగలు సమర్పించటము కాదు, అవకాశమున్నప్పుడు ఆలయాలలో కొద్దిసేపు సేవచేయటము కాదు, "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను, నా ఈ భౌతికదేహం నుండి నా గురువు నన్నెప్పుడో విడుదల చేశారు" అన్నారు సాయి. మన ఎదుట నిలచిన సకల చరాచర దృశ్యమానమంతా సాయి స్వరూపమే. ఆ విషయము ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా బోధించినా, అర్థంచేసుకొని ఆచరణ చేయనటువంటి మనవంటివారిపై అపారమైన ప్రేమతో 1918 అక్టోబరు 15వ తేదీ మంగళవారం, విజయదశమి పర్వదినాన తన భౌతికదేహం వీడి, సృష్టి చైతన్యంలో నిలచి, సర్వవ్యాపకమైనారు శ్రీసాయిబాబా. విజయదశమి అనగా రాక్షసత్వం పై దైవత్వం గెలుపు". విజయదశమికి, అటు దైవపరంగాను ఇటు గురుపరంగాను ఒక ప్రత్యేకత ఉంది. విజయదశమి అంటే దసరా సరదాల పండుగ. బంధుమిత్రుల కలయికలు, పిండివంటల ఘుమ ఘుమలు. తమోగుణ ప్రధానమైన లోకకంటకుడైన రాక్షసుడు సంహరించబడ్డాడు, ఇక కష్టాలు, నష్టాలు, బాధలు లేవు, వాటిపై విజయం సాధించాం, ఇక అంతా ఆనందమే, అయితే పండుగలు, పర్వదినాలలోని అంతరార్థము, వాటి అసలైన ఆచరణా విధానాన్ని మరచిపోయి, సుఖమయ ఆనంద మత్తులో ఉన్నవారిని మేల్కొలిపి, జ్ఞాన మార్గంవైపు పయనింపచేయటానికి సృష్టి అంతటా వ్యాపించి ఉన్నశక్తి, శ్రీసాయి రూపంలో అవతరించింది. "శాస్త్రాలు ఎన్నటికీ అబద్ధంకాదు, మంత్రాలు ఎన్నటికీ అబద్ధం కాదు, పనికిరాని అన్వయాన్ని నీ బుర్రలో పెట్టుకున్నావు" అని వాటి నిజతత్వాన్ని ఎరుక పరచి, నిరంతరం జీవులందరూ ఆనందంతో జీవించటానికి, రాచమార్గం ఏర్పాటు చేయటానికే సచ్చిదానంద స్వరూపుడయిన శ్రీసాయి అవతరించింది. "ఆనందం ఎక్కడో లేదు, అది నీలోనే ఉంది, నిరంతరం నీతోనే ఉంది. కోరికల సాలెగూడులో చిక్కుకొని, విలవిల లాడుతున్నావు, కావాలనే కోరిక విడచి సర్వగతుడైన భగవంతుడిమీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు, ఇక నీ భారములు నాపై పడవేసి నీవు నిశ్చింతగా కూర్చో, అవసరమయినదంతా నేను చేస్తాను, అయితే అందుకు ముందుగా నీ శరీరమనే సత్రంలో దాగిఉన్న అరిషడ్వర్గాలు అనే శత్రువులను సంహరించు, అప్పుడు నీకు నాకు భేదమనే అడ్డుగోడ తొలగుతుంది. అప్పుడు సప్త సముద్రాల అవతల ఉన్నా నేను నీవెంట ఉన్నాను అనే అనుభవం కలుగుతుంది" అని చెప్పటమే కాక, అర్హులైన వారికి ప్రత్యక్ష అనుభవం కూడ ఇచ్చారు జగద్గురువైన శ్రీ శిరిడీసాయిబాబా. సాయి మనచెంత లేరు, మనగోడు ఆలకించుకోడు అనే భావనను తొలగించటానికే, తాను సమాధిచెందుతూ "నా నామం పలుకుతుంది, నా మట్టి సమాధానమిస్తుంది, నా సమాధి మీకు జవాబిస్తుంది" అని పలికి, విజయదశమి నాడు విశ్వచైతన్యంలో నిలచారు శ్రీసాయిబాబా.

నవరాత్రులు ప్రారంభమయినాయి, అంటే మనలోని రాగ, ద్వేష, అసూయ, మమకారాలు అనే తమోగుణ ప్రధానమైన రాక్షస గుణాలను గుర్తించి తొలగించుకునే ప్రయత్నం ప్రారంభమయినదని గుర్తెరిగి, దాని కనుగుణంగా మసలుకుంటే విజయం వరించినట్లే, అప్పుడు ఇక మనది అంటూ ఏది ఉండదు, అన్నిటా సాయినే, అంతటా సాయినే, విశ్వరూపుడైన శ్రీసాయి నిజతత్వమెరిగి జీవించటమే సాయికి సేవచేయటమంటే. ఇక దసరా ఒక సరదా కాదు, ఒక బాధ్యత, మనకోసం మనపైన అవాజ్యమైన ప్రేమతో, భౌతికదేహం వీడిన సాయి నిజతత్వం ఎరుక గలిగి జీవించటం. ఆర్తులు, అర్థార్థుల స్థితిని దాటి జిజ్ఞాసువులుగా మారటం. అటువంటివారికోసం సాయి అందించిన అద్భుతమైన మార్గం "శ్రీగురుచరిత్ర" పారాయణ. హరివినాయక సాఠె, అన్నాసాహెబ్ ధభోల్కర్ వంటివారికి శ్రీ సాయి దర్శనం, అనుగ్రహం లభించటానికి శ్రీగురుచరిత్ర పారాయణే కారణమయింది, కుశాభావు అనే ఉపాధ్యాయుడి చేత 108 సార్లు శ్రీగురుచరిత్ర పారాయణ చేయించి తన సంపూర్ణ అనుగ్రహం అందించారు శ్రీసాయి. గంగిఖిర్ వంటి మహాత్ముడు, "పేడకుప్పలాంటి శిరిడీ గ్రామానికి కోహినూర్ వజ్రంలాంటి సాయి లభించారు" అని చెప్పినా, ఇంకెందరో మహాత్ములు సాయి తమకంటే అధికుడని, "తాము మేకలు కాచేవారము అని, శ్రీసాయి పులులను కాచేవారు" అని చెప్పటమే కాకుండా, తమ శిష్యులను కూడ శ్రీసాయి దగ్గరకు పంపిన వారెందరో కలరు, అయినా సామాన్యమైన వ్యక్తి లాగానే జీవించారు శ్రీసాయి. మన సనాతన ధర్మమంతటికీ మూలమైన ఉపనిషత్తులు, వేదాలు వాటి అంగాలయిన అష్టాదశ పురాణాల, బ్రహ్మసూత్రాల, భగవద్గీతల సారమయిన "శ్రీగురుచరిత్ర" పారాయణ ద్వారా గురుతత్వాన్ని తెలుసుకోమని, జిజ్ఞాసులైన వారికి సూచించారు శ్రీసాయి. శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా శ్రీసాయి నిజతత్వమెరిగి, జీవించడం జరుగుతుంది. అట్లా జరిగిననాడు సకల జనావళిని ఉద్ధరించాలనే మిషతో భువిపై అవతరించిన త్రిమూర్తి స్వరూపుడయిన శ్రీదత్తాత్రేయుడు, మనకు దత్తమై మానవజన్మకు సార్థకత చేకూరుస్తాడు. పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు "సాయి విశ్వతత్వాన్ని" ఆకలింపు చేసుకొని, దత్త సాయి సంప్రదాయములో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న అవధూత తత్వాన్ని, తాను ఎరిగి, శ్రీదత్తానుగ్రహంతో, సాయిస్వరూపులయిన ఎందరో అవధూతలను, మహాత్ములను తాను దర్శించటమే కాక భక్త జనావళికి వారి దర్శన భాగ్యం లభింపచేశారు. వారు చూపిన మార్గంలో పయనం చేయటానికి చేసే ప్రయత్నంగానే, "శ్రీ భరద్వాజ సద్గురువాణి" తన వంతు కర్తవ్యంగా, శ్రీదత్తావతారుల, అవధూతల, మహాత్ముల జీవిత, బోధలను అందించటానికి ప్రయత్నం చేస్తున్నది. దానిలో భాగంగానే ఈ సంచికను, "శ్రీదత్తజయంతి ప్రత్యేక సంచికగా" మీ ముందుంచుతున్నాము. దత్త స్వరూపుడయిన సాయిని ఆశ్రయించి, సేవించి, సంపూర్ణమైన కృప అందరూ పొందాలనే, శ్రీదత్తాత్రేయ తత్వాన్ని వీలయినంతగా అందించటానికి మా వంతు ప్రయత్నం చేశాము. ప్రయత్నంలో లోపముంటే మాది, అనుమతిచ్చి అనుగ్రహించిన మహిమ శ్రీ దత్త సాయి భరద్వాజులది. ప్రయత్నం మాది, పఠనం మీది, అనుగ్రహ ప్రసాదం శ్రీ దత్తసాయి భరద్వాజులది.

సద్గురువును తెలుసుకోవటానికి చేసే ప్రయత్నంలో అవరోధాలుగా నిలచిన మానసికమైన రుగ్మతలను జయించటమే నిజమైన విజయదశమి, తద్వారా అమావాస్య చీకటిలో మగ్గుతున్న మన హృదయ కుహరాలలో సద్గురు జ్యోతి వెలిగి, సత్ – చిత్ ఆనంద మార్గంవైపు పయనింప చేసేదే "దీపావళి", మాష్టారుగారు చూపిన నిర్దుష్టమైన సాయిమార్గంలో పయనించటమే వారికి జన్మదిన సందర్భముగా మనమిచ్చే దక్షిణ, అది సమర్పించిన నాడు 'కదలిరాద తనే వసంతం – తన దరికి రాని వనాలకోసం' అన్నట్లు, సాయి నిరంతరం మనచెంత, మనతో, మనలో ఉంటాడు, అదే "శ్రీదత్తజయంతి".

"శ్రీ భరద్వాజ సద్గురువాణి" ఈ సంచికతో 19 వసంతాలు పూర్తి చేసుకొని 20వ వసంతంలోకి అడుగిడబోతున్న శుభ సందర్భములో 2020 జనవరి, ఫిబ్రవరి, మార్చి సంచికను "జన్మదిన ప్రత్యేక సంచిక"గా, ఎక్కువ పేజీలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని మా ఆకాంక్ష, శ్రీ దత్తసాయి భరద్వాజ సాంప్రదాయ పత్రికలలో అత్యధిక పాఠకులు కలిగిన ఆధ్యాత్మిక పత్రికగా అగ్రస్థానములో నిలచి, గత రెండు దశాబ్దాలుగా అక్షర యజ్ఞం కొనసాగిస్తున్న "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ప్రతి ఒక్కరికి మరింతగా చేరువయ్యే విధముగా, సరికొత్త శీర్షికలతో, మీకు అందించటానికి మావంతు ప్రయత్నం ప్రారంభించాము. అందుకు మీ సలహాలు, సూచనలతోపాటు, మీ అమూల్యమైన రచనలకు మా హృదయపూర్వక ఆహ్వానము.

2001లో 'శ్రీ భరద్వాజ సద్గురువాణి'కి జీవిత చందాదారులుగా చేరి, రెండు వందల రూపాయలు చెల్లించిన వారి సభ్యత్వము 2020 సంవత్సరముతో ముగుస్తుంది. కనుక, సహృదయముతో పత్రిక మనుగడకు తమవంతు ఆర్థిక సహకారము అందిస్తూ, వేలాది మందికి నిర్దుష్టమైన శ్రీ దత్తసాయి సాంప్రదాయాన్ని అందించే ఈ అక్షర యజ్ఞంలో మీ భాగస్వామ్యం కొనసాగించవలసినదిగా మా విన్నపము.

శ్రీ భరద్వాజ సద్గురువాణి మీ హృదయవాణిగా తీర్చిదిద్దటానికి నిరంతరం మా ప్రయత్నం కొనసాగిస్తుంటాము. అందుకు ఎల్లవేళలా మీ అండదండలు మాకు తోడుండాలి అని కోరుకుంటూ...



**పాఠకులకు, రచయిత(త్రు)లకూ, ప్రకటన కర్తలందరికీ**
**దీపావళి మరియు శ్రీదత్తజయంతి శుభాకాంక్షలు**

**మీ పబ్లిషర్**
**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# దత్తంభజే! గురు దత్తంభజే!

ప్రతి మనిషి కూడా సాధ్యమైనంత వరకూ సుఖముగా సంతోషముగా జీవించాలనే కోరుకుంటాడు. దానిని పొందే మార్గంలో మంచి ఉద్యోగస్తుడు కావాలనో, ప్రముఖ రాజకీయవేత్త కావాలనో, డబ్బు, కీర్తి సంపాదించాలనో ఎవరికి తగ్గ లక్ష్యాలను వారు ఏర్పరుచుకుంటారు. ఐతే ఇందులో కొందరు మాత్రమే తమ లక్ష్యాలను సాధించుకోకలగటము, కొందరు ఎంత కృషి చేస్తున్నప్పటికీ పొందలేకపోవటం చూస్తున్నాము. కాని కొందరే తమ లక్ష్యాలను సాధించుకోవడం, మిగిలినవారు సాధించుకోలేకపోవడం అనేది మనకు అంతుపట్టని ప్రశ్నగా వుండిపోయింది. దీనికి సమాధానం మనకు పరిపూర్ణమైన మహాత్ముల వల్ల లభ్యమౌతుంది. వారి సిద్ధాంతం ప్రకారం, ప్రతి మనిషియొక్క జీవితంలో ఎదురయ్యే సంఘటనలు ముందుగా నిర్దేశించబడిన కర్మసిద్ధాంతం వల్ల జరుగుతువుంటాయి. దీనిని బట్టి చూస్తే, ప్రతి మనిషియొక్క జీవితం వాడికి తెలిసినా తెలియకపోయినా ఈ కర్మసిద్ధాంతానికి అనుగుణంగా సాగుతుందని భగవద్గీత గ్రంధాలు తెలుపుచున్నాయి. ఐతే ఈ కర్మసిద్ధాంతానికి అనుగుణంగా మన జీవితం సాగించాల్సిందేనా? లేక దీనిని సవరించి మనకు సుఖమైన జీవితం అందించే మార్గం ఏమైనా వుందా?



భగవంతుడు భూమిపై సద్గురువుగా అవతరించినదే దత్తాత్రేయ తత్వం. ఈ కలియుగంలో దత్తస్వామి మానవరూపంలో శ్రీపాద వల్లభులుగా, శ్రీ నృసింహసరస్వతిగా, శ్రీ మాణిక్యప్రభువుగా, శ్రీ స్వామి సమర్థగా మరియు శ్రీ షిర్డిసాయినాధుడుగా అవతరించారు. ఈ మహనీయులు చరిత్రలో కర్మసూత్రాన్ని సవరించి తమ భక్తులను రక్షించిన అనుభవాలను స్మరిద్దాము.

గోపీనాధుని కుటుంబము దత్తభక్తులు. వారికి దత్తస్వామి అనుగ్రహం వల్ల కల్గిన బిడ్డకు స్వామిపేరు పెట్టుకున్నారు. ఇతనికి వివాహము అయిన దగ్గరనుండి తీవ్రమయిన క్షయవ్యాధి వచ్చింది. భర్తయొక్క వ్యాధిని ఆ శ్రీగురుడే తొలగించగలరని విశ్వసించి అతనిని స్వామిదర్శనానికి తీసుకువెళ్ళింది అతని భార్య అయిన సావిత్రి. కాని అతను మార్గమధ్యంలోనే మరణించాడు. ఆమె ఎంతో బాధపడి స్వామి దర్శనాంతరము సహగమనం చేసుకోవాలని నిర్ణయించుకొని, శ్రీ గురుని దర్శించింది. స్వామి సావిత్రిని "దీర్ఘ సుమంగళీభవ" అని దీవించి, చనిపోయిన ఆమె భర్తను తిరిగి బ్రతికించారు. బ్రహ్మరాతను మార్చటం ఎలా సాధ్యమని సందేహిస్తున్న భక్తునితో, "బ్రహ్మ అనుమతితో వచ్చే జన్మనుండి 30 సు॥లు ఆయుష్షు ఈ జన్మకు మార్చామని" స్వామి తెలిపేరు.

భీమాజీపాటిల్ తీవ్రమయిన క్షయవ్యాధితో షిర్డిసాయినాధుని దర్శించాడు. ఈ వ్యాధి పూర్వకర్మ వలన వచ్చిందని తాము నివారించమని సాయి తెలిపారు. అతను ఎంతో దీనంగా ప్రార్థించినమీదట సాయి కరుణించి మసీదులోకి అనుమతించారు. సాయిని దర్శించినప్పటినుండి అతనికి రక్తం పడటం ఆగిపోయింది. ఒకరోజు భీమాజీకి కలలో రోడ్డురోలర్ అతని మీదగా వెళుతున్నట్లు అయి చాలా బాధపడ్డాడు. తెల్లవారిన తరువాతనుండి అతని రోగం పూర్తిగా తొలగిపోయింది. అంటే సాయి, అతను భౌతికంగా అనుభవించాల్సిన కర్మఫలితాన్ని స్వప్నంలో అనుభవింపచేసి బాధ తొలగించారు.

నూటికి తొంబైతొమ్మిది మందికి కర్మసిద్ధాంతం ప్రకారం నిర్దేశించబడిన దుఃఖము అనుభవించి తీరాల్సిందే. సద్గురువును ఆశ్రయించి, వారి అనుగ్రహం పొందినివారికి మాత్రమే దుఃఖనివృత్తి కల్గిన సందర్భాలు పై తెల్పిన లీలలువల్ల తెలుస్తుంది.

కానీ సద్గురువును ఆశ్రయించటమే మన ప్రధాన సమస్య అయినది. ఈ కలియుగంలో, ఆత్మజ్ఞానము లేకనే సద్గురువులుగా ప్రకటమౌతారని బ్రహ్మంగారు, పురాణాలన్నీ హెచ్చరించాయి. అందుకే సాయిబాబా కూడా నిజమైన ఫకీరు చాలా అరుదు. ఎవరివద్దకు ఉపదేశాలకొరకై పరుగులిడవద్దని హెచ్చరించారు. పూర్ణగురువులుగా అవతరించినవారి చరిత్రలు పారాయణచేసి వారి సమర్ధతను, లక్షణాలను అర్థంచేసుకొని అట్టి సద్గురువును మనకు చూపమని వారిని ప్రార్థించాలి. మన సంస్కారానికి తగిన గురువును వారే తెలుపుతారు. శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిచరిత్ర పారాయణ చేసిన ఎందరో భక్తులకు వారు ఆశ్రయించవలసిన గురువులను తెలిపిన సంఘటనలు కోకొల్లలు.

దత్తావతారాలైన సద్గురువులందరికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వీరి సమాధి అనంతరం అర్హులైన భక్తులకు భౌతికదర్శనాన్ని ప్రసాదించగలరు. వీరి అనుగ్రహం పొందటానికి వీరి చరిత్ర పారాయణే ఏకైక సాధనం. మొదట రెండు దత్తావతారాల చరిత్రయైన "శ్రీ గురుచరిత్ర" పారాయణవల్ల సద్గురు దర్శనం మరియ పాపప్రక్షాళన అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో మతసాంప్రదాయాలు, సద్గ్రంధాలు తెలిసిన సాయినాధుడు, తన భక్తుని పాపక్షయానికై "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేయించటం గమనార్హం. కుశాభావు అను టీచరు దత్తమహరాజ్ అను సాధువును ఆశ్రయించి ఒక మంత్రం నేర్చుకున్నాడు. దానితో అతను దేనిని చూచి దానిని స్మరిస్తే అతనివద్దకు వచ్చేవి. కొంతమంది ప్రజలు అతనిని దూషించటంతో, వారిని దండించేందుకు ఏదైనా మంత్రం నేర్పమని ఆ సాధువుని అడిగాడు. ఆయన తమవల్లకాదని అతనినివెళ్ళి శ్రీ సాయిని ఆశ్రయించమన్నారు. కాని సాయి అతనిని మశీదులోనికి ప్రవేశించనీయలేదు. కొంతకాలానికి జాలిపడి అతని దుష్కర్మను తొలగించటానికై అతనిచేత "శ్రీ గురుచరిత్ర" 108 సార్లు పారాయణ చేయించి అతనిని అనుగ్రహించారు.


మార్గశిర పూర్ణిమ శ్రీ దత్త జయంతి సందర్భముగా మనముకూడా సద్గురు అనుగ్రహానికి, పాపక్షయానికి వారు విధించిన "శ్రీ గురుచరిత్ర", శ్రీ సాయిచరిత్ర మరియు ఇతర దత్తావతారాల చరిత్ర పారాయణచేసి వారి అనుగ్రహానికి పాత్రులమవుదాం.

**(డిసెంబరు 12వ తేదీ గురువారము శ్రీ దత్త జయంతి సందర్భముగా ప్రత్యేక వ్యాసం)**

రచన : **శ్రీ సాయి భరద్వాజ సత్సంగ మండలి,** విజయవాడ.

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"అహాన్ని జయించని వాడెవడూ భగవంతుడిని చేరలేడు" అంటారు ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయిబాబా. బాహ్యంగా అనేక రూపాలలో వ్యక్తం అయ్యే అహం, సామాన్యమైన జీవిత అభివృద్ధికి అవరోధమయితే, ఆధ్యాత్మిక అహం ఆధ్యాత్మిక ఉన్నతికి అవరోధమై జన్మపరంపరలకు కారణమవుతుంది. మనలో అనేక రూపాలు, అనేక విధాలుగా దాగిఉన్న అహాన్ని, సద్గురు పాదాలచెంత భస్మీపటలం చేస్తేగాని, ఆధ్యాత్మిక ఉన్నతి సమకూడదు. అందుకు "క్షణక్షణమూ ఆత్మవికాసానికై కృషి చేయటము ఒక్కటే మానవజీవిత లక్ష్యం కావాలి" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ. తద్వారా సాటిలేని సద్గురు సాన్నిధ్యం లభించి, జన్మసాఫల్యానికి నాంది జరుగుతుంది.



''ఆచార వ్యవహారాలు, శాస్త్ర విషయాలు అన్నీ కంఠోపాటమే, నాకు చిన్నతనం నుంచే గురుసాన్నిధ్యం లభించింది. మంత్రోపదేశం తీసుకున్నాను, జపతపాలు నిర్వహిస్తాను," అని భావిస్తూ, సద్గురువు బోధను అర్ధంచేసుకొని, ఆచరణ చేయకపోవటము కూడ ఆధ్యాత్మిక అహంకారమే. ఇది జీవితానికి గొడ్డలిపెట్టు. ఆధ్యాత్మిక ఉన్నతిని చూపే గురువును, మన అసంబద్ధమైన చర్యలద్వారా, మాటల ద్వారా, ఇతరులచే దూషించబడే విధముగా జీవించటము కూడ అధోగతికి నిదర్శనం.

శ్రీ సాయి చెప్పిన సూక్తులను, బోధలను అర్ధంచేసుకొని తగురీతిన జీవించటానికి కనీస ప్రయత్నం చేయకుండా, "సాయి భక్తులంతా ఇంతే" అనే విధముగా ప్రవర్తించే వారలము సాయిభక్తులము కాగలమా! కనీసం శ్రీసాయి నా గురువు అని చెప్పుకునే అర్హత ఉంటుందా? అలాఉండకానికి కారణం "అహం". దానిని గుర్తించుకొని తొలగించుకోమంటారు శ్రీసాయి. పూర్వజన్మ సుకృతం వలన సాటిలేని సద్గురువు సాన్నిధ్యం లభించినా, వారి బోధలను, చర్యలను అర్ధంచేసుకోకుండా గడిపిన జీవితమంతా వ్యర్థమే. ఎన్నో సంవత్సరాలనుంచి ఆరాధిస్తున్నామని అనుకునే దానికన్నా, ఎంత వారికి సంప్రీతులయ్యే విధముగా జీవిస్తున్నామన్నదే ప్రధానం. శ్రీసాయిబాబాకి సమకాలనీకులము కాకపోయినా, ఆయన చెప్పింది ఆచరిస్తే, ఆయన ప్రసాదించేది పొందే స్థితిలో ఉంటాము. అందుకు ఎందరో మార్గదర్శులు కలరు. అందులో "సాయిమాస్టర్"గా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజ ఒకరు. సద్గురువుతో ప్రత్యక్ష, పరోక్ష సాన్నిధ్యం ఎంత గడిపేము అన్నదానికన్నా, అది అనుభవైక్యమయ్యే రీతిగా మన ప్రయత్నం ప్రారంభించి, ఎంతమేరకు సఫలీకృతమయ్యామనేదే ముఖ్యం. మన జీవితంలో ఆధ్యాత్మిక పురోగ వృద్ధికి ఎదురయ్యే

**"సిద్ధ యోగీంద్రులు"**

అనేక విషయాలకు సమాధానాలు శ్రీసాయిబాబాను ప్రత్యక్షంగా సేవించుకున్న శ్రీ అవస్థే జీవితంలోని కొన్ని సంఘటనలద్వారా. వాటి పూర్వాపరాలను పరిశీలిద్దాము.

మహరాష్ట్రదేశంలోని పూణేలో సంప్రదాయ కుటుంబంలో 1870లో జన్మించిన పురుషోత్తమరావ్ అవస్థే, కుటుంబ నేపథ్యము వలన, చిన్ననాటినుంచే ఆధ్యాత్మిక చింతన కలవాడు అయ్యాడు. దాదాపు 20 సంవత్సరాలపాటు అనేకమంది సాధుసత్పురుషుల సజ్జన సాంగత్యము కూడ నెరిపేడు, అయితే వారు చెప్పిన దానిని, తాను చదివిన శాస్త్ర వాక్యాలను కూడ తన పరిమితమైన జ్ఞానంతో సంకుచితమైన అర్థాలు ఊహించుకొని, తన ఆలోచనల వలన తన ఆధ్యాత్మిక అభివృద్ధికి తానే అవరోధమయ్యాడు. తన 6వ ఏటనుండే యశ్వంతరావ్ భాస్కర్ అనే సత్పురుషున్ని తన తల్లితండ్రులతోపాటు దర్శించేవాడు అవస్థే. ప్రభుత్వ ఉద్యోగి అయిన యశ్వంతరావ్ తన ఉదారతత్వంతో, ఒక పేదవాని ఇంటిలోని వివాహానికి తనవద్ద డబ్బులేకపోవటంతో, తన ఆధీనంలో ఉండే ప్రభుత్వ ఖజానానుండి ఆర్థిక సహాయం చేశాడు. తనకు పైకంఅందగానే సర్దుబాటు చేయాలని భావించాడు, అయితే ఎవరో ఆయనపై ప్రభుత్వం వారికి ఫిర్యాదు చేయటంతో, యశ్వంతరావ్ తన ఇంటిలో పూజలో ఉండగా, ఆ జిల్లా కలెక్టరు అకస్మాత్తుగా ఆఫీసుకు వచ్చి ఖజానా తనిఖీ చేయగా, అందులో ఎట్టికొరవా కనపడలేదు. ఆ ఫిర్యాదు కొట్టివేసి కలెక్టరు వెళ్ళిపోయాడు. అటుపిమ్మట ఆఫీసుకు వెళ్ళిన యశ్వంతరావ్ అదంతా దైవలీల అని పొంగిపోయాడు. నిరంతరం దైవచింతన, పరోపకారబుద్ధితో ఉంటే భగవంతుడు మనలను కాపాడతాడు, అందుకు ప్రత్యక్ష నిదర్శనం శ్రీ యశ్వంతరావ్ గారు అని, ఆయనను గురువుగా భావించి ఎంతో పూజ్య భావంతో ఉండేవాడు అవస్థే. విద్యార్థి దశదాటి, ఉద్యోగ దశలో ఉన్నప్పుడు అవస్థే అనుకోకుండా ఒకరోజు భగవద్గీత చదివేడు. అంతటితో, గత 20 సంవత్సరాలుగా తాను ఆశ్రయించిన గురువు తనకు ఇప్పుడు సరిపోరు అని భావించి, ఇంకొక గురువు కొరకై తీవ్ర అన్వేషణ ప్రారంభించాడు. అది గమనించిన అతని మేనమామ, అప్పటి సజీవముగా ఉండే అనేక మహాత్ముల వివరాలు తెలిపేరు. అంతటా తిరుగుతూ ఉన్నా అవస్థే మనస్సు మాత్రం కుదుటపడలేదు. అదే సమయములో అనేక మంది మహాత్ముల జీవితచరిత్రలు కూడ చదివేడు అవస్థే. చివరకు 1906వ సంవత్సరము, పలూస్ అనే ఊరిలో ఉన్న శ్రీ దోండీమహరాజ్‌ను దర్శించటానికి బయలుదేరేడు అవస్థే. తాను చదివిన భగవద్గీత

4వ అధ్యాయములోని 34వ శ్లోకము "తద్విద్ధి ప్రణిపాతేన" అన్న శ్లోకాన్ని అనుసరించి ఈయన నేను ఆశ్రయించదగ్గ సిద్ధపురుషుడా! కాదా! అని పరిశీలించాలని భావించిన అవస్థే, పలూస్‌లోని ఒక దేవాలయం బయట అరుగుపై ఆశీనుడై ఉన్న శ్రీ దోండీమహరాజ్‌ను చూస్తూనే, ఈయన శూద్రుడు అని భావించి, నమస్కరించకుండా నిల్చుండిపోయాడు. అవస్థే ఆంతర్యాన్ని గ్రహించి, ఇక్కడ ఉండవద్దు. దేవాలయంలోకి వెళ్ళు అని గద్దించారు శ్రీ దోండీమహరాజ్. దేవాలయంలోనికి వెళ్ళిన అవస్థే ప్రాంగణమంతా కలియ తిరిగి, గుడిలోపలికి ప్రవేశించాడు. అక్కడ నిలువెత్తు చిత్రపటము రూపంలో భక్తులచే పూజలు అందుకుంటున్నారు శ్రీ దోండీమహరాజ్. ఆశ్చర్యపోయిన అవస్థే, తన మనోచాంచల్యానికి బాధపడ్డాడు. అయినా అయనను గురువుగా స్వీకరించటానికి మనస్సు అంగీకరించలేదు. దేవాలయం వెలుపలికి వచ్చి మహరాజ్‌కు నమస్కరించలేదుగాని, "ఇతరుల అంతర్యాలను గ్రహించే దివ్యశక్తులు మీకు ఎట్లా వచ్చాయి" అని అడిగేడు అవస్థే. "రామ్, రామ్, రాజారామ్, సీతారామ్" అని నిరంతరం స్మరిస్తూ ఉండు సర్వము సిద్ధిస్తుంది "నేను ఎవరికి గురువుకాదల్చలేదు, ఎవ్వరినీ స్వీకరించను" అంటూ ఆశీర్వదించి అవస్థేను పంపివేశారు శ్రీ దోండీమహరాజ్.

మహరాజ్ చెప్పిన మంత్రం బాగానే ఉంది అని భావించి, దానిని స్మరిస్తూనే ఉన్నాడు అవస్థే, కాని తన అన్వేషణ మానలేదు. అటుపిమ్మట కొంతకాలానికి పరమహంస అయిన ఒక బ్రాహ్మణ గురువును దర్శించిన అవస్థే, తనకు బ్రహ్మజ్ఞానం ఎలావస్తుంది? అని అడిగేడు. వెంటనే ఆయన అవస్థేను పడుకోమని చెప్పి, అతని ప్రక్కనే తాను పడుకొని ''బ్రహ్మజ్ఞానం ఇస్తున్నాను ఏమిభయపడవద్దు" అంటూ హెచ్చరిస్తూ, అవస్థే గొంతుమీద చేయివేసి గట్టిగా నొక్కివేశారు. ఆయన చర్యకు భయపడి ఆయన చేతినుంచి తన మెడను విడిపించుకోవటానికి తీవ్రప్రయత్నం చేశాడు అవస్థే. వెంటనే అవస్థేను వదిలివేసి, "పిరికి వారికి బ్రహ్మజ్ఞానం లభించదు" ఇక నీవు వెళ్ళిపోవచ్చు అంటూ అవస్థేను పంపివేశారు ఆ పరమహంస.

బ్రతుకు జీవుడా అనుకుంటూ తిరిగి తన అన్వేషణ కొనసాగించేడు అవస్థే. ఆ తరువాత పూణేలోని ఒక ధర్మశాలలో ఒక మహాత్మురాలు నివశిస్తున్నదని తెలిసి తన తోటివారితో కలసి అక్కడకు బయలుదేరేడు అవస్థే. తాను అక్కడికి వెళ్ళే సమయానికి ఎంతోమంది భక్తులు ఆమె చుట్టూ చేరి ఉన్నారు. ఇప్పట్లో ఆమె చెంతకు వెళ్ళి దర్శనం చేసుకునే అవకాశం లేదని భావించిన అవస్థే, మరొక 5 నిముషాలలో ఆమె దర్శనం లభించకుంటే ఇక ఇక్కడికి రానవసరము లేదని నిర్ణయించుకొని ఉండిపోయాడు. మరుక్షణం ఆమె తాను చనిపోతున్నానని, అందరూ అక్కడినుంచి వెంటనే వెళ్ళిపొమ్మని చెప్పి, ముసుగుపెట్టుకొని పడుకొన్నది. తక్షణమే ఆమె చుట్టూ ఉన్న భక్తులందరూ ఆ ప్రదేశముఖాళీచేసి వెళ్ళిపోయారు. వెంటనే ఆమె తన ముసుగు తీసి, అవస్థేను దగ్గరకు పిలిచి "నీకు దర్శనము ఇవ్వటానికే అట్లాచేసానని" చెప్పటముతో తన పరీక్షకు సమాధానము దొరికింది అని భావించి, ఆమెపై గురికుదిరి, తరచు ఆమెను దర్శిస్తూ ఉండేవాడు అవస్థే. తను వెళ్ళిన ప్రతిసారి ఆమె మాట్లాడుతుంటే, తనకే కాక అక్కడి భక్తుల మనస్సులలోని ప్రశ్నలనింటికీ సమాధానం లభించేది. అది గమనించిన అవస్థే ఆమె సర్వజ్ఞత్వాన్ని గ్రహించాడు గాని, ఎందుకో ఆమెను తన గురువుగా స్వీకరించటానికి మనస్సు అంగీకరించలేదు. అవస్థే మనస్సు ఎరిగిన ఆమె తనను గురువుగా స్వీకరించనవసరములేదని, అయినా తాను ఉపదేశించే "పంచాక్షరీని మాత్రము జపించమని" చెప్పి అవస్థేకు పంచాక్షరీ ఉపదేశించింది ఆమె.

కాలం అలాకొనసాగుతుండగా, అక్కడ దైవ సంస్కారముకల శాంతి అనే పాపతో పరిచయమయింది అవస్థేకు. ఆ అమ్మాయిలోని దివ్యత్వాన్ని గ్రహించి, తరచు ఆ చిన్నారితో సత్సంగమము చేసేవాడు అవస్థే. ఒకరోజు శాంతి అవస్థే దగ్గరకు వచ్చి "శ్రీరామచంద్రుని సాక్షాత్కారం కోసం ఈరోజు నీవు ప్రార్థన చేయి, నీకోసం నేను కూడ ప్రార్థిస్తాను" అని చెప్పింది. ఆ మాటను అనుసరించి అవస్థే తీవ్రమయిన ప్రార్థన కొనసాగిస్తుండగా, అతని శరీరంలోని వక్షస్థల క్రిందభాగం శ్రీరామచంద్రుడి రూపంలోకి క్రమేపీ మారుతున్నట్లుగా దర్శనము అవ్వటంతోభయపడి, ఒక్కసారిగా ఉలిక్కిపడి బాహ్యానికి వచ్చిన అవస్థే, అటుపిమ్మట ఆ సాధన కొనసాగించలేదు.

గ్వాలియర్‌లో జడ్జిగా పనిచేస్తున్న శ్రీ పురుషోత్తమరావు అవస్థేకు ఇండోర్ హైకోర్టులో జడ్జిగా పనిచేసే శ్రీ యం.బి. రేగేతో వృత్తిరీత్యా పరిచయము అయ్యింది. అటుపిమ్మట అది ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకునేవరకు సాగింది. తన ఆరాధ్య దైవమయిన శ్రీమన్నారాయణుడి ఆదేశం మేరకు 1910 సంవత్సరము నుండి శిరిడీలోని శ్రీసాయిబాబాను ఆశ్రయించి, సేవించుకుంటున్న రేగే, ఆవిషయం అవస్థేకు తెలిపేరు. అటుపిమ్మట 1914వ సంవత్సరములో పాండురంగని దర్శనార్థమై పండరీపురము వెళుతున్న అవస్థేను మార్గమధ్యములో శ్రీ యం.బి. రేగే కలసి, పండరీపురం తరువాత వెళ్ళవచ్చని తనతో ముందు శిరిడీ రమ్మని తనతోపాటు రైలుప్రయాణం కొనసాగింపచేశాడు. అయితే రైలు ఒక స్టేషన్‌లో ఆగినప్పుడు ఒక ఆంగ్ల సైనికాధికారి అది సైనికులకు సంబంధించిందని రైలు అని, రైలు పెట్టెలలోని అందరినీ దింపివేశారు కాని, సాయి నామం జపిస్తూ కూర్చొని ఉన్న రేగేని చూసి అతని మిత్రుడుని ప్రయాణం కొనసాగించమని చెప్పి, మిగిలిన అన్ని పెట్టెలలో సైనికులను ఎక్కించాడు. "మనసారా జపించే గురునామానికి ఇంత ఫలితం ఉంటుందా" అని ఆలోచిస్తూ ఉండిపోయాడు అవస్థే. రైలుదిగి శిరిడీ వెళ్ళేంతవరకు రేగే సాయినామాన్ని జపిస్తూనే ఉన్నాడు. శిరిడీచేరి బాబా దర్శనార్థమై ద్వారకామాయిలోకి అవస్థేతో పాటు అడుగుపెట్టిన రేగేతో "ఎవరూ ఈ పిచ్చివాడు" అని అవస్థేను చూపుతూ అడిగేరు శ్రీ సాయిబాబా. ఒక్కక్షణం నిశ్శబ్దం ఆవరించింది. అవస్థే గురించి, బాబా ఎందుకు ఆమాట అన్నారో అర్థంకాలేదు రేగేకు. "అర్థంకాని విషయాలు

ఆలోచించుకునే దానికన్నా సద్గురు సన్నిధిని సద్వినియోగం చేసుకోవటం ఉత్తమమని" భావించిన రేగే శ్రీ సాయి పాదాలపై వ్రాలి నమస్కరించాడు. శ్రీసాయి చిరునవ్వు చిందిస్తూ, అక్కడి భక్తులకు రేగేను చూపుతూ, "ఒంటరిగా రావటంతో వీడికి తృప్తి కలగదేమో, ఎప్పుడూ వచ్చినా తనతోపాటు ఇతరులను కూడ తీసుకువస్తాడు. అందుకనే నా బిడ్డలను సైనికాధికారి రైలులో నుంచి దింపివేస్తుంటే దింపవద్దు వారిని ప్రయాణం చేయనీయండి. వారు నాదగ్గరకు వస్తున్నారు అని చెప్పేను, అందుకే అతను వీరిని దించలేదు. దింపనందుకు రేగే సంతోషంగా మెదలకుండా రైల్లో కూర్చున్నాడా! లేదు, రాత్రంతా నా పక్కన కూర్చొని, బాబా, బాబా అని అరుస్తూ నన్ను నిద్దరపోనీయలేదు" అని అక్కడి భక్తులకు రేగేను చూపుతూ అన్నారు బాబా. శ్రీసాయి సర్వజ్ఞత్వానికి, అవాజ్యమైన ప్రేమకు పరవశించి పోయాడు రేగే.

అచంచలమైన విశ్వాసంతో "గడ్డిపోచనైనా గురువుగా పెట్టుకో, అది గమ్యం చేరుస్తుంది" అంటారు శ్రీ శిరిడీసాయిబాబా. సకలదేవతా, సాధు, జీవ స్వరూపుడయిన జగద్గురువు శ్రీ శిరిడీసాయి బాబాను కూడ అవసరార్థమై ఆరాధిస్తూ, అనుకున్నది నెరవేరనప్పుడు వేరొక గురువును ఆశ్రయించటానికి పరిగెత్తేవారు, అంతటా వ్యాపించి ఉన్న నిజమైన గురుతత్వాన్ని గుర్తెరగని వారే అవుతారు. "గురువు తనచేత సేవ చేయించుకోవటమే కాని ఎటువంటి వేదాధ్యాయనము చేయించలేదని" గురువుని విడిచి వచ్చిన ఒక బ్రాహ్మణుడికి శ్రీ నృసింహసరస్వతిస్వామి గురుతత్వాన్ని ఎరుక పరచిన విధానం 'శ్రీగురుచరిత్ర'లో చూడవచ్చు. పూర్వజన్మ సుకృతము వలన లభించిన గురువును సంపూర్ణముగా విశ్వసించకపోవటానికి కారణం మనలోని సంశయాలే. "సంశయాత్మకుడు ఎప్పుడూ ఎవరి చేత అంగీకరించబడడు" అంటారు శ్రీ గురుడు. గురు సన్నిధి చేరిన తరువాత, వారికి తన జీవన పగ్గాలు అర్పించి ఉండిపోవటమే, అప్పుడు చివరికంటా ఉండి గమ్యం చేరుస్తాడు గురువు.

పాడుబడ్డ మశీదులో నివశిస్తూ, దానికి "ద్వారకామాయి" అని పేరుపెట్టి, ముస్లింలా ఉంటూ, హిందూసాంప్రదాయంగా పూజలందుకునే ఈయన గురించేనా, రేగే చెప్పింది అని అనుకున్నాడు అవస్థే. ఫకీరు లాగా గోచరిస్తూ, సర్వజ్ఞుడైన శ్రీసాయిబాబాను చూస్తూ, అవస్థే మౌనంగా ఉండిపోయాడు. అటుపైన జరిగిన అద్భుత సంఘటన గురించి వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.


## శ్రీ క్షేత్ర కురువపురం

"కురుగడ్డి" అనెడి ఊరు కృష్ణానదిలో ఒకదీవి. దానిని కురుగడ్డ, కురువపురమని కూడా పిలచెదరు. అచ్చట శ్రీపాద శ్రీవల్లభులవారు కొంతకాలము తపస్సు చేసి ఆశ్వీజ బహుళ ద్వాదశి (గురుద్వాదశి) నాడు కృష్ణానదిలో అంతర్ధానమైనారని గురుచరిత్రలో చెప్పబడినది. కురుగడ్డిలో జనులు తెలుగు, కన్నడ భాషలు మాట్లాడుదురు. రెండుమైళ్ళు వెడల్పుగా ప్రవహించి, పారుచున్న కృష్ణానది యందు గల ఈ ద్వీపము ఒక మైలు పొడవు, అరమైలు వెడల్పు కలిగియున్నది. అచ్చట ఒక ప్రక్క దత్తమందిరము, మరియొక ప్రక్క ఊరు, ఆ రెంటి నడుమ పంట చేలు గలవు. మందిరములో శ్రీపాద శ్రీవల్లభస్వామి పాదుకలున్నవి. ఆ దీవికి రెండవ ప్రక్కన ప్రవాహతీరము పైనున్న పెద్దబండపై శ్రీపాద శ్రీవల్లభులవారి పాదచిహ్నములు ఈనాడు మనకు కనపడును. ఒక మానవ శరీరము దానిపై సాగిలపడినట్లు గుర్తులు కనిపించును. కురుగడ్డి దర్శనార్థము పోవువారు చాలా తక్కువ. మహబూబ్‌నగర్ నుండి మక్తల్‌పోయి, అచ్చటి నుండి పంచదేవ పహాడ్ గ్రామము చేరి, కృష్ణా నది దాటి కురుగడ్డికు పోవచ్చును. అలంపురము నుండి కూడ ఒక మార్గమున్నది. రాయచూర్ నుండి ఆత్మకూరు వరకు బస్సులో ప్రయాణించి, అచ్చట కృష్ణానది దాటి మనము పోవచ్చును. అచ్చటకు పోయినవారి అభీష్టములు సిద్ధించునని ఒక విశ్వాసము జనులలో ప్రబలముగా ఉన్నది.



కురుగడ్డిలో ఒక చిన్న గుట్ట ఉండెను. ఆ గుట్టలో ఒక గుహ కలదు. ఒక సర్పము చాలాకాలము నుండి అందులో నివసించుచుండెను. అచ్చటకు మహారాజ్‌పోయి, ఆ గుహ తమ తపస్సునకు అనుకూలముగా నుండునని తలచి, "గుహను విడిచి వేరొకచోటకు పోయి ఉండు" మని దానిని ఆదేశించిరి. వెంటనే ఆ సర్పము బయటకు వచ్చి, ప్రక్కనే ఉన్న రావిచెట్టు వద్దకుపోయి, అచ్చట తన నివాస మేర్పరచుకొనెను. ప్రతి దినము అది ఒక్కసారైనను మహారాజ్ తపస్సు చేసుకొనుచుండు చోటుకు వచ్చి, దర్శనము చేసికొని పోవుచుండెడిది. మహారాజ్ ఆజ్ఞ ప్రకారమా సర్పము ఎవరిని బాధపెట్టెడిది కాదు. జనులు కూడ ఆ సర్పము యెడ మైత్రీభావము కలిగిఉండిరి. పాము నివసించిన గుహను శ్రీవాసుదేవానంద సరస్వతి బాగుచేసి, తమ తపశ్చర్యకై దాని నుపయోగించుకొనిరి. క్రమేపీ భక్తులు రాకతో కురువపురము కొంత అభివృద్ధి చెందినది, వసతి గృహములు, తాగునీరు సౌకర్యము కలదు, వంట సామాను మాత్రము యాత్రీకులే తీసుకొనిపోవలెను. సాధనాపరులకు, ఏకాంతపరులకు, దత్తోపాసకులకు, ఒక అద్భుతమైన ప్రదేశం శ్రీ క్షేత్రకురువపురం. కురువపురములో శ్రీపాదవల్లభుల పాదుకలుగల ప్రధాన మందిరము, శ్రీపాదవల్లభుల అనష్టానమండప ప్రదేశమయిన వటవృక్షము, వాసుదేవానంద స్వామి గుహ దర్శింపదగినవి. ప్రతి గురువారము పల్లకిసేవ విశేషముగా జరుగును. యాత్రికుల కోరిక మీదట మిగిలిన రోజులలో రాత్రి 7.00 గంIIలకు పల్లకీసేవ నిర్వహింతురు.

సేకరణ : **శ్రీమతి వి.యస్.లక్ష్మి**




# విజయదశమి

ఆచార సాంప్రదాయాలు దేశ, కాల, కుల పరిస్థితులననుసరించి ఒక్కో ప్రాంతం - ఒక్కో కులం ఒక్కో కాలంలో చేస్తున్నారు, ఉదా: శు.. పాడ్యమి ఆంధ్రులు (ఉగాది) నూతన సంవత్సరం చేస్తే తమిళులు సూర్య సంక్రమణం రోజున ఉత్తరాదిన గురుడు రాశి ప్రవేశం చేసిన రోజున చేస్తారు. ఆంగ్ల వత్సరాది అందరూ ఒకేరోజు చేస్తారు. ఇవి కాలాన్ని అనుసరించి వచ్చినవి. "సాంప్రదాయేశ్వరి" అని అమ్మవారి నామాల్లో చెప్పినట్లు ఒక్కో కులంలో ఒక్కో సాంప్రదాయం ఉంది. కాలాన్ని బట్టి బ్రాహ్మణులు ఏడు రాత్రుల పెండ్లిని ఏకరాత్రిగా చేసుకోవటం విదితమే. అలాగే కొన్ని పండుగలు పోలాల అమావాస్య, నాగచతుర్థి వంటివి మాసాల మార్పుల్లో చేస్తున్నారు. ఏది ఏమైనా ఇవన్నీ మనకు మేలు చేసేవే. వైజ్ఞానిక, వేదాంత, భక్తి మూలకంగా ఆలోచించిన శుభము శ్రేయము, ముక్తిదాయకము. క్షేమకరమగు ఆచారాలు, సాంప్రదాయాలు రెండూ మనకు రెండు నేత్రములు. ఇక ఈ నెల ఆశ్వయుజమ్. ఇందు గల పర్వదినాలు ఆచరణీయాలు పరిశీలిద్దాం.

చాంద్రమానరీత్యా అశ్వనీ నక్షత్రం పూర్ణిమనాటికి ఉంటుంది గాన అశ్వీయుజం అన్నారు అంటే మొదటి నక్షత్రం - మేషరాశిలో చంద్రుడు ఉండగా తొలిరాశి తొలినక్షత్రంతో ప్రారంభమైన పూర్ణిమ ఈ నెల అమ్మవారికి చాలా ప్రీతి పాత్రమైనది. అంతేకాదు ఎన్నో ముఖ్య పర్వదినాలు గల్గిన మాసం. పాడ్యమి నాటి నుండి శరన్నవరాత్రులు ప్రారంభము. శారదా నవరాత్రులని కూడా అంటారు. వర్షాలు వెనుకబడి భూమి అనుకూల మార్గాలు ఏర్పడి రెల్లు విరివిగా పూసి, నిర్మలమైన ఆకాశం, పసుపురంగు బీరపువ్వులులాంటి కాంతి కల్గి వెన్నెల చాలా ఆహ్లాదకరంగా ఉండే పున్నమి రాత్రి. అందుకే సుగ్రీవాజ్ఞ ననుసరించి వానరులు సీతమ్మవారిని వెదకటానికి అనుకూల సమయమని బయలుదేరారు. నవరాత్రులు అనగా తొమ్మిది (పూర్ణ సంఖ్య) గ్రహాలు 9, రత్నాలు 9, అమ్మవారి ప్రాకారాలు 9 శరీరానికి ఉన్న రంధ్రాలు 9. పాడ్యమినాడు నవగ్రహ, పంచలోకపాలక నక్షత్ర, యోగినీ గణసహిత మంటపావాహన చేసి కలశ స్థాపన చేసి దేవీ నవరాత్రులు ప్రారంభిస్తారు. అమ్మవారి ప్రీతికి 9 రకాల అలంకారములు 9 రకాల పిండివంటలు నివేదన 9 మంది కన్యలను దేవీరూపాలుగా అర్చించుట. కుమారి (2 సం॥లు), త్రిమూర్తిని (3 సం॥లు), కళ్యాణి (4 సం॥లు), రోహిణి (5 సం॥లు), కాళి (6 సం॥లు), చండిక (7 సం॥లు), శాంభవి (8 సం॥ లు), దుర్గ (9సం॥లు) వయస్సుననుసరించి వస్త్రాలంకార భూషణ, ధూప, దీప నైవేద్యాలు లేదా పిల్లలు ఈ సం॥ములు సరిపడినవారు కుదిరితే అర్చించుకోవచ్చును. సుగంధ తైలం పుష్పములు, వస్త్రములు, కాటుక ఆభరణములు సమర్పించవచ్చును. ఇక చాలా ముఖ్యమైనది (దశహోరా). ఇది దసరాగా మారింది 9 రాత్రులు చేయనివారు పంచరాత్రులు (5) లేదా త్రిరాత్రి (3) రోజులు సరస్వతిదేవి పూజ కల్పి 3 రోజుల్లో చేసుకోవచ్చును. దశమి విజయదశమి. ఇది అందరికీ ఆచరణీయమైనది. క్షత్రియులకు ఆయుధపూజ ప్రస్తుతం సైనికులు తుపాకులు, మిషనరీ గన్స్, వాహనాలకు పూజ చేస్తున్నారు. ఆటో, లారీ, వాహనదారులు యంత్రములు కలవారు, వారు వీరు అని అనకుండా అందరూ ఈరోజు పూజలు చేస్తారు. స్నానం, పూజ, నైవేద్యం, పిండివంటలు ఇవే ముఖ్యం కాదు. "శమీ" పూజ అనగా జమ్మి చెట్టు పూజ. "శమీ శమయితే పాపమ్" శనీశ్వర దోష నివారణకు, యుద్ధరంగ, కార్యరంగాల్లో జయం కల్గుటకు పూజ చేయాలి. శ్రీరాముడు రావణుని వధించినది, పాండవుల జమ్మి వృక్షంపై ఆయుధాలు తీసి విజయంచేకొన్నది, జగన్మాత లోకకంటకుడగు మహిషాసురుని మర్ధించి సర్వలోకాలకు సంతోషం కల్గించినది ఆ పర్వదినం నాడే. అమ్మవారి అలంకారాల్లో "శాకంబరీ" అవతారం వలన అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు చూచుట, వాటిని స్పర్శించి, భుజించుట వలన సృష్టి విజ్ఞానవిషయాలు పిల్లలకు పెద్దలకు తెలుస్తాయి. ఆహారం వలన సత్వగుణం అలవడుతుంది. 10 రోజులు నిష్ఠ వలన మనస్సు నిలకడ కల్గి దివ్యానందం కల్గుతుంది. ఈ నెల ప్రారంభానికి ముందు మహాలయ పక్షాలు ఉంటాయి. పితృ కార్యక్రమాలు జరుగుతాయి. (అంటే మాతాపితృలు) మాతృదేవోభవ పితృదేవో భవ వారిని పూజించి వెంటనే జగన్మాత పూజ ప్రారంభం చేస్తామన్నమాట, పాఠశాల పిల్లలు పత్రి నింపి బాణాలతో ప్రతి ఇంటికి వచ్చి "శ్రీరస్తు, శుభమస్తు, దీర్ఘాయురస్తు, ఆరోగ్యమస్తు మీకైశ్వర్యమస్తు" ... జయ జయ జయ జయా జయ మహావిజయా అని దసరా పద్యాలు - పాటలు పాడుతుండేవారు. కొత్త బట్టలు బాణాలు పిల్లలు కోలాహలంతో గ్రామాలు సందడిగా ఉండేవి. అయ్యవారికి చాలు ఐదు వరహాలు - పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు అని పిల్లలు ముద్దుముద్దుగా పాడుతు వుంటే తల్లిదండ్రులు పిల్లల్ని చూసి ఉప్పొంగిపోయేవారు. ప్రస్తుతం ఈ సాంప్రదాయం శూన్యంగా వున్నది. విజయదశమి నాడు ప్రారంభించిన పని విజయమని తిథివార నక్షత్ర లగ్నాలతో పనిలేదని పెద్దల నానుడి మహాకాళి, మహాలక్ష్మి - మహాసరస్వతీ స్వరూపిణి దుర్గామాత (త్రిమూర్తి) అర్చన వలన విద్య, యశస్సు-ధనం, విజయం ఆయురారోగ్యములు కల్గుతాయనటంలో సందేహం లేదు. శ్రీ లలితా సహస్ర - లేదా, త్రిశతి లేదా అష్టోత్తరశత నామావళితో 9 రోజులు, 5,3,1 రోజులైనా అర్చించాలనేదే పెద్దల అభిప్రాయం. ఈ పండగ సందర్భంగా బంధువుల కలయిక ఆనందం. మానసికంగా నిర్వేదంగా ఉన్నవారు ఉత్తేజాన్ని పొందుతారు.

విజయదశమి శుభాకాంక్షలతో....

రచన : **శ్రీ విశ్వనాధ్ చైతన్య మహరాజ్**, ఎందువ, శ్రీకాకుళం



# శ్రీ గురు చరిత్రామృతము

వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు

అద్భుతమైన పాలరాతి సౌధాలు, అందులో బంగారు తాపడాలు రత్నఖచితమైన బంగారు సింహాసనము, పట్టు పీతాంబరాలు, వజ్రవైడూర్యములు పొదిగిన బంగారు ఆభరణాలు, కిరీటము, బంగారు పళ్ళెములో షడ్రశోపేతమైన విందు భోజనాలు మొదలైనవి కాదు జగద్గురువు అయిన శ్రీ శిరిడీసాయిబాబా మన నుంచి ఆశించేది. శ్రీసాయి కోరింది కేవలం రెండు రూపాయలు దక్షిణ మాత్రమే. పన్నెండు సంవత్సరాలు అచంచలముగా తన గురువును సేవించి, వారు అడిగిన రెండు పైసలు అనే దక్షిణ సమర్పణ ద్వారా, తాను పొందిన స్థితిని, తిరిగి మనకు ప్రసాదించటానికి, శ్రీ శిరిడీసాయిబాబా కూడ మననుండి కోరేది కేవలం నిష్ఠ, సబూరి అనే ఆరెండు పైసల దక్షిణ మాత్రమే. గురువుపట్ల అచంచలమైన విశ్వాసం ఒక పైసా అయితే, సర్వకాల సర్వావస్థలయందు అది చెదిరిపోని దృఢమైన నమ్మకము రెండవ పైసా. అవి మనము ఎప్పుడూ సమర్పిస్తూనే ఉంటున్నామని భావిస్తాము, కాని ఒక్కసారి సమర్పణతోనే సర్వం సద్గురుమయమైతే, తిరిగి మరలా సమర్పించేది ఉంటుందా? ఉప్పుతో చేసిన బొమ్మ నీటిలో పెట్టగానే, నీటిలో కరిగిపోయి, తన ఉనికినే కోల్పోయినట్టుగా, శ్రీసాయి అడిగిన రెండు పైసలు దక్షిణ వారికి సమర్పించిన మాట నిజమే అయితే, ఇక నేను, నాది, ఇవ్వటం, పుచ్చుకోవటం అంటూ ఏమీ ఉండదు. అటువంటి దక్షిణే శ్రీసాయి తన గురువుకు సమర్పించింది, తిరిగి మన నుండి శ్రీసాయి ఆశించే దక్షిణ కూడ అదే. అటువంటి దక్షిణ సమర్పించిననాడు, సర్వం తానై మనలో, మనతో ఉండి గమ్యం చేరుస్తారు శ్రీసాయిబాబా, అప్పుడు "మీ భారములు నాపై పడవేయుడు, నేను మోసెదను. నా సహాయముగాని, సలహాను గాని కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను, నీవు నిశ్చింతగా కూర్చో, అవసరమైనదంతా నేను చేస్తాను" అన్న శ్రీసాయి అభయం అనుభవానికి వస్తుంది. ఈ విషయం, కలియుగములో ప్రథమ, ద్వితీయ దత్తావతారులైన శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతి స్వామిల జీవితచరిత్ర అయిన 'శ్రీగురుచరిత్ర'లోని 13వ అధ్యాయం ప్రస్ఫుటముగా తెలియజేస్తుంది.

తన అనుగ్రహపాత్రులవ్వటానికి ఫలానా విధముగా తనకు సేవ చేయమని, శ్రీసాయి ఎన్నడూ చెప్పలేదు. ఆర్తులు, అర్థార్తుల స్థితిని దాటి జిజ్ఞాసువులుగా మారిన వారు గురుతత్వాన్ని ఎరుక పరచుకోవటానికై 'శ్రీగురుచరిత్ర' పారాయణ నిర్దేశించారు శ్రీసాయినాధుడు. గురువు యొక్క నిజతత్వమెరిగి, వారిని సంపూర్ణముగా సేవించి, వారి అనుగ్రహానికి పాత్రులవ్వటానికి కరదీపిక 'శ్రీగురుచరిత్ర'. ఆ గ్రంథ పారాయణ వలన నిరంతరం గురుసన్నిధి అనుభవమవ్వటమే కాకుండా, తదనుగుణముగా జీవిత గమనమేర్పడి సంపూర్ణమైన గురు అనుగ్రహానికి పాత్రులను చేస్తుంది. శ్రీసాయి బోధలలోని ఆంతర్యాన్ని, పరమార్థాన్ని తెలియచేసే, 'శ్రీగురుచరిత్ర' పారాయణ, గురుభక్తులందరికీ అవశ్య పఠనీయము. శ్రీసాయి అడిగిన రెండు పైసలు దక్షిణ అర్థాన్ని, పరమార్థాన్ని, అది సమర్పించే విధానాన్ని అద్భుతముగా ఆవిష్కరిస్తుంది శ్రీగురుచరిత్రలో అంతర్భాగమైన 14వ అధ్యాయము.

కలియుగములో రెండవ దత్తావతారమైన శ్రీనృసింహసరస్వతిస్వామి తన దేశాటనములో భాగముగా, తనపాద స్పర్శతో అనేక క్షేత్రాలను, నదీనదములను పునీతం చేస్తూ, గోదావరీనది పరిక్రమములో భాగముగా వాసర బ్రహ్మేశ్వరక్షేత్రం చేరటం జరిగింది. వారానికో, పక్షానికో ఒక్కపూట కొద్దిపాటి ఆహారం స్వీకరిస్తేనే మరణబాధను కలిగించే ఉదరశూల రోగముతో బాధపడుతూ, ఇక భరించలేక ఆత్మహత్యకు సంసిద్ధుడైన ఒక బ్రాహ్మణుడిని, తన శిష్యులచేత వారింపచేసి, చెంతకు రప్పించుకొనగా, "గతములో తాను చేసిన తప్పులకు ఫలితమే ఈరోగబాధ" అని మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడి, ప్రాయోపవేశానికి సంసిద్ధుడైన ఆ బ్రాహ్మణుడి ఆర్తిని గ్రహించిన శ్రీ నృసింహసరస్వతి స్వామి, "పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తమే లేదని, రోగ నివారణకై, విందు భోజనము ఆరగించమని" తెలుపగా, తేజోమూర్తి అయిన శ్రీ నృసింహసరస్వతిస్వామి వారి దర్శనంతో తన హృదయం ఉప్పొంగగా వారి మాటలపైన అచంచలమైన విశ్వాసముతో సాయందేవుని ఇంట షడ్రశోపేతమైన విందు భోజనాన్ని ఆరగించి, మృత్యుంజయుడైనాడు ఆ బ్రాహ్మణుడు. సద్గురువుకు దక్షిణ సమర్పించటమంటే అదే. కోరికలు నెరవేరటంకోసం శ్రీసాయిబాబాపై భక్తి అనే ఒక పైసా అందరము సమర్పిస్తాము, అయితే భక్తులైన శ్రీ ఆంజనేయుడు, ప్రహ్లాదుడు, తుకారాం, మీరాబాయి మొదలైనవారిగా మారటానికి అవసరమైన రెండవ

పైసా మాత్రము సమర్పించము. అయినా, వారి వెంటఉన్నట్లే, బాబా కూడ నిరంతరం మన వెంట ఉండి కాపాడాలని మన ఉద్దేశ్యము.

ఒక యవనరాజు కొలువులో తప్పనిసరి పరిస్థితులలో పనిచేస్తున్న గ్రామాధికారి అయిన సాయందేవుడు, శ్రీగురుడి దర్శనానికి రాగా, ఉదరశూల రోగికి విందుభోజనము ఏర్పాటుచేయమని శ్రీగురుడు ఆదేశించగా, ఆ బ్రాహ్మణుడి వ్యాధి గురించి తనకు తెలిసినా, ప్రతి సంవత్సరము ఒక బ్రాహ్మణుడిని చంపే ఆరాజ్యాన్ని ఏలే నరరూపరాక్షసుడైన యవనరాజు ఈరోజే తనను బలిపశువు చేయబోతున్నాడని తెలిసినా, తన జీవితపు చివరి క్షణాలలో గురువాజ్ఞను నెరవేర్చే మహద్భాగ్యం కలిగింది అని పరమానందభరితుడై, శ్రీగురుడిపైన అపారమైన విశ్వాసంతో శ్రీగురుడికి సకలోపచారాలతో పూజచేసి, వారికి, వారి శిష్యులతోపాటు, ఉదర శూల రోగికి కూడా తన ఇంట షడ్రశోపేతమైన విందు భోజనం ఏర్పాటు చేసి పరవశించిపోతాడు సాయందేవుడు. దక్షిణ సమర్పించటము అంటే అది.

అపథ్య భోజనముతో ఒక బ్రాహ్మణుడిని మృత్యు కుహరం నుండి రక్షించిన శ్రీగురుడి పాదాలకు ప్రణమిల్లిన సాయందేవుడు, "ఓ సద్గురుమూర్తీ! మీ అపారమైన లీలావిలాసాలను ప్రత్యక్షముగా చూసే మహద్భాగ్యం నాకు కలగటమే కాకుండా, నాజీవితపు చివరి ఘడియలలో త్రిమూర్త్యాత్మకులైన మీకు సకలోపచారాలు చేసి, మీకు తమ శిష్యగణాలకు, నా శక్తిమేరకు భోజనము ఏర్పాటుచేసే మహద్భాగ్యం నాకు ప్రసాదించారు. ఈజన్మకు ఇదిచాలు" అంటూ "ఆరోజు తనను బలిగోరే యవనరాజు వద్దకు తీసుకొని వెళ్ళటానికి ఉదయం నుంచి వాకిట తన కొరకు వేచిఉన్న భటులతో బయలుదేరటానికి అనుమతి ఇవ్వమని వేడిన" సాయందేవుడితో, "యవనరాజు ఎదుట బలిపశువు అయ్యే సమయంలో కూడ నా ఆజ్ఞను శిరసావహించి, ఉదరశూలరోగికి మృత్యుముఖం నుండి బయటపడటానికి సహకరించటమే కాకుండా, చివరి ఘడియలు సమీపిస్తున్నాయి అని తెలిసినా, చిరునవ్వుతో ఆతిథ్యమిచ్చిన నీకు శిరచ్ఛేదము అవుతుంటే చూస్తూ ఊరకుండగలమా! మాపై నీకు గల అపారమైన విశ్వాసమే నీకు రక్ష. ఆ యవనరాజు కేవలం నీ శరీరానికే యజమాని, కాని సృష్టికర్త అయిన భగవంతుడు సర్వంసహ చక్రవర్తి, భగవంతుడి ముందు పిపీలికం వంటివాడు ఆరాజు. విశ్వవ్యాపకుడైన భగవంతుడిని మనసారా కొలచి ఆరాధిస్తూ, అణువణువునూ గురుసేవకే ఉపయోగించే నిన్ను ఆరాజేమిచేయగలడు, కనుక వ్యాకులత మాని ఆనందవదనముతో వెళ్ళి, వధించాల్సిన అతని చేతులతోనే ఘనముగా సత్కరించబడి తిరిగిరా. అంతవరకూ మేము ఇక్కడే వేచి ఉంటాము" అంటూ సాయందేవుడి శిరస్సుపై చేయిఉంచి "దీర్ఘాయుష్మాన్ భవ" అంటూ సాయందేవుడిని ఆశీర్వదించి పంపేరు శ్రీగురుడు.

సాయందేవుడిని తోడ్కొని రావటానికి వెళ్ళిన భటులు ఎంతకు తిరిగి రాకపోవటంతో అసహనంతో చెలరేగిపోయిన ఆ యవనరాజు, తాను కబురు పంపగానే రాకుండా ఆలస్యం చేసినందుకు, సాయందేవుడిని చిత్రహింసలకు గురిచేసి చంపాలనే క్రోధంతో ఊగిపోతూ, అంతఃపురంలోనికి వెళ్ళేడు. అప్పుడే అక్కడకు వచ్చిన సాయందేవుడు అది చూసి శ్రీగురుడిని స్మరిస్తూ ఉండిపోయాడు. అంతఃపురములోనికి వెళ్ళిన ఆ యవనరాజుకు మనస్సులో నిష్కారణంగా తాను ఆక్షణంలో చనిపోతున్నట్లుగా భయం కలిగి, స్పృహ తప్పి పడిపోయాడు. అప్పుడు అతనికి ఒక స్వప్నం వచ్చింది, ఆ స్వప్నంలో ఒక బ్రాహ్మణుడు ఆ రాజును ఈడ్చుకువెళ్ళి కాళ్ళు చేతులు కట్టివేసి, శరీరాన్ని ఖండఖండాలు చేస్తున్నట్లుగా అనుభవం అయ్యి, భయాందోళనలతో పెద్దగా పెడబొబ్బలు పెట్టేడు ఆరాజు. మరుక్షణం స్పృహలోకి వచ్చి, ఒళ్ళంతా చెమటతో తడిసిపోయి ఉండటము చూసి, కొన్ని క్షణాలు నిశ్చేష్టుడై ఉండిపోయాడు ఆరాజు. ప్రతిరోజు "భుక్తికోసం జీవహింస, రాజ్యకాంక్షతో, యుద్ధం నెపంతో సాటి రాజ్యంలోని సైనికులను ఊచ కోతకోసే తాను, కలలో ఒక్క బ్రాహ్మణుడు నాపై కత్తి దూయగానే చావుభయంతో కేకలు వేశానే, అకారణంగా నేను చేసేహింస, సాటిజీవులకు ఎంత బాధ కలిగిస్తుందో కదా! నిష్కారణంగా ప్రతి సంవత్సరము ఒక బ్రాహ్మణుడిని బలికోరే నాకు, వారిలోని వ్యధ, సాయందేవుని రాక ఆలస్యమవ్వటముతో అనుభవమైంది. ఇంతవరకు తాను ఎంతటి దురాగతము చేస్తున్నానో కదా" అని భావించి, పశ్చాత్తాప హృదయుడైన ఆరాజు, తన అంతఃపురం నుండి బయటకు వచ్చి, సాయందేవుడి పాదాలపై పడి, "స్వామీ నన్ను దయచూడండి. నిష్కారణంగా సాటి మనుష్యులను బలికోరే నాకు, మీరాక ఆలస్యం అవ్వటము వలన జ్ఞానోదయమయింది. మీరు మహాత్ములు, మీ పాదస్పర్శతో నా అంతఃపురం పావనమైంది. రండి, ఆశీనులుకండి" అంటూ సాయందేవుడి చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళి, సింహాసనంపై కూర్చుండబెట్టి, సువాసన భరితమైన పుష్పాలు, చీనిచీనాంబరాలు, భూషణాలు తెప్పించి, స్వయంగా సాయందేవుడిని పుష్పమాలాంకృతుడిని చేసి, వస్త్రభూషణాదులతో ఘనంగా సత్కరించాడు ఆ యవనరాజు. మెడపై కత్తిపెట్టి వధించాల్సినరాజు, మెడలో సువర్ణాభరణాలు ధరింపచేయటం చూసి ఆశ్చర్యచకితుడైనాడు సాయందేవుడు. ఇదంతా శ్రీగురుడి యొక్క అపారమైన కృపాలీలావిలాసమేనని స్ఫురణకు రాగా, కన్నులు ఆనందభాష్పాలతో నిండిపోయినయ్యి, "నాయనా! భయపడకు, ఆ యవనుడు నిన్నేమి చేయలేడు. భగవంతుడు సర్వానికి యజమాని, నీవు అతడిచేత ఘనముగా సత్కరింపబడి సంతోషంగా తిరిగి వస్తావు, నీవు వచ్చేదాకా మేము ఇక్కడే ఉంటాము" అన్న శ్రీగురుని అభయం హృదయంలో మార్మోగుతుండగా, అతిథి మర్యాదలతో తనను సాగనంపుతున్న ఆయవనరాజువద్ద సెలవు

తీసుకొని, పరమానందభరితుడైన సాయందేవుడు త్వరిత గతిన తన గ్రామం చేరి, బిడ్డరాకకై ఎదురుచూసే తండ్రి చందాన, తన రాకకై ఎదురుచూస్తూ ఉన్న శ్రీగురుడి చెంతకుచేరి, పాదాలపై పడి, ఆనంద భాష్పాలతో వారి పాదాలు కడిగి, జరిగిన విషయం విపులంగా శ్రీగురుడికి తెలియజేశాడు. ''నీభక్తిశ్రద్ధలే నిన్నుకాపాడినయ్యి. అదే విధముగా నీ జీవిత గమనాన్ని కొనసాగించు, మా పరిక్రమములో భాగంగా పుణ్యతీర్థ, క్షేత్రాలను దర్శిస్తూ, దక్షిణ దిశగా మా ప్రయాణాన్ని కొనసాగిస్తామని" చెప్పి, సంసిద్ధులైన శ్రీగురునితో, "స్వామీ! మీ అపారమైన కృపాకటాక్షాలతో ఆ యవనరాజు నుంచి నన్ను రక్షించి, నాకు పునర్జన్మ ప్రసాదించారు, కనుక నా ఈ శేషజీవితాన్ని మీసేవలో తరింపచేసుకునే మహద్భాగ్యం నాకు ప్రసాదించండి, మీపాదసన్నిధే నాకు పరమావధి" అని పాదాలపై వ్రాలిన సాయందేవునితో "నీవు నాకు ఆత్మసమర్పణ చేసుకున్నావు. కనుక నీవు ఎక్కడ ఉన్నా నిరంతరం నాసన్నిధి నీకు అనుభవమవుతుంది. మేము ఒక పనిమీద వెళుతున్నాము. తిరిగి 16 సంవత్సరాలకు ఈ గ్రామ సమీపానికి వస్తాము. అప్పుడు నీవు సకుటుంబ పరివారముతో వచ్చి, నీ అభీష్టం మేరకు మా ప్రత్యక్ష సన్నిధిలో ఉండిపోవచ్చు, అంతవరకు పదుగురికి ఆదర్శముగా నిలుస్తూ, ఇక్కడే సుఖజీవనం కొనసాగించు" అంటూ ఆశీర్వాదపూర్వక అభయమిచ్చి, తన శిష్యులతో కలసి తీర్థయాత్రలకు బయలుదేరేడు శ్రీగురుడు.

తన గురువుపైన అచంచలమైన విశ్వాసము, సర్వకాల సర్వావస్థలయందు అది చెదరిపోని దృఢమైన నమ్మకం అనే రెండు పైసల దక్షిణ శ్రీగురునికి సమర్పించటము ద్వారా తాను రక్షింపబడటమే కాక, సద్గురుకృపతో నరరూప రాక్షసుడైన ఆ యవనరాజు మనిషిగా మారటానికి కారణభూతమైనాడు సాయందేవుడు. శ్రీసాయిబాబా కూడ మననుంచి కోరేది అటువంటి దక్షిణే. అవి ఎట్లా సమర్పించాలో, అందుకు ఏమిచేయాలో తెలియ చేస్తుంది జగద్గురు స్వరూపమైన 'శ్రీగురుచరిత్ర' గ్రంథరాజము. అపార జ్ఞాన సముద్రమైన శ్రీగురుచరిత్రలోని మరొక జ్ఞానామృతపు బిందువును వచ్చే సంచికలో గ్రోలటానికి ప్రయత్నిద్దాము.

## పండుగలు - పర్వదినాలు

**అక్టోబరు - 2019**

2 గాంధీ జయంతి
5 సరస్వతి పూజ
6 శ్రీ దుర్గాష్టమి
8 విజయదశమి
శ్రీ శిరిడీ సాయి 101వ మహాసమాధి మహోత్సవము
13 వాల్మీకి జయంతి
16 అట్లతద్ది
26 ధనత్రయోదశి
27 నరక చదుర్ధశి
28 దీపావళి
30 పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి జయంతి

**నవంబరు**

1 మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి జయంతి (తేదీప్రకారం)
3 పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి (తిథిప్రకారం)
శ్రీసాయి దీక్షలు (మండలం) ప్రారంభం – పవర్‌సిటీ
6 అవధూత శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
12 కార్తీకపూర్ణిమ, అవధూత శ్రీ పూండీస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం), గురునానక్ జయంతి
17 అవధూత శ్రీ వేణుగోపాలస్వామి ఆరాధనోత్సవము (శ్రీకాళహస్తి)
21 శ్రీ రంగావధూత జయంతి
22 శ్రీ సాయిదీక్షలు (అర్ధమండలం) ప్రారంభం – పవర్‌సిటీ
29 శ్రీ ధునివాలాదాదా ఆరాధనోత్సవము (తేదీప్రకారం)

**డిసెంబరు**


2 శ్రీ సుబ్రమణ్యషష్టి
7 గీతాజయంతి, శ్రీ మాణిక్య ప్రభువుఆరాధనోత్సవము
శ్రీ సుదీంద్రబాబు ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
11&12 శ్రీ దత్తజయంతి మహోత్సవములు – పవర్‌సిటీ, వైజాగ్
11 శ్రీ దత్తజయంతి మహోత్సవము
12 శ్రీ సాయిదీక్షలు విరమణ
16 ధనుర్మాసం ప్రారంభం
19 శ్రీ అనఘాష్టమీ వ్రతం
24 శ్రీ ఉపాసనీబాబా ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
25 క్రిస్టమస్
26 సూర్యగ్రహణం
30 భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి
31 ఆంగ్ల నూతన సంవత్సరం (2019)
వీడ్కోలు ప్రత్యేక సత్సంగమము – పవర్‌సిటీ

**జనవరి - 2020**

1 ఆంగ్ల నూతన సంవత్సర ప్రత్యేక సత్సంగమము
6 వైకుంఠ / ముక్కోటి ఏకాదశి
14 భోగి పండుగ
15 మకర సంక్రాంతి (ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం)
16 అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము
26 రిపబ్లిక్ డే
27 హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా జయంతి
30 శ్రీ మహాత్మాగాంధీ వర్ధంతి

# స్ఫూర్తిప్రదాత - శ్రీ బి.వి. నరసింహస్వామి

సేలం జిల్లాలోని పవిత్ర కావేరి మరియు భవానీ నదీ సంగమ ప్రాంతంలో వెలసియున్న భవానీ గ్రామంలో 1874 ఆగష్టు 21వ తేదీ శుక్రవారం నాడు నరసింహన్ అయ్యర్ జన్మించారు. వీరి పాఠశాల విద్య సేలంలోనూ, ఉన్నత విద్యాభ్యాసం మద్రాసు కళాశాలలోనూ జరిగింది. న్యాయశాస్త్రంలో పట్టభద్రులైన పిదప సేలంలో న్యాయవాద వృత్తిని చేపట్టారు. అచిరకాలంలోనే గొప్పపేరు ప్రఖ్యాతులు సాధించి సేలంలోనే పేరెన్నిక గల న్యాయవాదిగా ఎదిగారు. తప్పుడు కేసులను ఎట్టి పరిస్థితులలోనూ చేపట్టెడివారు కాదు వాది, ప్రతివాదిల మధ్య వీలైనంతవరకు రాజీ కుదిర్చేవారు. పలు సందర్భాలలో న్యాయస్థానం కంటే శ్రీస్వామి వ్యక్తిగతంగా పరిష్కరించే కేసులే ఎంతో న్యాయబద్ధంగా ఉండేవి. ఫలితంగా గొప్ప న్యాయనిర్ణేతగా వేనోళ్ళ కీర్తించబడినారు.



బ్రిటీషు వారి దాస్యశృంఖలాలతో బంది అయిన భరతమాత దీన స్థితికి ఆవేదన చెంది, అనిబీసెంటు, వి.ఎస్. శ్రీనివాసశాస్త్రి, బాలగంగాధర్ తిలక్ మరియు రాజగోపాలాచారి వంటి నాయకులను అనుసరించి స్వాతంత్ర్య సమరానికి ఉద్యుక్తులైనారు శ్రీస్వామి. సేలం, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల ప్రతినిధిగా మద్రాసు శాసన మండలి సభ్యుడైనారు. వరుసగా మూడు దఫాలు ఎన్నికకాబడి జాతి ఆదర్శాలకు ప్రతీకగా పనిచేశారు. వీరి ప్రసంగాలు చాలా సూటిగా, ఘాటుగా విమర్శనాత్మకంగా నడిచేవి. ఆ రోజుల్లో ప్రతిపక్షంలో ఉండి మంచి పేరు తెచ్చుకోవడం అంత సులభమైన విషయం కాదు. వార్తాపత్రికలు శ్రీస్వామిని ప్రతిపక్ష సింహంగా కీర్తించాయి. శ్రీ నరసింహస్వామి తమ ఉద్యమాన్ని భారతావనికి మాత్రమే పరిమితం చేయలేదు. శ్రీ మంజేరి రామయ్యర్‌తో కలిసి ఇంగ్లండుకు పయనమయ్యారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగల సామర్థ్యం వీరికి కలదని భావించిన బ్రిటీష్ ప్రభుత్వం వీరి వ్యూహాన్ని పసిగట్టి జిబ్రాల్టర్ వద్ద వీరిని అరెస్టు చేసి ఇండియాకు త్రిప్పి పంపింది.

భగవత్ సంకల్పము చాలా చిత్రమైనది. శ్రీ బి.వి.నరసింహస్వామి జీవితంలో అనుకోకుండా సంభవించిన దుర్ఘటన వారి దృక్పథంలో పెను మార్పుకు దోహదపడింది. సంసార లంపటం నుండి బయటపడడానికి వీరు కృత నిశ్చయులైనారు. రాజకీయాలకు స్వస్తి చెప్పారు. ఆధ్యాత్మిక రంగం వైపు అడుగులు వేశారు. శ్రీ రమణాశ్రమము చేరిన శ్రీ నరసింహస్వామి అచట ఒక గుహలో నివసిస్తూ, మౌనదీక్షతో తపస్సు కొనసాగించారు. భగవాన్ రమణమహర్షి జీవిత విశేషాలను సమగ్రంగా అధ్యయనం చేసి, ఆ సమాచారం ఆధారంగా 'సెల్ఫ్‌రియలైజేషన్' అనే గ్రంథాన్ని వెలువరించారు. ఆ గ్రంథం నేటికినీ భారతావనిలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఆ తర్వాత వారు శిరిడీ చేరారు. బాబా సన్నిధిలోవారి మనస్సు స్థిరత్వం పొందింది. వారికి పరమశాంతి లభించింది. ఆయన జిజ్ఞాసకు తగు సమాధానం లభ్యమయ్యింది. సంసార సాగరంలో పడి కొట్టుమిట్టాడుతున్న మానవాళిని ఒడ్డుకు చేర్చే తరుణోపాయాన్ని తెలియజేసి, పరమశాంతిని ప్రసాదించే అవకాశం పంచవలెనని, శ్రీసాయిమార్గాన్ని ప్రపంచానికి చాటాలని కృతనిశ్చయులైనారు శ్రీ బి.వి. నరసింహస్వామి.

బాబా ఉపదేశాలు విస్తృతంగా ప్రచారం చేసే నిమిత్తమై శ్రీ నరసింహస్వామి మద్రాసులో "అఖిల భారత సాయి సమాజ్"ను స్థాపించారు. దానికి అనుబంధంగా 'సాయిసుధ' అనే పత్రికను కూడా ప్రారంభించారు. దేశమంతటా పర్యటించి వందలాది ప్రసంగాలలో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నారు. సకల జనులలో సాయిపట్ల భక్తిప్రపత్తులు పెరిగాయి. బాబాతో వ్యక్తిగత పరిచయమున్న అనేకమంది భక్తుల నుండి, ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించి ఆ అనుభవాలను గ్రంథస్థం చేసారు. శాస్త్రాలలో ఉన్న క్లిష్టమైన ఆధ్యాత్మిక విషయాలను సరళమైన భాషలో పలువురకు అర్థమయ్యే రీతిలో రచించడం వీరి ప్రత్యేకత. అంతే కాకుండా వాటిని సామాన్యుడు నిత్యజీవితంలో అనుష్ఠించే విధంగా వీరి ఉపదేశం సాగింది.

శ్రీ నరసింహస్వామి వారి మాటలలో హుందాతనం, వాక్కులలో స్పష్టత, చేతలలో ఋజుత్వం వ్యక్తమయ్యేది. ఎక్కువ సమయం వారు మౌనదీక్షలో ఉండేవారు. బాబా భక్తుల కష్టసుఖాలను పంచుకుంటూ, వారిపై పుత్రవాత్సల్యంతో ప్రేమానురాగాలను కురిపించేవారు.


భక్తి మార్గాన్ని ప్రచారం చేయడమే కాక, మానవసేవకు వీరు అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారు. వీరిలోని నిబద్ధత, క్రియాశీలకశక్తి వీరిని మద్రాసులోని మైలాపూర్‌లో సాయిమందిర నిర్మాణం వైపు పురికొల్పింది. దీనికి అనుబంధంగా ఓ ఉచితాసుపత్రిని, సమాజ సభ్యులకొరకు గ్రంథాలయాన్ని కూడా వీరు ప్రారంభించారు.

శ్రీ బి.వి.నరసింహస్వామి 19-10-1956 శుక్రవారం నాడు మహాసమాధి చెందేరు. ఆయన జన్మదినము కూడా శుక్రవారమే అవటము విశేషం. వారు నిరంతరం చెరగని చిరునవ్వుతో సర్వులపట్ల సమ భావాన్ని ప్రదర్శిస్తూ భక్తుల కష్టాలను తనవిగా భావించి వారికి ఉపశమనం కల్గించేవారు. తాను బోధించిన విషయాలను ఆచరణలో చూపి, సర్వులకూ, మార్గదర్శకులయ్యారు.

అక్టోబరు 19వ తేదీ పూజ్య శ్రీ బి.వి. నరసింహస్వామి వారి
ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ


మూలం : **సిల్వర్‌జూబ్లీ సావనీర్ 1966**

రచన : **శ్రీ వి.కె. పంతులు**, విశ్రాంతి కార్యదర్శి, ఎ.వి.ఎస్.ఎస్.





# ఒక్క క్షణం !

"నేనివ్వదలచింది నాభక్తుడడిగే వరకు, నా భక్తుడడిగింది ఇస్తుంటానని" సాయి వాగ్దానం చేసారు. అయితే ఆయన మనకివ్వదలచింది ఏది? అది తప్పకుండ విశిష్టమైనదై ఉండాలి. దాన్ని మనమెందుకాయనను అడుగలేకపోతున్నాము? కొంచెం పరిశీలిద్దాము.

ఆయన మనకు ప్రసాదించదలచింది ఆయన స్థితినే. పూర్ణ తృప్తి శాంతులతో నిండిన దుఃఖ స్పర్శయేలేని ఆనంద స్థితియే వారి నిజస్థితి. అయితే ఈ జగత్తు, అందులోని జీవులే సత్యమని నమ్మే మనకు విషయ సుఖానుభవం ద్వారా తృప్తి, శాంతి లభిస్తాయన్న అపోహ బలంగా నాటుకొని ఉంటుంది. అదే నిజమైతే ధనము, కీర్తి, హోదాలు అపారంగా వున్నవారికి దుఃఖము, అశాంతి, అసంతృప్తి వుండకూడదు కదా! కాని వాస్తవమెందుకు విరుద్ధంగా వుంది. అందుకనే సుఖదుఃఖాల యదార్థ స్వరూపం తెలిస్తేగాని, చిక్కుముడి వీడదు. ఈ లోపల సాయి మనకోరికలెన్ని తీర్చినా, తీర్చవలసినవింకా వుండి, అవి తీరలేదన్న దుఃఖం మిగిలే వుంటుంది.



ఈనాటి మన సుఖదుఃఖాలు ఒకనాటి మన పుణ్య పాపకర్మల ఫలాలేనని "చెన్నబసప్ప, వీరభద్రప్ప"ల లీల ద్వారా సాయి స్పష్టం చేసారు. అంతేకాదు ఋణము, శత్రుత్వము, హత్య వీటికి పరిహారం చెల్లించే తీరాలని చెప్పారు. ఆ కారణంగా త్రికరణాలతో మనం చేసే పుణ్య పాప కర్మల ఫలాలు, జీవితానుభవాల ద్వారా సుఖదుఃఖాల రూపంలో మనకనుభవమవుతాయి. జనన మరణాలలాగా, అనివార్యంగా ప్రాప్తించే వీటిని గురించి దుఃఖించటముగాని, సంతోషించటము గాని వ్యర్థమని యోచిస్తే తెలుస్తుంది. మనం చూస్తున్న సినిమా అంతా ముందుగా ఫిలిమ్‌లో నిక్షిప్తమై యున్నట్లుగానే, జీవితానుభవాలన్నీ విశ్వచైతన్యంలో నిక్షిప్తమై యుండి, కాలగతిలో మనకెదురవుతుంటాయి. ఇవి త్రికాలజ్ఞులైన సాయికి ముందుగానే తెలుస్తాయి. అజ్ఞులైన మనకు తెలియవు. ఈ విషయాన్నే ద్వారకామాయి గోడపై నున్న "బల్లికూసిన లీల" ద్వారా శ్రీసాయి స్పష్టం చేసారు. "మన మొకప్పుడు బ్యాంకులో దాచుకున్న డబ్బు తిరిగి మనకు లభించినప్పుడు పొంగిపోవలసిన కారణమేమున్నది. మన మొకప్పుడు బ్యాంకులో అప్పు తీసుకొని, ఖర్చు పెట్టుకున్నాక, అప్పు తీర్చవలసి వచ్చినప్పుడు కృంగవలసిన అగత్యమేమున్నది. జీవితంలో అనివార్యమైన కష్టసుఖాలు ఇట్టివేనని దృఢంగా గుర్తుంచుకొని, సమభావంతో సాధన కొనసాగించడమొక్కటే శాశ్వతమైన దుఃఖ నివృత్తికి మార్గమంటూ" పై భావాన్నే దృఢపరచారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు.

కోరికలే దుఃఖమని, వాటిని అదుపుచేయడమే దుఃఖనివృత్తికి మార్గమని బుద్ధుడు చెప్పారు. జన్మాంతర సంస్కారాలే, మనసు ద్వారా కోరికల రూపంలో బహిర్గత మవుతాయి. కాబట్టి కోరికలను అదుపుచేయటానికి మనస్సును అదుపుచేయడమే మార్గం. కాని మనస్సును నిగ్రహించటం, గాలిని నిగ్రహించటం కన్నా కష్టమని గీతలో కృష్ణుడు చెప్పాడు.

మనసును "కల్లు త్రాగి, నిప్పుతొక్కిన కోతితో" పోల్చారు. మనకే లొంగియుండవలసిన మనస్సుకు మనం లొంగిపోయామా, ఆత్మ వినాశనాన్ని కొనితెచ్చుకుంటాము. "ఒక బ్రాహ్మణుడు భుక్తాయాసంతో అడవి మార్గం గుండా పోతున్నాడు. కొంత సేపటికి అలసి, ప్రక్కన వున్న చెట్టు నీడన కూలబడ్డాడు. మంచముంటే కొంతసేపు విశ్రాంతి తీసుకోవచ్చు గదా అని అనుకోగానే ఎదురుగా మంచము, పరుపు ప్రత్యక్షమయ్యాయి. అతడాశ్చర్యపడ్డాడు. తానున్నది కల్పవృక్షం నీడన అని, అడిగిన వెంటనే అది అన్ని ప్రసాదిస్తుంది అని అతనికి తెలియదు కదా! హాయిగా మంచం మీద పడుకొని, నొప్పులు తగ్గేలాగా ఎవరైనా కాళ్ళు పడితే బాగుండునని తలచాడు. వెంటనే అప్సరసల్లాంటి స్త్రీలు ప్రత్యక్షమై పాదసేవనం చేయసాగేరు. అతడికెంతో ఆనందమయింది. నిద్రముంచుకు రాసాగింది. ఇంతలో తాను నిద్రలోకి జారుకోగానే ఏపులినో వచ్చి మింగితేనో అన్నసందేహం అతని మనసులో మెదిలింది. వెంటనే పులి ప్రత్యక్షమై అతడిని మింగేసింది" ఇదీ కథ. ఇలా వుంటాయి మన మనసు చేసే తిక్క సంకల్పాలు. అందుకే మనస్సును నమ్ముకుంటే మనగతి అధోగతి.

మరి మనసును నిగ్రహించే మార్గమే లేదా! ఉంది. శ్రీసాయిలీలామృత పారాయణతో త్రికరణ శుద్ధిగా సాయిని సేవించటమొక్కటే అందుకు సరియైన మార్గం. అప్పుడే జగత్తు సాక్షాత్తు సాయిరూపంగా దర్శనమిస్తుంది. మనసు ఏకాగ్రమై శక్తిని పొందుతుంది. సాయికి మన జన్మాంతర సంస్కారాలతో పాటు శక్తి సామర్థ్యాలు కూడా ఎరుకయే. అందుకే మనమున్న స్థాయినుండే సాధనా సోపానాలను నిర్మించి తరింపచేస్తారు. అయితే కొన్ని కష్టాలు అల్పజ్ఞులు, అల్పాయుష్కులమైన మనలను సాధనా మార్గంలో నిలువనియ్యవు. మన అర్హతతో నిమిత్తం లేకుండా, తన పుణ్యం అడ్డంవేసి, ఆ కష్టాలను సాయి తొలగిస్తారు. "ఒడిలో బిడ్డను పెట్టుకొని కొలిమివేస్తున్న కంసాలి వాని భార్య లీల, ఇందుకు సాక్ష్యం. బిడ్డ నిప్పుల్లో పడకుండా కాపాడేందుకు సాయి తన చేతినే నిప్పుల్లో పెట్టారు. ఇలా కష్టాలు తొలగడంతో మనకు వారిపై

అనన్యమైన భక్తి, విశ్వాసాలు స్థిరపడతాయి. సర్వజ్ఞుడు, సకల జీవ స్వరూపుడు, సర్వవ్యాపి, తల్లి, తండ్రి, గురువు, సర్వమూ సాయియే నంటూ సహస్రనామాలతో వారిని పూజిస్తాము. సర్వజ్ఞుడైన సాయి మనమడిగినవేగాక మనకు శ్రేయస్కరమైన వాటినే ప్రసాదిస్తారన్న వివేకం క్రమేపి మనలో మేల్కొంటుంది. జ్వరంతోఉన్న బిడ్డ, అన్నమడిగినప్పుడు పెట్టని తల్లికి, ఆ బిడ్డపై ప్రేమ లేదనగలమా? అంతటితో జీవితానుభవాలన్నిటిని సాయి ప్రసాదాలుగా గుర్తించగలుగుతాము. ఇక దుఃఖ మెక్కడిది? ఇదే సాయి మనకు ప్రసాదించదలచిన యోగులు స్థితి. అయితే ఈ స్థితినందుకోవడం అంత సులభమా అని చదువరుల మనస్సు శంకించవచ్చు. శ్రద్ధ, పట్టుదల, గురుభక్తిగల సాత్త్వికులకిది ఎంత సులభమో, రజోగుణ తమోగుణ ప్రధానులైన అసురీసంపద కలవారికి అంత కష్టం. అందుకే శాస్త్రమంటుంది. "నయనాత్మా బలహీనేన లభ్యః" (బలహీనులకు ఆత్మజ్ఞానం లభ్యమవదు) యని. – మనలోని అసురప్రవృత్తులను దునిమాడి, బలహీనతలపై విజయం సాధించమనే సాయిబోధ. అది సాధించిననాడు, విజయదశమినాడు భౌతికదేహం వీడి శుద్ధచైతన్యంలో నిలచిన శ్రీసాయి, మనలో మనతో ఉండి ఆత్మజ్ఞానం దిశగా పయనింపచేస్తారు. ఆనాడే మనకు నిజమైన దసరా, విజయదశమి – దీపావళి. ఆదిశగా మన అడుగు సాగుతున్నదో లేదో అని ఒక్కక్షణం ఆలోచించి ముందుకు సాగుదాం.


విజయదశమి శుభాకాంక్షలతో...

సౌజన్యం : **సద్గురు స్మృతులు**

మీ... **జె.వి. సుబ్బయ్యమాష్టారు**, ఒంగోలు.

# ఆదర్శమూర్తి - శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి

శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారు దేశ ప్రధాని కాకముందు ఉత్తరప్రదేశ్‌లో అలహాబాద్ మునిసిపల్ ఎన్నికలలో గెలిచారు. దానితో సహజంగా "అలహాబాద్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టు"కు కూడా ట్రస్టీ అయ్యారు. అప్పుడు అక్కడ 'టాగూర్‌నగర్' అనే పేరుతో 1/2 ఎకరా భూమిని ప్లాట్లుగా విభజించి వేలానికి పెట్టారు. శ్రీ శాస్త్రి వూళ్ళో లేని సమయంలో ఆయన అంతరంగిక మిత్రుడొకాయన కమీషనర్‌ను కలిసి 'శాస్త్రి' గారికి సొంత ఇల్లులేదు. కాబట్టి ట్రస్టు సభ్యులందరూ ఒక్కో ప్లాటు దక్కించుకొనేలాగా ఒప్పించి, తనకు, శాస్త్రికి ఒక్కో ప్లాటు సంపాదించగలిగాడు. ఆ విషయాన్ని శ్రీ శాస్త్రిగారి భార్య లలితాశాస్త్రితో చెపితే "పోనీలెండి, అన్నయ్యగారూ, మీ ప్రయత్నం కారణంగా ఇన్నేళ్ళకు "స్వంత ఇల్లు" అనే మా కల నెరవేరబోతుంది. అని సంతోషించారట. రెండురోజుల తరువాత అలహాబాద్ తిరిగొచ్చిన శ్రీ శాస్త్రిగారికి ఈ విషయం తెలిసింది. ఆయన చాలా బాధపడ్డాడు. తన అంతరంగిక మిత్రుడిని



పిలిచి "నాకు ఈ విషయం తెలిసినప్పటినుండి రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. మనం ప్రజాప్రతినిధులం. ప్రజలముందు నిజాయితీగా నిలవాల్సిన వాళ్ళం. నేను నా ప్లాటును వాపసు ఇచ్చేస్తున్నాను. మీరుకూడా వాపసు ఇచ్చేయండి. లేదా రాజీనామాచేసి, సాధారణ పౌరుడిగా వేలంపాటలో పాల్గొని, కావాల్సి వుంటే ప్లాటును దక్కించుకోండి." అని చెప్పి ప్లాటును ట్రస్టుకే వాపసు ఇచ్చేసారట. జీవితాంతం స్వంత ఇల్లులేకుండానే జీవించారు.

శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రిగారు దేశ ప్రధానమంత్రి అయిన తరువాత కూడా ఆయన కొడుకులు సిటీ బస్సుల్లోనే ప్రయాణించేవారు. కొందరు స్నేహితులు ఈ విషయంగా కొంచెం గేలిచేయడంతో, కారు కొనమని వాళ్ళు తండ్రి (శాస్త్రిగారు) మీద ఒత్తిడిచేస్తే ఇష్టంలేకపోయినా ఆయన అక్కడక్కడ అప్పులుచేసి ఒక ఫియట్‌కారు కొన్నారు. కారు కొనేందుకు చేసిన అప్పు ఇంకా 4600 రూపాయలుండగా శ్రీ శాస్త్రి మరణించారు. దేశవ్యాప్తంగా శ్రీ శాస్త్రిగారి అభిమానులు, ఆయన భార్య లలితాశాస్త్రికి మనీఆర్డర్ చేశారట. రెండు సంవత్సరాలపాటు ఆమె ఆ మనిఆర్డర్‌లు అందుకొన్నారట. వెంటనే ఆమె, డబ్బు పంపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలతో ఉత్తరం వ్రాస్తూ, డబ్బును కూడా తిరిగి పంపించివేశారు.

శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారు ప్రధానిగా ఉన్న సమయంలో వారి పెద్దకొడుకు హరికృష్ణ శాస్త్రి అశోక్ లేలాండ్ సంస్థలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆ సంస్థవారు హరికృష్ణశాస్త్రికి సీనియర్ జనరల్ మేనేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. సంతోషించిన హరికృష్ణశాస్త్రి మరుసటిరోజు శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారికి ఈ విషయం తెలిపాడు. ఒక నిమిషం ఆలోచించి, "హరీ, ఆ సంస్థ, అకస్మాత్తుగా నీకెందుకు ప్రమోషన్ ఇచ్చిందో నేనూహించగలను. కొన్ని రోజుల తరువాత, ఆ కంపెనీవాళ్ళు ఏదో ఒక సహాయం చేయండని నాదగ్గరకు వస్తారు. నేను వారికాసహాయం చేస్తే దేశ ప్రజలు దాన్నెలా అర్థంచేసుకుంటారో నాకు తెలుసు. నీకూ తెలుసు. పాలకుల నిజాయితీని ప్రజలు శంకించేలాగా జీవించడానికి నేను వ్యతిరేకం. కాబట్టి నీవు వెంటనే ఆ సంస్థలో నీ ఉద్యోగానికి రాజీనామా చేయి. నేను ప్రధానిగా వున్నంతకాలమూ నీవు ఆ సంస్థలో ఉద్యోగం చేయడానికి లేదు" అన్నారట శ్రీ ఆదర్శమూర్తి శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రిగారు.

**అక్టోబరు 2వ తేదీ శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రిగారి జయంతి సందర్భముగా సమర్పణ**

ఆధారం : **శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి జీవిత చరిత్ర**

సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష,** గోవా, మహరాష్ట్ర

# జిజ్ఞాస



"గురువు అంటే తాను ఆత్మ సాక్షాత్కారం పొంది, తన శక్తితో ఇతరులను కూడ ఆత్మ సాక్షాత్కారం వైపు సాగేందుకు సహాయపడే వ్యక్తే నిజమైన గురువు" అంటూ గురువు యొక్క నిజస్థితిని తెలియజేసి, గురువు గురించి, వారి తత్వంగురించి భక్తులు అడిగిన అనేక ప్రశ్నలకు భగవాన్ ఇచ్చిన సమాధానాలను "శ్రీరమణమహర్షి బోధనలు" సౌజన్యంతో డిసెంబరు 30వ తేదీ భగవాన్ శ్రీరమణమహర్షి జయంతి సందర్భముగా మీకందిస్తున్నాము. – సంపాదకుడు

**ప్రశ్న : గురువు యొక్క కృప అంటే ఏమిటి? అది ఆత్మసాక్షాత్కారానికి మార్గాన్ని ఎట్లా చూపుతుంది?**

**మహర్షి:** గురువే ఆత్మ. మనిషి తన జీవితం గురించి అసంతుష్టుడవుతాడు ఒక్కోసారి తనకున్న దానితో సంతృప్తి చెందడు. తన కోర్కెలు తీరటానికై భగవంతుడిని ప్రార్థిస్తాడు. కేవలం తన కోర్కెలు తీరటం కంటే, భగవంతుని కృప కోసమే భగవంతుడిని తెలుసుకోవాలన్న దశ వచ్చేంతగా అతని మనస్సు క్రమేపీ పరిశుద్ధ మవుతూవుంటుంది. అప్పుడు భగవంతుని కృప, రూపం దాలుస్తుంది. భగవంతుడే గురువు రూపం దాల్చి భక్తునికి కనబడి, సత్యం గురించి బోధిస్తాడు. అంతేకాక, తన సాంగత్యం వల్ల అతని మనస్సుని ఇంకా నిర్మలం చేస్తాడు. భక్తుని మనస్సు పటిష్టమవుతుంది. అంతర్ముఖ మవుతుంది. ధ్యానం వల్ల ఇంకా పరిశుద్ధమై నిశ్చలమవుతుంది. ఆ ప్రశాంతతే, ఆత్మ. గురువు బయటా, లోపలా కూడా ఉంటాడు. బయటనుంచి, మనస్సు అంతర్ముఖమయేట్లు తోస్తాడు. లోపలినుంచి మనస్సుని ఆత్మవైపులాగి, అది ప్రశాంతమయేట్టు చేస్తాడు. అదే గురుకృప అంటే. దైవమూ, గురువూ, ఆత్మా–ఒక్కటే. వాటిలో బేధాలు లేవు.

**ప్రశ్న : గురువు ఎట్లా లభిస్తాడు?**

**మహర్షి:** సర్వాంతర్యామి అయిన భగవంతుడే తన భక్తుని పట్ల జాలితో భక్తుని పరిపక్వతను బట్టి సాక్షాత్కరిస్తాడు. అతడొక మనిషి అనుకొని, భక్తుడు ఇద్దరు దేహధారుల మధ్య ఉండే సంబంధాన్ని ఎదురుచూస్తాడు. కాని గురువు భగవంతునికీ, ఆత్మకీ రూపం. లోపలి నుండే పనిచేస్తాడు. భక్తుని దోషాలను తెలిపి, అతను అంతరంగంలోని ఆత్మను చేరుకునే వరకూ సరియైన మార్గంలో నడిపిస్తాడు.

**ప్రశ్న : సద్గురు లక్షణాలేమిటి?**

**మహర్షి:** ఎల్లవేళలా ఆత్మలో సంస్థితమవటం – అందరినీ సమానంగా చూడటం, ఎల్లవేళలా అన్ని ప్రదేశాలలో, అన్ని పరిస్థితులలో – అచంచలమైన ధైర్యం కలిగి ఉండటం.

**ప్రశ్న : గురుకటాక్షం వల్లనే శిష్యునికి ఆత్మసాక్షాత్కార మవుతుందని అంటారు ఎట్లా?**

**మహర్షి:** కలలో, సింహాన్ని చూచి మేల్కొనే ఏనుగు పరిస్థితి వంటిదే అది. సింహం కనబడినంత మాత్రానే ఏనుగు మేల్కొని నట్టే, గురువు యొక్క కృపావీక్షణం సోకినంత మాత్రానే శిష్యుడు తన అజ్ఞానపు నిద్రనుండి మేల్కొని, నిజమైన జ్ఞానోదయాన్ని అనుభవిస్తాడు.


**ప్రశ్న : సరియైన గురువు గురించి నిశ్చయించు కోవటమెట్లా? గురువు యొక్క స్వరూపమేమిటి?**

**మహర్షి:** నీ మనస్సు ఎవరినైతే శృతి కలుపుతుందో అతడే సరియైన గురువు. "అతనికి ప్రశాంతత, ఓర్పు, క్షమాది సద్గుణాలుండాలి. సూదంటురాయి ఇనుముని ఆకర్షించినట్లు, అతను తన చూపుతోనే ఇతరులను ఆకర్షింప గలగాలి. అతనికి అందరి పట్లా సమభావముండాలి. ఈ లక్షణాలున్న వాడే సద్గురువు. అయితే గురువు యొక్క స్వరూపాన్ని తెలుసుకోవాలంటే, నీ స్వరూపాన్ని నీవు తెలుసుకోవాలి ముందు. తన నిజస్వరూపమేమిటో తెలియని వాడు, గురువుయొక్క స్వరూపాన్ని ఎట్లా తెలుసుకో గలుగుతాడు? గురువు యొక్క స్వరూపాన్నిగాని, రూపాన్నిగాని, తెలుసుకో గోరితే ముందుగా విశ్వమంతా గురు రూపంగా చూడగలగాలి. అన్ని జీవరాశులలోనూ గురువుని చూడగలగాలి. భగవంతుని విషయంలోనూ అంతే. అన్నింటినీ భగవంతుని రూపంగానే చూడాలి. తన ఆత్మనే ఎరుగని వాడు భగవంతుని నిజరూపాన్ని గాని, గురువుయొక్క నిజరూపాన్ని గాని ఎట్లా చూడగలుగుతాడు? వాళ్ల నెట్లా గ్రహించగలుగుతాడు?" అందుచేత, ముందుగా నీ నిజ స్వరూపాన్ని, నైజాన్ని తెలుసుకో.

**ప్రశ్న : హృదయగ్రంధి అంటే ఏమిటి? దానిని బేధించేది ఎట్లా?**

**మహర్షి:** హృదయము నుండి సహస్రారానికి 'అమృతనాడి' ఉంటుంది. అజ్ఞానిలో అది మూతబడి ఉంటుంది. యోగికి అది నిర్వికల్ప సమాధిలో తాత్కాలికంగా తెరవబడుతుంది. జ్ఞానికి ఎల్లప్పుడూ తెరవబడే ఉంటుంది. శక్తికి స్థానం సహస్రారం కాదు. మానవునికి కుడివైపున గల హృదయం నుండి శక్తి సహస్రారానికి పయనిస్తుంది. దీనిని భక్తి, జ్ఞాన, యోగముల ద్వారా తెరవవలసి ఉంటుంది. ఇదే మోక్షం.

# అవధూత శ్రీ నాంపల్లిబాబా



పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు స్వయంగా తాను దర్శించి సత్సంగ సభ్యులందరిచేత దర్శింపచేసిన సాయి స్వరూపులు అవధూత శ్రీ నాంపల్లిబాబా. 1945వ సంవత్సరంలో హైదరాబాదు మలక్‌పేట రైల్వేస్టేషన్ దగ్గరలోని స్మశానంలో వారిని మొదట గమనించారు భక్తులు. అటుపిమ్మట 1980వ సంవత్సరం నుండి నాంపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ దగ్గర వారు ఉండటం గమనించి, శ్రీ నాంపల్లి బాబాగా వారిని దర్శించవచ్చినవారు పిలిచేవారు. శ్రీ నాంపల్లిబాబా వారి సన్నిధిలో అనేక అద్భుతమైన లీలావిలాసాలను, అనుభవాలను, అనుభూతులను పొందిన వేలాది మందితోపాటు వారి దర్శన, స్పర్శనతో ఆధ్యాత్మిక అనుభూతులను పొందినవారు కూడ ఎంతోమంది కలరు. నేను కూడ సత్సంగ సభ్యులతోకూడి అనేకసార్లు వారి దర్శన ఆశీస్సులు పొందటం జరిగింది. శ్రీనాంపల్లిబాబా 2004వ సంవత్సరం నవంబరు 6వ తేదీన తన భౌతికదేహం వీడి సృష్టిచైతన్యంలో నిలిచారు. నిత్యసత్యులైన శ్రీ నాంపల్లిబాబాగారి సమాధి దర్శించుకొని, నేటికీ అనేక అద్భుతమైన లౌకిక, పారలౌకిక అనుభూతులు, అనుభవాలు పొందుతున్నారు. వారిని స్మరించుకోవటం, వారి దివ్యత్వాన్ని, అవధూత తత్వాన్ని, విశ్వవ్యాపక చైతన్యాన్ని మననము చేసుకోవటానికి వీలుగా బాబావారి అష్టోత్తరాన్ని సమర్పిస్తున్నాము. దానిని పఠించటంద్వారా వారి దివ్యత్వాన్ని అందరూ అనుభవించాలని మా ఆకాంక్ష...

## శ్రీశ్రీశ్రీ నాంపల్లి బాబా అష్టోత్తర శతనామావళి


ఓం గౌలిపురవాసాయ నమః
ఓం శ్రీ సద్గురుదేవాయ నమః
ఓం పరమాత్మనే నమః
ఓం యోగేశ్వరేశ్వరాయ నమః
ఓం నిర్మల శాంత స్వరూపాయ నమః
ఓం శ్రీ శేషశాయినే నమః
ఓం అనంతకోటి సూర్య తేజాయ నమః
ఓం చంద్రకోటి సుశీతలాయ నమః
ఓం భక్తజనసేవితాయ నమః
ఓం దుష్ట శిక్షకాయ నమః
ఓం అమృత మూర్తయే నమః
ఓం సుప్రసాదాయ నమః
ఓం భక్త హృదయ నివాసాయ నమః
ఓం ఐశ్వర్య ప్రదాయ నమః
ఓం అవతార పురుషాయ నమః
ఓం దిగంబరాయ నమః
ఓం శ్రీ దత్తాత్రేయాయ నమః
ఓం శ్రీ అనఘాయ నమః
ఓం శ్రీ సాయి నాథాయ నమః
ఓం అవధూత చింతనాయ నమః
ఓం ఔదుంబర ప్రియాయ నమః
ఓం శ్రీ దక్షిణా మూర్తయే నమః
ఓం శ్రీ రమణాయ నమః
ఓం శ్రీ మౌన సందేశాయ నమః
ఓం ఆశ్రిత జనవత్సలాయ నమః
ఓం భవసాగర తరణాయ నమః
ఓం ప్రణవ రూపాయ నమః
ఓం భక్తిప్రియాయ నమః
ఓం సర్వాంతర్యామినే నమః
ఓం భయా పహాయ నమః
ఓం శాంతిమతే నమః
ఓం నిరాధారాయ నమః
ఓం నిరంజనాయ నమః
ఓం నిరాకారాయ నమః
ఓం అనేక మూర్తయే నమః
ఓం నిర్గుణాయ నమః
ఓం సగుణ రూపాయ నమః
ఓం నిత్య ముక్తాయ నమః
ఓం నిర్వికారాయ నమః
ఓం నిత్య శుద్ధాయ నమః
ఓం నిరంతరాయ నమః
ఓం నిశ్చింతాయ నమః
ఓం నిర్మోహాయ నమః
ఓం మాయాయ నమః
ఓం మాయాతీతాయ నమః
ఓం జ్యోతి స్వరూపాయ నమః
ఓం నిత్యజపాయ నమః
ఓం ముక్తి దాయకాయ నమః
ఓం శ్రీ నరసింహాయ నమః
ఓం భక్తవత్సలాయ నమః
ఓం ఉగ్ర రూపాయ నమః
ఓం పాదతాడనాయ నమః
ఓం ధూమపాన వ్రతాయ నమః
ఓం అగ్ని భక్షకాయ నమః
ఓం మహా పాతక నాశనాయ నమః
ఓం యజ్ఞ ప్రియాయ నమః
ఓం అన్నదాన ప్రియాయ నమః
ఓం సర్వశక్తి సమన్వితాయ నమః
ఓం నిత్యయౌవనాయ నమః
ఓం నిత్య సంతుష్టాయ నమః
ఓం సత్య వ్రతప్రియాయ నమః
ఓం కరుణాసాగరాయ నమః
ఓం సదాచారాయ నమః
ఓం తమో రజ నాశనాయ నమః
ఓం శ్రీ లలితా దేవ్యై నమః
ఓం విశ్వసాక్షియే నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం వైద్యాయ నమః
ఓం ఔషధాయ నమః
ఓం భగవతే నమః
ఓం ఏకాంతాయ నమః
ఓం శ్రీకాంతాయ నమః
ఓం మనోహరాయ నమః
ఓం భక్తా బీష్టప్రధాయ నమః
ఓం ఆది మధ్యాంత రహితాయ నమః
ఓం సర్వమత ప్రియాయ నమః
ఓం సర్వ జ్ఞాయ నమః
ఓం పురుషార్థ ప్రదాయ నమః
ఓం దీన జనోద్ధరణాయ నమః
ఓం ఆపద్భాంధవాయ నమః
ఓం స్మరణ సంతుష్టాయ నమః
ఓం కిరీటధారిణే నమః
ఓం త్రిగుణాయ నమః
ఓం త్రిగుణాతీతాయ నమః
ఓం త్రిమూర్తి రూపాయ నమః
ఓం త్రికాలాయ నమః
ఓం కాలాతీతాయ నమః
ఓం విశ్వంభరాయ నమః
ఓం సూర్య చంద్రాగ్ని నేత్రాయ నమః
ఓం స్వతంత్రాయ నమః
ఓం సత్‌చిదానంద రూపాయ నమః
ఓం ప్రేమ రూపాయ నమః
ఓం శ్రీ బుద్ధాయ నమః
ఓం సత్యజ్ఞానానంద రూపాయ నమః
ఓం ముక్తినిలయాయ నమః
ఓం శాశ్వత స్థిరాయ నమః
ఓం గంభీరాయనమః
ఓం ఆకాశ గమనాయ నమః
ఓం కలికల్మష నాశకాయ నమః
ఓం స్తోత్ర ప్రియాయ నమః
ఓం జ్ఞాన గమ్యాయ నమః
ఓం భావ గమ్యాయ నమః
ఓం శ్రీ శూలపాణియే నమః
ఓం దత్త శ్రీ నాంపల్లి బాబాయ నమః

(నవంబరు 6వ తేదీ బుధవారం శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

చిరునామా : **శ్రీ నాంపల్లి బాబా సేవా సమితి** రిజిష్టర్ నెం. 11ఇ/1662/03 **శ్రీ ధర్మపురి క్షేత్రము, దీప్తినగర్, మియాపూర్, హైదరాబాద్-500 050**

సౌజన్యం : **'శ్రీనాంపల్లిబాబా జీవితచరిత్ర'**

సేకరణ : **శ్రీమతి వి. త్రిపుర సత్యన్నారాయణ**, సికింద్రాబాదు



# పూర్ణ అంతరంగాలు

"వర్తమానములో జీవించటమే కాకుండా ఎలా జీవించాలో తెలుసుకొని జీవించు అంటారు" పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. గతాన్ని గురించి ఆలోచిస్తూ, భవష్యత్తు గురించి ఊహిస్తూ ఉండటము వర్తమానాన్ని అస్తవ్యస్తము చేసుకోవటమే అవుతుంది. గతంలో జరిగినది, చెడు అయితే, అది జరగకుండా ప్రస్తుతము ప్రయత్నించాలి, మంచిది అయితే దానిని పెంపొందించుకోవటానికి వర్తమానములో ప్రయత్నం కొనసాగించాలి. అందువలన భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుంది. అట్లా కాకుండా గతాన్ని గురించి చింతిస్తూ, భవిష్యత్తును ఊహలతో నింపుకోవటము వలన ప్రయోజనము లేకపోగా, భవిష్యత్తు ఆశల సౌధానికి పునాది అయిన వర్తమానం బలహీనమై, కొద్దిపాటి అలజడుల ప్రకంపనాలకే కూలిపోవటము జరుగుతుంది. అందుకనే వర్తమానములో జీవించమనే సద్గురు బోధ. "భగవంతుడు ఎట్లా సృష్టించాడో అట్లా ఉండటంలోనే తృప్తిపడు" అన్న శ్రీసాయి బోధ ఆకళింపు చేసుకుంటే, వర్తమానములో జీవించటము సాధ్యమవుతుంది. "మనము జీవించటానికి ఆధారమై, నిరంతరం మనలో జరిగే ఉచ్ఛ్వాస, నిశ్వాలను గమనించటమే వర్తమానములో జీవించటము" అని మాటల సందర్భములో ఒక మిత్రుడు అన్నాడు. ఎందుకంటే "మనం జీవించి ఉంటేనే కదా మిగిలినవాటి గురించి" అని అన్నాడు. ఇదీ బాగానే ఉంది. అయితే నా సమస్యలు నాకు ఉన్నాయి కదా! నామటుకు నేను అట్లా కూర్చుండిపోతే, మిగిలిన నాకుటుంబ పరిస్థితి ఏమిటి? అనే ఆలోచనే నాకు ఉచ్ఛ్వాస నిశ్వాస అయింది, కనుక నావరకు వేరొక మార్గాన్ని అన్వేషించుకోవాలని, తీవ్రంగా ఆలోచించటము మొదలుపెట్టేను. "వర్తమానములో జీవించటము అంటే గతాన్ని గుర్తుచేసుకుంటూ భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ఉండటము కాకుండా, కర్మ జీవులమయిన మనము కర్తవ్య నిర్వహణలో యావశ్శక్తిని వినియోగిస్తూ, జీవనం కొనసాగించటము ద్వారా, ప్రస్తుతము లభించిన ఫలితాన్ని ఆస్వాదిస్తూ, అనుభవిస్తూనే, బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమము చేసుకోవటము" అని నాకు అనిపించింది. తీవ్రతరమైన మన ప్రయత్నానికి సద్గురువు కృప తోడయితే, అది సంపూర్ణ మవుతుంది.

మహాత్ముల దగ్గరకో, లేక అవధూతల దగ్గరకో వెళ్ళేటప్పుడు వాళ్ళు ఇట్లా ఉంటారా, అట్లా ఉంటారా అని భావించుకొంటూ వారి సన్నిధికి వెళ్ళినప్పుడు, అందుకు భిన్నముగా వారు మన దృష్టికి గోచరిస్తే, వారిపై పూజ్యభావం స్థానంలో వ్యతిరేక భావం కలుగుతుంది. తద్వారా వారి దర్శనం ద్వారా మంచిని పొందాల్సింది పోయి, చెడును ప్రోగుచేసుకొని రావటమవుతుంది, అంటే గతమనే ఒక ఆలోచన వలన, వర్తమానంలో పరిస్థితి తారుమారు అయ్యి, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మహాత్ముల, అవధూతల సన్నిధికి వెళ్ళి, మనోజాడ్యంవల్ల మేలుపొందలేని వారలము, తిరిగి వారిని నిందించటము జరుగుతుంది.

"నా దగ్గరకు వచ్చేవన్నీ బోర్లించిన కుండలు లేక (వారి

మనోభావాలతో) నిండుగా ఉన్న కుండలే. వాటిలోకి అనుగ్రహామృతాన్ని ఎట్లా నింపేది" అన్నారు జగద్గురువు శ్రీ శిరిడీసాయిబాబా. అందుకని "మహాత్ముల, అవధూతల సన్నిధికి వెళ్ళేటప్పుడు, మనోబాండాన్ని ఖాళీగా, సరియైన రీతితో తీసుకు వెళ్ళటం ద్వారా, వారి కృపానుగ్రహాన్ని మన సంస్కారానికి తగినంతగా పొందగలము" అదే వర్తమానములో జీవించటము. బాగా మకిలి పట్టిన పాత్రను ఒక్కసారి తోమితే సరిపోదు, పదే పదే రుద్దటము వలన దాని చిలుము వదిలి, సస్వరూపాన్ని పొందుతుంది. "అరిగిపోయి, విరిగిపోయి, నొక్కుపోయి, చిలుము పట్టిన రూపంలో నాదగ్గరకు వచ్చే జీవి అనే ప్రతి పైసాను, అరగదీసో, బాగుచేసో లేక పుటంపెట్టి, కొత్తవాటిగా తయారుచేసి భగవంతుడికి అర్పిస్తాను" అంటారు శ్రీ శిరిడీసాయిబాబా. దేనిపైనగాని, ఎవరిపైనగాని నీవు ఏర్పరచుకునే అభిప్రాయం సర్వజనీయమైనదిగా భావించక, అది వ్యక్తిగతముగా భావించి, దానిని సరిచేసుకోవటానికి ప్రయత్నించటము ద్వారా కాలాంతరములో వాస్తవం గోచరమవుతుంది. ఆ అభ్యాసము తీవ్రతరమైనప్పుడు, నిరంతరం సత్యాన్ని గుర్తిస్తూ, తదనుగుణంగా జీవించటము జరుగుతుంది. తద్వారా నిత్యసత్యుడై, సర్వవ్యాపకుడైన సద్గురువును నిరంతరము గమనిస్తూ, ఎరుక గలిగి జీవించటము ప్రారంభమవుతుంది. గతజన్మలలో ఎన్నోరూపాలలో జన్మించిన మనము, ఈజన్మలో మానవులుగా పుట్టి, సాటిలేని సద్గురు సాంగత్యాన్ని పొందటము జరిగింది. అంతేకాకుండా, సాయి చూపిన మార్గంలో పయనించి, ఆ స్థితినిపొందిన "శ్రీ సాయిమాస్టర్" సాంగత్యము లభించటము, నావంటి వారికి పూర్వజన్మ సుకృతము, అందువలన గతము ఎట్లా ఉన్నా వర్తమానాన్ని సరిచూసుకుంటూ, సరిచేసుకుంటూ, జీవన పథంను కొనసాగించే కొద్దిపాటి అవకాశము నాకు లభించింది. నా భావనలను సద్గురువు అనే అద్దంలో సరిచూసుకుంటూ సరిదిద్దుకునే సంఘటన పూర్వాపరాలలోకి వెళదాము.

బండబారిన హృదయాలను సహితం 'శ్రీసాయిలీలామృత' ప్రవాహములో కరిగించి, వారి గుండెగుడిలో శ్రీసాయిని సజీవముగా ప్రతిష్ఠించగలిగిన, సాయి స్వరూపులైన శ్రీ భరద్వాజ మాస్టారుగారికి 1989 ఫిబ్రవరి 2వ తేదీన, సూళ్ళూరుపేట రైల్వేస్టేషన్‌లో, శిరిడీలో నేను తీసిన చిత్తరువులను, దక్షిణగా వారికి సమర్పించుకునే మహద్భాగ్యం నాకు కలిగింది. సర్వులకు శ్రీసాయిని అందించే మాస్టారుగారు, స్వయముగా అడిగి శ్రీసాయి చిత్తరువులను నానుండి తీసుకోవటము, వారి ప్రేమామృతపు జల్లుతో నన్ను పునీతం చేయటానికే. ఆ మధురామృతాన్ని గ్రోలుతున్న నేను, మద్రాసునుండి హైదరాబాదు వెళ్ళే రైలు కూతవేసుకుంటూ ప్లాట్‌ఫామ్ మీదకు రావటముతో ఇహంలోకి వచ్చాను. అంతవరకు ప్లాట్‌ఫాంమీద సిమెంటుబెంచిపై కూర్చొని ఉన్న మాస్టారుగారు లేచి నిల్చొన్నారు. మాస్టారుగారికి నిలబడే నమస్కారం చేశాము అందరము. వడివడిగా రైలుబోగి వైపు మాస్టారిగారితోపాటు అందరము కదిలేము. సూళ్ళూరుపేటలో హైదరాబాదు ఎక్స్‌ప్రెస్ 2 నిముషాలు మాత్రమే ఆగుతుంది. బోగిలోని మిగిలిన ప్రయాణీకులు ఎక్కిన తరువాత చివరగా మాస్టారుగారు ఎక్కేరు. లోపలికి వెళ్ళిన శ్రీరామారావు, మాస్టారుగారి సీట్లో ఆల్బమ్ ఉన్న సంచిని ఉంచారు. మాస్టారుగారు రైలుబోగి గుమ్మంలోని హేండిల్స్‌ను పట్టుకుని నుంచున్నారు. రైలు కదలబోతున్నదని భావించి అందరము రైలుకు కొంచెం దూరంగా జరిగేము. అయితే రైలు కదలలేదు, ఐదు నిముషాలు దాటిపోయింది. రైలు కదలలేదు ఏమిటి అని గార్డు వైపు చూశాము. లగేజిబోగిలోకి సామాను ఎక్కిస్తున్నారు, ఆరోజు 10 నిముషాలు పైన రైలు ఆగింది. ఇంతలో అంతవరకు మా అందరినీ గమనిస్తూ దూరంగా నిల్చొని ఉన్న జనార్ధన్ (అసలు పేరు గుర్తుకురాలేదు) పరిగెత్తుకుంటూ వచ్చి, ప్లాట్‌ఫ్లాంపై రైలువద్ద మోకాళ్ళపై కూర్చొని, ద్వారం దగ్గర నిల్చుని ఉన్న మాస్టారిగారి పాదాలను చేతులతో గట్టిగా పట్టుకొని, పాదాలపై తలఉంచి భోరున ఏడుస్తున్నాడు, "మాస్టారుగారు దాదాపు పావుగంట పైన ప్లాట్‌ఫ్లాంపైనే ఉన్నారు. అప్పుడు రాకుండా, పైగా మమ్మల్నందరినీ పిచ్చి వాళ్ళుగా చూస్తూ, దూరంగా ఉండిపోయి, మాస్టారుగారు రైలుబోగి ద్వారం వద్దదాదాపు ఏడునిముషాలు ఒంటరిగానే నిల్చొని ఉన్నా రాకుండా, ఇప్పుడు పరుగెత్తుకొని వెళ్ళి వారి పాదాలపై పడటం వేషం కాక మరేమిటి" అని! మనస్సులో భావించాను నేను. అందుకు కారణం అతని పూర్వాపరాలు.

శ్రీహరికోటలో మేము సత్సంగము నిర్వహించే శ్రీశేషయ్య ఇంటికి (క్వార్టరు) కొద్దిదూరంలోనే అతని ఇల్లు. ఏనాడు అతను మా సత్సంగాలకు వచ్చిన ధాఖలాలు లేవు. అతని భార్యమాత్రం సత్సంగాలకు క్రమం తప్పకుండా వచ్చేది. తన బాధలను బాబాకు మొరపెట్టుకునేది, తన కుటుంబ సభ్యులుగా భావించి, మాతో కూడా ఆమె తన సమస్యలు చెప్పేది. డ్యూటీలో అతను అప్పుడప్పుడు నాకు ఎదురయ్యేవాడు. హలో అంటే హలో అంతవరకే "ఈ వయసులో సత్సంగాలు, భజనలు, పారాయణలు ఏమిటి, మీమానాన మీరు చేసుకోకుండా, అందరినీ కూడగట్టి, జయంతులు, ఆరాధనోత్సవాలు, పండుగలు అంటూ ఏదో ఒక పేరు చెప్పి ఎప్పుడూ ఆ పూజలు, పారాయణలు ఏమిటి, అదంతా నాకు నచ్చదు, మీకు ఎవరు చెప్పేరో ఏమోగాని ఆ విధముగా సమయం వృధా చేయటం నాకు మాత్రం ఇష్టం ఉండదు" అని నాలుగైదుసార్లు క్యాంటీన్ దగ్గర ఎదురయిన తరువాత, ఒకసారి నాతో అన్నాడు అతను. బదులుగా నేను చెప్పిన సమాధానం కొంత ఓపికతో విన్నట్లు అతను కనిపించినా, సత్సంగాలకు మాత్రం రాలేదు, కాని అతను భార్యను మాత్రం సత్సంగాలకు వెళ్ళటానికి అడ్డు పెట్టలేదు. విధులలో భాగముగా తరచు అతను మద్రాసుకు డ్యూటీ పైన

వెళ్ళిరావటం, జీతంతోపాటు టి.ఏ. డి.ఏల రూపంలో కూడ అదనపు ఆదాయం ఉండటముతో, జీవితాన్ని ఆస్వాదించాలిగాని, ఇప్పటినుంచే భక్తి అంటూ కూర్చోకూడదు అని భావిస్తూ, తదనుగుణంగా ఉండేవాడు అతను. అతనిపైన ద్వేషం లేదుగాని, అతని కుటుంబ పరిస్థితులపైన, సత్సంగాలపై అతను ఏర్పరుచుకున్న భావానికి మాకు బాధ కలిగేది. అటువంటి అతను అకస్మాత్తుగా రైలు బయలుదేరే సమయములో పరుగెత్తుకు వెళ్ళి, ప్లాట్‌ఫ్లాం మీద కూలబడి మాస్టారిగారి పాదాలపై తలఉంచి నమస్కరించటము, “వేషం కాకపోతే మరేమిటి” అని నేను అనుకోవటానికి కారణమయింది.

ఇక వర్తమానంలోకి వస్తే, తన పాదాలపై వ్రాలిన అతనిని మాష్టారుగారు లేపి, ఏదో చెప్పటము మరింత ఆశ్చర్యమయింది నాకు. ముకిలిత హస్తాలతో నిల్చున్న అతనికి అభయమిస్తున్నట్లు చేయి పెట్టేరు మాస్టారుగారు. విస్మయముగా చూస్తున్న నావైపు ఒక్కసారిగా దృష్టి సారించి. “నామనోభావాన్ని గ్రహించినట్లు”గా, ఒక చిరునవ్వు నవ్వేరు మాస్టారుగారు. “గత భావాల్ని పక్కనబెట్టి, ఇప్పుడు జరిగేది మాత్రమే చూస్తూ ఉండు” అన్నట్లుగా ఉన్నయ్యి మాస్టారిగారి చూపులు, మౌనంగా జరిగేది గమనిస్తూ ఉండిపోయా. సర్వహృదయాంతరవాసి అయిన శ్రీసాయికి ప్రతిరూపముగా ఆ క్షణాన మాస్టారుగారు గోచరించారు. వారి సన్నిధిలో మన మనోభావాలకు తావేలేదని, ఆలోచనలు ప్రక్కన పెట్టి, “జరిగేది, గమనిస్తూ ఉండటము ద్వారా, సద్గురు చర్యలలోని అంతర్యము గ్రహించి తదనుగుణముగా మన భావి జీవితాన్ని తీర్చి దిద్దుకోగలమని” ఆ క్షణాన నాకు అనిపించింది. మరుక్షణం “హమ్మయ్య, ఇప్పటికి అయిన అతను మాస్టారుగారు పాదాలను పట్టుకున్నాడు. ఇక మనజోలికిరాడు, మాస్టారు గారి ఆశీస్సులు తీసుకున్నాడు కనుక, అతని కుటుంబ పరిస్థితి బాగుంటుంది, అదే మాకు కావల్సింది” అని భావిస్తూ, మాస్టారిగారికి నమస్కరిస్తూ ఉండిపోయాను. ఇంతలో గార్డు విజిల్‌వేసి, పచ్చ జెండా ఊపటంతో ట్రైను నెమ్మదిగా కదలటము ప్రారంభించింది. ఎడమ చేత్తో రైలు బోగి హ్యాండిల్ పట్టుకుని కుడిచేతిని పైకి ఎత్తి అభయముద్రలో వీడ్కోలు పలుకుతూ మాస్టారుగారు తన పయనం ముందుకుసాగించారు. వారి భౌతిక రూపం దూరంకాగా, వెనుతిరుగుతున్న నేను, రైలువెంట పరుగెత్తుకుంటూ అతను కూడ వేరొక బోగిలో రైలు ఎక్కటం చూశాను. “తరచి చూసిన బోధ పడవులే దైవ చిద్విలాసాలు”.

అటుపిమ్మట జనార్ధన్ కుటుంబ పరిస్థితులు త్వరితగతిన మెరుగవ్వటము, అతను తరచూ సత్సంగాలకు హాజరవ్వటమే కాకుండా, డ్యూటీ మీద మద్రాసు వెళ్ళినప్పుడల్లా బాబాకు రక రకాల పువ్వులు, పండ్లు, తీపివస్తువులు అనేకం తెచ్చేవాడు. అప్పటి మాస్టారిగారి చిరునవ్వులోని భావమేమిటో ఇప్పుడు అర్ధమయింది నాకు. మన ఎదుట జరిగేది చూస్తూ ప్రశ్నించటము, ప్రశ్నించుకోవటం, అభిప్రాయాలు ఏర్పరచుకోవటము వంటివి చేయకుండా, సద్గురు సాన్నిధ్యాన్ని ఆస్వాదిస్తూ ఉండిపోవటమే ప్రధాన కర్తవ్యమని, అదే “వర్తమానములో జీవించటము” అని నాకు అర్ధమయింది.

భగవంతుడు సాక్షీభూతుడు దేనికి కర్తృత్వం వహించడు. మన ఆలోచనలు, చర్యల ఫలితాన్నే తిరిగి మనము పొందుతాము అది నిజమేనని మాస్టారిగారి వీడ్కోలు రూపం కన్నుల ఎదుట నిలిచినప్పుడు అనిపిస్తుంది. వారు భౌతికదేహం వీడటానికి రెండు, మూడు నెలలు ముందే కొంతమందికి భావగర్భితముగాను, ప్రత్యక్షముగాను ఏప్రిల్ 12 లోపలే తన దర్శనానికి రమ్మని తెలియజేశారు. 1989 ఫిబ్రవరి 2వ తేదీన కొన్ని గంటలపాటు తన ప్రత్యక్ష సానిధ్యాన్ని మాకు అనుగ్రహించి, మమ్ములను పునీతం చేశారు మాస్టారుగారు.

తన సమాధికి ముందు మాస్టారుగారు, నానుంచి దక్షిణరూపంలో శ్రీసాయి చిత్రపటాలను తీసుకోవటం, “వేచిచూడు తెలుస్తుంది” అన్నట్లుగా చిరునవ్వుతో వీడ్కోలు పలుకుతూ ముందుకుసాగి కనుమరుగు అయిన దృశ్యం ఈనాటికి తలచుకుంటే వారి అవాజ్యమైన ప్రేమ గుర్తుకువచ్చి, కన్నులు ఆనందభాష్పాలతో నిండిపోతాయి. గతాన్ని సోపానాలుగా మార్చుకుంటూ వర్తమానంలో జీవిస్తూ, భవిష్యత్తు భగవంతునికి అర్పణ చేయటమే నా కర్తవ్యమని భావిస్తూ ఉండగా


‘‘పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా’’ అన్న అన్నమాచార్యుల సంకీర్తన డాక్టర్ శ్రీమతి శోభారాజ్‌గారి గళం నుండి మృదు మధురముగా జాలువారుతూ, మనస్సు పరవశించేలా కర్ణపుటాలు తాకి, హృదయాన్ని స్పృశించగా, మౌనంగా ఆలకిస్తూ, మాస్టారుగారు మన హృదయాలలో నిలపిన శ్రీసాయినాధుడిని శ్రీనివాసుడిగా భావిస్తూ ఉండిపోయాను.

పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్యా కోనేటి రాయడా
కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువచిత్తములోని శ్రీనివాసుడా!
భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా!
చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా
లడచి రక్షించే దివ్యౌషధమా
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా!
పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా!
పురుషోత్తమా! పురుషోత్తమా!

మీ - వి.వి. పూర్ణచంద్రరావు

# శ్రీ ధునీవాలాదాదా మహరాజ్

మత సామరస్యమే తమ అవతార లక్ష్యముగా కలిగిన దత్తావతారులైన శ్రీ శిరిడీసాయి, అక్కలకోట స్వామి, గజానన్ మహరాజ్, సంత్ కబీరు వలే, ధునీవాలా దాదా తల్లి తండ్రులెవరో, కులగోత్రాలేమిటో ఎవరికి తెలియదు. నర్మదా నదీ తీరమున శ్రీ గౌరీ శంకర్ మహరాజ్‌కి ఎనిమిది సంవత్సరాల బాలకృష్ణునిగా మొట్టమొదట కనిపించారు. అతనిలోని దివ్యత్వాన్ని చూచి, గౌరీశంకర్ మహరాజ్ తన వారసునిగా గుర్తించి సకల విద్యాపారంగతుణ్ణి చేసి, సన్యాసదీక్ష నిచ్చి 'స్వామి కృష్ణానంద' అను దీక్షానామాన్ని ఇచ్చారు. వీరు ఏకాంత ప్రియులు. అర్ధరాత్రి సమయములో నర్మదా నదీ తీరమున ధ్యానిస్తూ నది నీటిలో ఇసుకను కలిపి హల్వాగా చేసి, ఆశ్రమ వాసులందరికీ పెట్టుటయే కాక, భూమిపై నుంచి పది అడుగులు పైకి లేచి నడిచే అద్భుత వ్యక్తిగా కీర్తించబడ్డారు.



సద్గురువులలో సర్వసమర్ధ సద్గురువుల స్థితి చాలా విలక్షణంగా ఉంటుంది. ఇలాంటి సద్గురువులనే దత్తావతారాలని పిలిచారు. ఈ మహనీయులు అనంతమైన దైవశక్తితో పాటు ఆ దైవం యొక్క దివ్య ప్రేమను భక్తులకు రుచిచూపించి దైవం యెడల వారి విశ్వాసాన్ని పటిష్ఠం చేస్తారు. పూర్వకర్మానుసారం ఏర్పడిన దైవనిర్ణయాన్ని (బ్రహ్మవ్రాతను) కూడా మార్చగల సమర్ధులని నిరూపించడంలో ఆ మహనీయులు వారికి వారే సాటి. "చచ్చి బూడిదైనా రమ్మంటే వచ్చేదే గదయ్యా" అని సెలవిచ్చిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి మాటలు ఈ కలియుగంలో కూడ ఎలా అక్షరాలా నిజమయ్యాయో వారి చరిత్రలో చూడవచ్చు.

మృత జీవులను సజీవులుగా చేయడంలో శ్రీదాదాగారి దివ్యలీలలు నభూతో నభవిష్యత్‌గా కనిపిస్తున్నాయి. ఎంతో మంది మృతిచెందినవారు వారి కృపతో పునర్జీవితులైన వివరం మరే మహనీయుని చరిత్రలోను చూడబోము. అంతేగాక చనిపోయిన పక్షులు, పాములు ఎన్నో తెచ్చి చిన్నపిల్లలు శ్రీదాదాగారి పైన వేయడం వారిదివ్యస్పర్శ తగలగానే అవి తిరిగి బ్రతికి వెళ్ళడం అనేది కన్నులారగాంచిన ఆనాటి భక్తుల జన్మలు ధన్యముకదా! సృష్టిలో సద్గురువుల ఆజ్ఞకు తిరుగులేదని వీరు తమ దివ్యలీలల ద్వారా నిరూపించి మానవులకు దైవశక్తి ఎడల భక్తివిశ్వాసాలు కలిగించారు. సైన్సు, వైద్య శాస్త్రమే నమ్ముతామనే మూఢుల అంధత్వాన్ని పారద్రోలారు. ఈ విధంగా ప్రభావితులైన భక్తులు హృదయపూర్వకమైన ప్రీతితో ధర్మాచరణ చేస్తారు. అలా ఆచరించబడిన సద్ధర్మాచరణమే భక్తులకు దుఃఖరాహిత్యస్థితి ప్రసాదిస్తుందని సర్వశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. గనుక మనలను ధర్మాచరణకు ప్రేరేపించడమే ఈ మహత్తర లీలల ధ్యేయమని గుర్తించి మన ఆచరణను మలచుకుని తరింతుముగాక. మహాత్ముల జీవితచరిత్ర పారాయణ ద్వారా సంకటములు తీరటమే కాకుండా, మనలో నైతిక పరివర్తన కలుగుతుంది. అందుకు దోహదంగానే మహాత్ములు లీలలు చేస్తారు. అటువంటివే శ్రీ దాదాగారు చేసిన లీలలు కూడ.

గొడ్డు ఆవు పాలు ఇచ్చేట్లు చేయటము, వంధ్యకు సంతానమివ్వడం, ఉప్పునీటి బావులను మంచినీటి బావులుగా మార్చడం, జలం లేక పూర్తిగా ఎండిపోయిన బావులను నీటితో నింపడం, కఠినశిలామయమై త్రవ్వుటకు అలవిగాని బావిలోని రాతిని మెత్తబరచి గడ్డపారతో తెగేటట్లు చేయడం వంటి దివ్యలీలలు సిద్ధపురుషుల చరిత్రలో చాలా స్వల్పమైనవి.

ఉజ్జయనిలో హనుమాన్ తోటలోని ఒక బావిలో ఊటలేక ఎండిపోయింది. ఆ ప్రాంత ప్రజలు తమ బాధను శ్రీ దాదాగారికి విన్నవించారు. పరమ దయానిధియైన శ్రీ దాదాగారు ఒక రొట్టెముక్కను ఆ బావిలో వేయగానే ఆ బావి తిరుగులేని మంచినీటితో నిండిపోయింది. అచ్చటి ప్రజలందరూ ఆశ్చర్యానందాలతో శ్రీ దాదాజీ గారికి జేజేలు చెప్పారు.

శ్రీ దాదాగారు 1930లో మధ్యప్రదేశ్ లోని ఖాండ్వా పట్టణము చేరినారు. నవంబరు 29వ తేదీన దాదాగారు పరుపుపై పవళించి అచేతన స్థితికి వెళ్ళారు. స్వామి మహాసమాధి చెందుతున్నారని తెలిసి మహాసముద్రంలా ప్రజలు తరలి వచ్చి వారిని దర్శించారు. డిసెంబరు 3వ తేదీవరకు శరీరం చలనం లేకపోవడంతో ఆ రోజు మణుగులకొద్దీ చందనము, కర్పూరము, ఆపై పట్టు వస్త్రాలు పరచి దాదాగారిని సమాధి చేసారు. నాటి నుండి దాదా తమ సమాధి నుండియే అసంఖ్యాకమైన లీలలు ప్రదర్శిస్తున్నారు. ఈనాటికి మధ్యప్రదేశ్ లోని ఖాండ్వా పట్టణములోని వారి సమాధిని దర్శించి పునీతులు అవుతున్న వారెంతమందో కలరు. నిరంతరము ధుని (అగ్నిహోత్రము) కలిగి ఉండటముతో దాదాగారిని అందరూ "ధునీవాలాదాదా" అని పిలిచేవారు.

(నవంబరు 29 ధునీవాలాదాదా గారి ఆరాధనోత్సవ సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

రచన : **పెసల సుబ్బరామయ్య**, గొలగమూడి

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం
## (2019 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2019 జూలై, ఆగష్టు, సెప్టెంబరు మాసములలో అనేక ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమములు నిర్వహించటము జరిగింది.

జూలై 12వ తేదీ తొలిఏకాదశి సందర్భముగా సత్సంగ మందిరములో ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, భక్త సమారాధన ఏర్పాటుచేయటమైనది.

జూలై 14, 15 మరియు 16 తేదీలలో శ్రీ సద్గురు పాదుకాక్షేత్రం నందు గురుపూర్ణిమ మహోత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహించటము జరిగింది. జూలై 14వ తేదీ శ్రీ దత్తసాయి భరద్వాజుల సహిత శ్రీ దత్తావతార, మహాత్ముల పాదుకలు మరియు శ్రీగురుచరిత్ర గ్రంథరాజమునకు సామూహిక షోడశోపచార పూజ నిర్వహించి అనంతరము 'శ్రీగురుచరిత్ర' సామూహిక ఏకాహ పారాయణ చేయటము జరిగింది. పారాయణలో పాల్గొన్న నూతన భక్తులందరికి 'శ్రీగురుచరిత్ర' గ్రంథము ఉచితముగా బహుకరించటము జరిగింది. సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమములో "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ప్రధాన సంపాదకులు శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు "శ్రీగురుచరిత్ర పారాయణ విధానము-విశిష్టత" గురించి ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు.

జూలై 15వ తేదీ సాయిభరద్వాజ సహిత శ్రీదత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకలకు దంపతులచే సామూహిక పాదుకాపూజ నిర్వహించి, అనంతరము శ్రీ దత్త సాయి భరద్వాజ చాలీసాలు సామూహిక పారాయణ చేయటం జరిగింది.అనంతరం శ్రీ సాయి నామలిఖిత యజ్ఞాన్ని నిర్వహించటము జరిగింది. కార్యక్రమములో చిన్నారులతోపాటు పెద్దలు కూడ విశేషముగా పాల్గొన్నారు.

సాయంత్రం 'గురుపూర్ణిమ విశిష్టత' గురించి సత్సంగమము నిర్వహించటము జరిగింది.

జూలై 16వ తేదీ గురుపూర్ణిమ మహోత్సవము సందర్భముగా ఉదయం శ్రీ దత్తసాయి భరద్వాజులకు పంచామృతాభిషేక సహిత, సామూహిక క్షీరాభిషేకము నిర్వహించి, అనంతరం సామూహిక గురుపూజలు నిర్వహించటము జరిగింది. అభిషేకము, పూజాది కార్యక్రమానికి కావలసిన పూజాద్రవ్యములు ట్రస్టు వారు ఉచితముగా ఏర్పాటుచేయటమైనది.

మధ్యాహ్నం జరిగిన విశేష అన్నదానము అనంతరం "ఆధ్యాత్మికత - సామాజికత" అనే అంశంపై గోష్టి నిర్వహించి అనంతరము 'శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం' పేరిట 50 మంది అతి నిరుపేద దివ్యాంగులు, అనాథ కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు మరియు దివ్యాంగులకు వీల్‌చైర్లు బహుకరించటమైనది..

సాయంత్రం శ్రీగురుపూర్ణిమ సందర్భముగా సామూహిక ధ్యాన కార్యక్రమము నిర్వహించడమైనది.

ఈ మూడు రోజులు సుదూర ప్రాంతములనుండి విచ్చేసిన వారికి, వసతి, భోజనములు ఏర్పాటు చేయటముతోపాటు, మూడురోజులు, కార్యక్రమములో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ భోజన, ప్రసాదాలు మొదలైనవి ఏర్పాటు చేయటమైనది.

గురుపూర్ణిమ సందర్భముగా శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలోని గోఖలే అనాథ, పేద బాలుర శిశు సదనమునకు ట్రస్టు తరపున బక్కెట్లు, పాత్రలు బహుకరించటముతోపాటు, శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని రోగులకు పాలు మరియు అన్నదాన సమితికి వారికి కూరగాయలు ఇవ్వటమైనది.

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు వారి ఆధ్వర్యములో గత 25 సంవత్సరాలుగా నిర్వహించబడుతున్న శ్రీ సద్గురువుల పాదుకామహోత్సవ "రజతోత్సవాల సందర్భముగా" ఆగష్టు 13వ తేదీ 'శ్రీసాయిమాస్టర్ చూపిన మార్గం' మరియు 'సాయి సంప్రదాయములో పాదుకల ప్రాశస్త్యము' అనే అంశము పై పి.యమ్.సి. చానల్ వారు ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావుతో ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించటము జరిగింది.

ఇంటర్వ్యూ మరియు పాదుకా,దర్శన వివరాలు PMC Online TV లో "పూర్ణచంద్రరావు-పాదుకా పట్టాభిషేకం" వీడియోల ద్వారా తిలకించవచ్చు.

ఆగష్టు 15వ తేదీ శ్రావణపౌర్ణమి సందర్భముగా నర్సీపట్నం శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమములో ట్రస్టు ఆధ్వర్యములో 'సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించటము జరిగింది. ఉదయం పల్లకీసేవ, పౌర్ణమి ప్రత్యేక హోమాలు నిర్వహించి కార్యక్రమానికి విచ్చేసిన వేలాది మందికి ఆశ్రమ నిర్వాహకులు మహా అన్నదానము ఏర్పాటుచేశారు. ఆ యా కార్యక్రమాలలో పాల్గొన్న వేలాది మంది భక్తులు పాదుకలను దర్శించుకొని పరవశించారు. ఆసందర్భముగా నర్సీపట్నం చుట్టుప్రక్కల గ్రామాలనుంచి ఎంపికచేసిన 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు ట్రస్టు తరపున స్కూలు బ్యాగ్గులు, నోట్సు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ మొదలైనవి బహుకరించటము జరిగింది. ఆ కార్యక్రమములో శ్రీపాకలపాటి గురువుగారి శిష్యులు అయిన శ్రీ చినబాబుగారి సతీమణి శ్రీమతి మాణిక్యంగారు, ఆశ్రమ నిర్వాహకులు, శ్రీ వై.వి.రమణ మాస్టారు దంపతులు, స్థానిక ప్రముఖులు మొదలైనవారి చేతులమీదుగా చిన్నారులకు స్కూలు బ్యాగులు అందజేయటమైనది.

ఆగష్టు 24, 25వ తేదీలలో సద్గురుపాదుకా క్షేత్రంలో 25వ సద్గురువుల పాదుకామహోత్సవము అత్యంత వైభవోపేతముగా జరిగింది.

ఆగష్టు 24వ తేదీ అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవము సందర్భముగా ఉదయం శ్రీదత్త,సాయి భరద్వాజ సహిత పాదుకలు మరియు శ్రీ వెంకయ్యస్వామివారి జీవిత చరిత్ర గ్రంథానికి షోడశోపచార పూజ నిర్వహించి, అనంతరం 'శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర' సామూహిక పారాయణ చేయటమైనది. సాయంత్రం "అవధూత తత్వం - సాయిసంప్రదాయము" అనే అంశముపై ట్రస్టు ఛైర్మన్ ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు.

ఆగష్టు 25వ తేదీ పాదుకామహోత్సవము సందర్భముగా శ్రీ దత్తసాయిభరద్వాజులకు, పంచామృతాభిషేక సహిత సామూహిక క్షీరాభిషేకం నిర్వహించి, ఉభయ స్మార్త పండితులు శ్రీ కోటరామశాస్త్రి

గారిచే సామూహిక 'గురుపూజలు' నిర్వహింపచేసి, అనంతరము పవర్‌సిటీ లోని సామాజికవేత్త శ్రీ పి. రామారావు మాస్టారు దంపతులను, ఆధ్యాత్మిక వేత్త శ్రీ కె.వి. సత్యన్నారాయణ దంపతులను మరియు శ్రీ కోటరామశాస్త్రి గారిని శాలువా.వస్త్రాలు, జ్ఞాపికలతో ట్రస్టు తరపున ఘనముగా సత్కరించటమైనది. విశేష అన్నదాన అనంతరం ఆధ్యాత్మికత-సామాజికత గోష్టి నిర్వహించి "శ్రీ సాయిభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 50 మంది అతినిరుపేద దివ్యాంగుల, వితంతు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేయటమే కాకుండా, పేద వృద్ధులకు వస్త్రాలు స్త్రీలకు చీరలు బహుకరించటమైనది. ఆ కార్యక్రమములో 'శ్రీభరద్వాజ సద్గురువాణి' పబ్లిషర్ శ్రీమతి వి.యస్. లక్ష్మి మరియు ట్రస్టు మహిళా విభాగము సభ్యులు పాల్గొన్నారు.

సాయంత్రం "సాయి సంప్రదాయములో పాదుకా ప్రాశస్త్యము" అనే అంశముపై ట్రస్టు ఛైర్మన్ ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. అనంతరం గిరిజన మహిళలకు చీరలు బహూకరించటమైనది. ఆ కార్యక్రమానికి విశేషముగా విచ్చేసిన స్థానికులతోపాటు ట్రస్టు అనుబంధ సంస్థల సభ్యులు సుదూర ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తులు విచ్చేసి, పాదుకామహోత్సవములో పాల్గొన్నారు. కార్యక్రమము రెండురోజులు ప్రతి ఒకరికీ సమారాధనతో పాటు దూరప్రాంతాలనుంచి విచ్చేసిన వారికి భోజన వసతులు కూడ ఏర్పాటుచేయటమైనది.

సెప్టెంబరు 2వ తేదీ వినాయకచవితి మరియు శ్రీపాద శ్రీవల్లభుల జయంతి సందర్భముగా స్వామి చరిత్ర పారాయణ చేసి, అనంతరము సత్సంగమము నిర్వహించి, ప్రసాద వితరణ చేయటమైనది. సెప్టెంబరు 3వ తేదీ శ్రీ గజానన్ మహరాజ్ మరియు అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సత్సంగమము నిర్వహించి, 'శ్రీ చీరాలస్వామి చరిత్ర' పారాయణ చేయటము జరిగినది.

సెప్టెంబరు 5వ తేదీ గురుపూజమహోత్సవము సందర్భముగా ప్రత్యేక సత్సంగమము నిర్వహించి సమారాధన చేయటమైనది.

సెప్టెంబరు 24వ తేదీ శ్రీ సాయిభరద్వాజ ఆపన్నహస్తం పేరిట 50 మంది దివ్యాంగుల, అతినిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# మేము సహితం...

ఆధ్యాత్మిక సామాజిక సేవాకార్యక్రమాలలో భాగముగా శ్రీశిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2019 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో చదువుతున్న చిన్నారులకు, స్కూలు బ్యాగ్గులు, వ్రాత పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు మొదలైన వాటితోపాటు ప్రతినెల 'శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం' పేరిట 50 మంది శారీరక, మానసిక దివ్యాంగులకు మరియు అతి నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు మరియు వృద్ధులకు వస్త్రాలు, నిరుపేదస్త్రీలకు చీరలు, దివ్యాంగులకు వీల్‌చైర్ల బహుకరణ మొదలైన అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. పూర్తి వివరాలు 21వ పేజీలోని ఆధ్యాత్మిక-సామాజిక సేవా కార్యక్రమాల సమీక్షలో చూడగలరు. మీరిచ్చే ప్రతి రూపాయి సామాజిక సేవాకార్యక్రమాలకు వినియోగించగలమని మరొకసారి తెలియజేస్తూ సహకారమందిస్తున్న ప్రతి ఒక్కరికి, మరింతగా ఆధ్యాత్మిక-సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని శ్రీ దత్తసాయిభరద్వాజులను ప్రార్థిస్తూ, సహాయ సహకారములందించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

| | |
|---|---|
| శ్రీ పి. శ్రీనివాసరావు, ఎన్.టి.పి.సి. పరవాడ | 5,000/- |
| శ్రీ సంజయ్ శ్రీపతి, హైదరాబాదు | 5,000/- |
| శ్రీ కె. శ్రవణకుమార్, విశాఖపట్నం | 4,000/- |
| శ్రీ కె. శరత్‌చంద్రబాబు, కూర్మన్నపాలెం | 3,338/- |
| శ్రీ సిహెచ్. నరసింహరావు, హైదరాబాదు | 3,000/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీనగర్, విశాఖపట్నం | 3,000/- |
| శ్రీ కె. శ్రీనివాసరావు, కేరళ | 3,000/- |
| చి॥ బి. సాయి వేంకటప్రణీత్, చెన్నై | 2,000/- |
| శ్రీ ఓలేటి కుమార్ | 2,000/- |
| శ్రీ వేంకట సత్యప్రసాద్, లక్ష్మీపురం, వైజాగ్ | 1,502/- |
| శ్రీ జె. పూర్ణచంద్రరావు, పవర్‌సిటీ, వైజాగ్ | 1,116/- |
| శ్రీ సిహెచ్. చలపతిరెడ్డి | 1,100/- |
| శ్రీ సిహెచ్. సీతారామకుమార్, సామర్లకోట | 1,005/- |
| శ్రీ సాయిభక్తుడు, ఎన్.టి.పి.సి. పరవాడ | 1,000/- |
| శ్రీ భరద్వాజ సత్సంగ్, గోపాలపట్నం | 1,000/- |
| శ్రీ ఆర్. అప్పలరాజు, ఆర్.ఆర్.వి. పురం, వైజాగ్ | 1,000/- |
| కుమారి కె, ప్రమీళ, శ్రీకాకుళం | 900/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 500/- |
| శ్రీ యు. శ్రీను, గొల్లలపాలెం | 500/- |
| శ్రీ కె. కవిట్‌కుమార్ | 500/- |
| శ్రీ ధరాల ట్రేడర్స్, పరవాడ, విశాఖపట్నం | 500/- |
| శ్రీ కె. శంకరరావు, ఎ.పి.యస్.క్యాంప్ | 500/- |
| శ్రీ యస్.వి. హరీష్, నల్లపాడు, గుంటూరు | 300/- |

## అక్షర యజ్ఞానికి చేయూత

శ్రీ కె. కరుణారెడ్డి మరియు అతని మిత్రబృందము (అమెరికా) "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ముద్రణా నిమిత్తము రూ. 75,614 (అక్షరాల డెబ్భై అయిదువేల ఆరువందల పద్నాలుగు రూపాయలు) ఆర్థిక సహాయము అందించారు. వారికి, వారి కుటుంబసభ్యులకు మరియు వారి మిత్రబృందమునకు మరింతగా ఆధ్యాత్మిక-సామాజిక సేవలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని శ్రీ దత్త సాయి భరద్వాజులను కోరుకుంటూ, వారికి 'శ్రీభరద్వాజ పబ్లికేషన్స్' తరపున కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకుంటున్నాము. - మేనేజరు

**ధన, వస్తు రూపేణా మీ విరాళములు పంపవలసిన చిరునామా:**

**SRI SHIRIDI SAI SEVA TRUST**
**Online A/C No. 095510011006492**

**SRI BHARADWAJA PUBLICATIONS**
**Online A/C No. 095510011006491**
**IFSC Code: ANDB0000955**
**Andhra Bank, Ukkunagaram**
**(Used for RTGS and NEFT Transactions)**

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2019 జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)


























ఈ పేజి సమర్పించినవారు : **శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం**, కెల్లవీధి, శ్రీకాకుళం.

పూర్తి వివరములకు 21 పేజీ చూడగలరు

# జన్మదిన శుభాకాంక్షలు

అక్టోబరు 6వ తేదీన గాజువాక, శ్రీనగర్‌లో జన్మదినము జరుపుకుంటున్న శ్రీ అల్లు సింహాచలం నాయుడు, శ్రీమతి ఈశ్వరమ్మల కుమారుడైన

**చి॥ శ్రీరామ్** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

అక్టోబర్ 18వ తేదీన హైదరాబాద్‌లో జన్మదినము జరుపుకుంటున్న శ్రీ ఎమ్. ఉమామహేశ్వర రావు శ్రీమతి ఎమ్. నాగలక్ష్మిల కుమారుడైన

**చి॥ ఎమ్. రామ సుబ్బారావు** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.



అక్టోబర్ 23వ తేదీన శ్రీకాకుళంలో జన్మదినము జరుపుకుంటున్న శ్రీ సి.హెచ్. మురళీకృష్ణ శ్రీమతి సి.హెచ్. మీనాక్షిల కుమారుడు

**చి॥ సి.హెచ్. నాగ కిరణ్** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

# పెళ్ళి రోజు శుభాకాంక్షలు



**నవంబరు 24వ తేదీన గోవా(మహారాష్ట్ర)లో పెళ్ళిరోజు జరుపుకుంటున్న**

**శ్రీ కె.సాయి సందీప్, శ్రీమతి సాయి ప్రత్యూష ల**

**వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని కోరుకుంటూ మరియు డిసెంబరు 8వ తేదీన జన్మదినం జరుపుకుంటున్న**

**శ్రీమతి కె.సాయి ప్రత్యూష** కు

**శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహం అందించాలని కోరుకుంటూ శ్రీ భరద్వాజ సద్గురువాణి తన శుభాకాంక్షలందజేస్తున్నది.**

# జన్మదిన శుభాకాంక్షలు



నిర్దుష్టమైన సాయి సంప్రదాయాన్ని అందరికి అందుబాటులోకి తేవటానికై **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** పత్రిక స్థాపించి, వాడవాడలా సాయివాణిని అందించుటయేకాక ఆ బృహత్తరయజ్ఞంలో మాకుకూడ సేవాభాగ్యము కల్పించిన

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి**

## శ్రీమతి వి.ఎస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు

**డిసెంబర్ 9వ తేదీన జన్మదినము జరుపుకుంటున్న**

శుభ సందర్భములో శ్రీ దత్తసాయి మాస్టర్, తన సంపూర్ణ కృపానుగ్రహము అందించి **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"**, అందరి హృదయవాణిగా తీర్చిదిద్దే శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలతో.

**కార్యవర్గము - శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**సత్సంగ సభ్యులు - శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు, విశాఖపట్నం**

# శ్రీ దత్తాత్రేయుడు

ఒక్కడుగా ఉన్న భగవంతుడు, ఒకప్పుడు తాను అనేకమవ్వాలని సంకల్పించాడు. ఆ సంకల్పమే మాయాశక్తి. త్రిగుణాత్మకమైన ఆయన తన మాయచేత యీ జగత్తును సృష్టించి, దాని రూపంలో ప్రకటమయ్యాడు. వెనుకటి ప్రళయానికి ముందున్న జీవులు ప్రళయంలో పరమాత్మయందు సూక్ష్మరూపంలో దాగియుంటారు. వారు సాధన ద్వారా తరించగలందులకు పరమాత్మ అలా మరలా సృష్టి చేస్తాడు. సృష్టి చేసిన ఆ పురుషోత్తముడే ఆత్మజ్ఞానం వలన పొందదగినవాడు. ఎవరయితే ఇంద్రియ విషయాల వలన కలిగే రాగద్వేషాలను దైవీ సంపత్తితో జయిస్తారో అట్టివారే ముక్తిపొందుతారు. అటువంటి ముముక్షువుల కొరకే జనన మరణాలు లేని ఆ పరమేశ్వరుడు తన దివ్య మాయచేత మానవరూపంలో జన్మిస్తాడు. అంతేగాదు, అజ్ఞానం వలన జీవులు అనివార్యంగా చేసే దోషాలు వాటి వలన ధర్మబద్ధంగా జీవించటానికి యేర్పడే ఆటంకాలను, అవరోధాలను తొలగించడానికి మళ్ళీ భగవంతుడే అవతారం ఎత్తుతారు. ఆ భగవంతుడే పరిపూర్ణులైన సద్గురువులుగా అవతరించి, తన లీలల ద్వారా సాధ్యమైనంత మందికి మోక్షేచ్ఛ, ధర్మనిష్ఠ కలిగేలా చేస్తూ ఉంటాడు. ఇలా యెల్లప్పుడూ భూమిమీద పూర్ణులైన మహాత్ములుగా అవతరించే భగవత్తత్త్వాన్నే "దత్తాత్రేయుడు" అన్నారు.



త్రిగుణాతీతుడైన అత్రి మహాముని, మహా పతివ్రత అయిన అనసూయాదేవికి భగవంతుడు పుత్రుడుగా మార్గశిర పూర్ణిమ బుధవారంనాడు మృగశిర నక్షత్రంలో సాయంత్రం జన్మించాడు. ఆ బాలునికి దత్తుడని నామకరణం చేసారు. అత్రియొక్క సంతానం గనుక వీరిని ఆత్రేయులని, దత్తుణ్ణి "దత్తాత్రేయు" డని వ్యవహరిస్తారు

బాలదత్తుడు ప్రకృతి వికారాల వలన పీడితులైన మానవులు, మునులు ఆయన్ని శరణువేడగా యోగలీలగా వారికి ఇవ్వవలసినవన్ని ప్రసాదించాడు, శిష్యులకు వేదం నేర్పాడు. ఒకప్పుడు ధ్యాననిష్ఠుడై యుంటాడు. తన యోగ మాయచేత లీలలను చేసి జీవులను తరింపజేసాడు.

బదరికావనం చేరి అక్కడ కఠోర తపస్సుచేత వివిధ సిద్ధులు పొందిన సిద్ధులెందరో అహంకార ఆగ్రహాలతో వాదులాడు కొంటున్న వారికి – దుర్లభమైన ఆనందాన్ని, గురువును ఆశ్రయించి, చిత్తశుద్ధి, కర్మనిష్ఠ మరియు ధ్యానము అనే సాధనతో పొందవచ్చుని బోధించి వారికి తమ యోగాన్ని, సిద్ధిని యిచ్చి, పరుల సిద్ధిని రద్దుచేసే మంత్రముపదేశించాడు.

అజ్ఞానమే జీవుల దుఃఖానికి కారణమని, కలహాలలో తగుల్కొని, ధ్యానంలో చంచలులుగా ఉన్నకొందరు సిద్ధులకు తన విశ్వరూపం దర్శింపచేసి వారిని ఆత్మశుద్ధులుగా చేసి జ్ఞానాన్ని బోధించాడు.

శీలుడనే బ్రాహ్మణుడింటికి శ్రాద్ధ సమయంలో భిక్షు రూపంలో, కూడా ఒక నల్లని కుక్కతో భిక్షకు వెళ్ళి, ఆగ్రహించిన శ్రాద్ధభోక్తలకు "కుక్కవంటి సగుణమైన నేను, నిత్యనైమితకర్మల కనర్హుడనే. కాని నేను మాయా రహితుడను. ఈ నా కుక్కలకు అవన్ని తెలుసు" అనగానే కుక్క వేదాలు, షట్శాస్త్రాలు వల్లించింది.

దత్తుడు ప్రదర్శించే మాయలకు చలించక ఆయనను సేవించిన కార్తవీర్యార్జునునకు భక్తియోగాన్ని, యోగ సమాధి సిద్ధిని బోధించి, అనుగ్రహించి, స్వధర్మపాలన చేయించాడు.

భూమిని నిక్షాత్రం చేయదలచిన పరశురామునిని యోగసిద్ధునిచేసి, అనుగ్రహించాడు. అలర్కుడికి ఆది గురువుగా దర్శనమిచ్చి, ఆత్మవిచారాన్ని బోధించి తరింపచేశాడు. తాను అత్యాశ్రమినని చెప్పి, దత్తుడు పింగళనాగునికి సుందరము, శుభమూ అయిన శివరూపంలో దర్శనమిచ్చి అనుగ్రహించాడు. అమలక వృక్షం క్రింద ముని రూపంలో తపస్సు చేస్తుంటే, సిద్ధాదులు మొదలు సర్వప్రాణులూ సహజవైరాన్ని మాని కలసి జీవించాయి.. శంఖ చక్ర గదా పద్మహస్తుడై బ్రహ్మకు దర్శనమిచ్చాడు. దిగంబర అవధూతగా యదుమహారాజుకు దర్శనమిచ్చి 24 మంది సాధక గురువుల నుండి తాము నేర్చిన జ్ఞానాన్ని బోధించాడు. దత్తానుగ్రహం వలన అతడి వంశంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. ఇలానే ప్రహ్లాదునికి జ్ఞానం ఉపదేశించి, అనుగ్రహించాడు.


మనదేశంలో యెన్నో ఆధ్యాత్మిక సాంప్రదాయాల వారిచేత పరమ గురువుగా కీర్తించబడిన దత్తస్వామి, యెందరో సాధకులను అనుగ్రహించి, మహాత్ములుగా రూపొందించారు. 13వ శతాబ్దంలో తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో అప్పలరాజు శర్మ సుమతి అనే పుణ్యదంపతులైన తమ భక్తులను అనుగ్రహించి, వారికి పుత్రుడుగా అవతరించారు శ్రీదత్తాత్రేయుడు. ఆయనయే శ్రీపాద శ్రీవల్లభుడు.

(డిసెంబరు 12వ తేదీ శ్రీదత్తజయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **నామధారకుడు**

# శ్రీ ఉపాసనీ మహారాజ్

పాండిత్యానికి, భక్తికీ ప్రఖ్యాతి చెందిన మహారాష్ట్ర బ్రాహ్మణ కుటుంబంలో మే 15, 1870న సట్నాలో కాశీనాథ్ గోవిందరావ్ ఉపాసనీ జన్మించాడు. చిన్నతనంలో బడి చదువులు విడచి కాలమంతా సంధ్యావందనం, యోగాభ్యాసము, విష్ణు సహస్రనామ పారాయణలో గడిపేవాడు. వివాహం చేశాక గూడ అతనిలో మార్పేలేదు సరికదా ఒకనాడు ఇల్లు విడచి కాలినడకన నాసిక్ చేరాడు. రెండు నెలల తర్వాత తల్లికి జబ్బు చేసిందని తెలిసి, తిరిగివచ్చిన కొద్ది కాలానికి అతని భార్య, తల్లీ మరణించారు. పెద్దలు రెండవ వివాహం చేసినా మళ్ళీ ఇల్లు విడచి వెళ్ళిపోయి, ఎన్నో కష్టాలోర్చి సాధు సాంగత్యం చేస్తుండేవాడు. తర్వాత మళ్ళీ స్వగ్రామమైన సట్నాకు వెళ్తుండగా ఒక అడవిలో ఒక కొండమీద గుహ కన్పించింది. అందులో కూర్చొని ప్రాయోపవేశం చేయదలచి ఒక పెద్ద చెట్టు పైకెక్కి అందులో దూకాడు. అక్కడ నిరంతరం జపంచేస్తూ త్వరలో బాహ్యస్మృతి కోల్పోయాడు. ఒకనాడు మెలకువ వచ్చినపుడు ఒక దివ్యదర్శనమైంది. ప్రక్కన ఎవరో నిల్చొని అతని చర్మం వలుస్తున్నారు. భయపడి కళ్ళు తెరిచేసరికి ఎవరూలేరు. మళ్ళీ బాహ్యస్మృతి కలిగేసరికి విపరీతమైన దాహమేసింది. ప్రక్కనే వాననీరు చిన్న మడుగుకట్టివుంటే త్రాగి, వాటితో శరీరం తుడుచుకున్నాడు. నాల్గవరోజు మరో దర్శనమైంది. దప్పికతో తానొక కాలువ దగ్గరకెడుతున్నాడు. తనకొకవైపు ఒక ముస్లిం సాధువు, మరోవైపొక సన్యాసి వున్నారు. వారిద్దరూ అతడి పాత చర్మం తీసివేసి, లోపల బంగారం వంటి దేహమతనికి చూపి, "ఎందుకు చావయత్నిస్తావ్? మేము నిన్నెన్నటికీ చావనివ్వము!" అన్నారు. అప్పుడతడు గుహనుండి దిగి జూలై 22, 1890న ఇల్లు చేరాడు. ఎన్నో నెలల తరబడి తాను సమాధి స్థితిలో వున్నట్లు తెలుసుకున్నాడు శ్రీ ఉపాసనీ.



అటుపిమ్మట ఒక సం॥ లోగా అతని తండ్రి, తాత, రెండవ భార్య కూడ మరణించారు. కుటుంబం అప్పుల పాలయ్యేసరికి వారి సమీప బంధువు అయిన శ్రీ బాలగంగాధర్ తిలక్ ఆదుకున్నారు. తర్వాత ఉపాసనీ ఆయుర్వేద వైద్యమభ్యసించి అమరావతిలో గొప్ప వైద్యుడై, శ్రీమంతుడయ్యాడు. గాని వ్యాపారంలో అంతా నష్టపోయాడు. బంధువులు మూడవ వివాహం చేశాక ఆ దంపతులు యాత్రలు చేశారు. ఓంకారేశ్వర్లో అతడు తీవ్ర సమాధి స్థితిలో నుండగా భార్య భయపడి నీరుచల్లి మేల్కొలిపింది. అప్పటినుండి అతనికి గాలి పీల్చడమెంతో కష్టమయ్యేది. నిద్రపోతే శ్వాస నిలిచిపోయేది, ఏ వైద్యానికీ ఆ బాధతగ్గలేదు. చివరకు యోగంలో వచ్చిన బాధను యోగపూర్ణులే తొలగించగలరని తలచి, భార్యను ఇంటవదలి, 1911లో అట్టివారిని వెదుకుతూ బయలుదేరాడు కాశీనాథ్. అతడు రాహురిలో యోగి అయిన శ్రీ కులకర్ణిని దర్శిస్తే ఆయన, "నీవు మంచి స్థితిలో వున్నావు. నిన్ను శిరిడీలోని శ్రీ సాయిబాబా మాత్రమే ఉద్ధరించగలరు" అన్నారు. కాని సాయి "ముస్లిమ్" అని తలచి వారిని దర్శించలేదు శ్రీ కాశీనాథ్. తర్వాత దారిలో ఒక వృద్ధుడు కన్పించి, "దాహం వేస్తే ఎప్పుడూ చన్నీరు త్రాగవద్దు, వేడినీరు మాత్రమే త్రాగు" అని చెప్పారు. అతడా మాట లెక్కపెట్టక, వేరొకచోట నీరు త్రాగడానికి కాలువకు వెళ్తూంటే ఆ వృద్ధుడే మళ్ళీ ఎదురై మందలించి , ప్రక్క గ్రామంలోనికి వెళ్ళి అక్కడ అడిగి వేడినీరు త్రాగమని ఆదేశించి అంతర్ధానమయ్యాడు! కాశీనాథ్ ఆశ్చర్యపడి అలానే చేశాడు. బాధ చాలావరకు తగ్గింది. తర్వాత అతడు ఖేడ్గాంబేట్లో దత్తావతారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నారాయణ మహరాజ్‌ను దర్శించారు. ఆయన అతనికి తాంబూలమిచ్చి, "నీవు లోపల, బయట బంగారం పూసినట్టు, మంచి యోగస్థితిలో వున్నావు. నీవు కోరదగినదేమీ లేదు" అన్నారు. శ్రీ ఉపాసనీ బాధ మాత్రం తగ్గలేదు. అతడు మరలా యోగి కులకర్ణిని దర్శించారు. ఆయన వెనుకటి సలహానే యిచ్చాడు. గత్యంతరంలేక జూన్ 27, 1911న మొట్టమొదటిసారిగా శిరిడీ చేరాడు శ్రీ కాశీనాథ్ ఉపాసనీ.

రెండురోజులు సాయి సన్నిధిలో వుండడంతోనే అతని బాధ మటుమాయమైంది! అయినా అతనికి 'ఫకీరు' సన్నిధి దుర్భరమనిపించి తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాడు. "నీవు వెళ్ళొద్దు, వెళితే 8వ రోజుకు తిరిగి ఇక్కడికి రావాలి!" అన్నారు బాబా. ఆ మాట శ్రీ ఉపాసనీకి నచ్చలేదు. అపుడు సాయి , "సరే వెళ్ళు నేను చేసేది చేస్తాను" అన్నారు. కాశీనాథుడు పట్టుదలతో ఎంత వేగంగా నడచినా, 8వ రోజుకు 20 మైళ్ళలోనున్న కోపర్గాము మాత్రమే చేరాడు! అక్కడ ప్రథమంగా శిరిడీపోతున్న భక్తులు బలవంతాన అతనిని తోడుగా తీసుకెళ్ళారు. శ్రీసాయి అతణ్ణి చూస్తూనే నవ్వి, "నీవు వెళ్ళి ఎన్ని రోజులయింది?" అన్నారు. ఎనిమిది రోజులయిందని బదులు ఇచ్చారు కాశీనాథ్. అప్పుడతనిని వాడాలో వుండమని ఆజ్ఞాపించారు శ్రీసాయిబాబా. ఈసారి శ్రీ సాయిబాబా మాటకు తలఒగ్గేడు శ్రీ ఉపాసనీ.

శిరిడీలో నిత్యమూ భక్తుల అనుభవాలు వినడంతో అతని

మనస్సు క్రమంగా మారింది. ఒకరోజు బాబా అతని వైపు చూచి నవ్వుతూ భక్తులతో అన్నారు. "ఒకప్పుడు ఒక ఆమె గర్భిణియై కొన్ని సంవత్సరాలయినా ప్రసవించలేదు. ఆమెను వేడినీరు మాత్రమే త్రాగమని చెప్పాను. ఆమె నా మాట లెక్కచేయక నీరు త్రాగడానికి ఒక కాలువకు వెళుతున్నది. ఆమె గర్భంలోని బిడ్డలు నశిస్తారేమోనని నేను ఆమెను మరలా మందలించాను. ప్రక్క గ్రామంలో వేడినీరు త్రాగాక ఆమెకు బాధ చాలావరకు తగ్గింది" అన్నారు. తనకు రెండుసార్లా దర్శనమిచ్చిన ఆ వృద్ధుడు శ్రీసాయియే నని గుర్తించి పులకించాడు శ్రీ కాశీనాథ్. తర్వాత బాబా, "కొన్నివేల సం॥లుగా మనిద్దరికీ ఋణానుబంధ మున్నది" అని, "ఒక బావి ప్రక్క చెట్టుమీద రెండు పక్షులుండేవి. ఒకటి బావిలో పడితే దానిని రక్షించడానికి రెండవది తన ప్రాణాలు తెగించవలసి వచ్చింది" అన్నారు. మాయలో బడిన శిష్యుని రక్షించడానికి సద్గురువు అవతరించవలసి వచ్చిందని వారి భావం గాబోలు! తర్వాత కాశీనాథ్‌తో, "ఎవరితోనూ సంబంధం లేకుండా మౌనంగా ఖండోబా ఆలయంలో 4 సం॥ లుండు, ఖండోబా కృప లభిస్తుంది" అన్నారు బాబా. రోజూ శ్రీ కాశీనాథ్ స్వయంగా వంట చేసుకొని, మొదట మశీదులో సాయికి నివేదించి తర్వాత భోజనం చేసేవాడు.

శ్రీసాయి చెప్పినది మరచి శ్రీ ఉపాసనీ వేదాంతగోష్టి చేస్తుంటే బాబా మందలించేవారు. ఇలా 3 సం॥లకు పైగా గడచింది. ఆ కాలంలోశ్రీ ఉపాసనీ ఎన్నో బాధలననుభవించారు. ముక్కోపము, ఆత్మాభిమానమూ గలవాడేమో, ఈ బాధలు మరీ తీవ్రంగా వుండేవి. ఒకప్పుడు కొన్ని మాసాలు అన్న ద్వేషమనుభవించారు. తుంటరులైన యువకులు ఆయనను ఎన్నో రీతుల బాధించేవారు. ఆ బాధలు భరించలేక అతడెన్నో సార్లు శిరిడీ వదలి వెళ్ళాలనుకున్నాడు. కాని సాయి వెళ్ళనివ్వలేదు. "నీవిప్పుడెంత ఓర్చుకుంటే నీ భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుంది. నాలుగు సం॥లు యిక్కడుంటే నా స్థితే నీకూ కలుగుతుంది" అనేవారు. కాని శ్రీ ఉపాసనీ సుమారు 3 1/2 సం॥లు ఉన్న తరువాత శ్రీసాయితో చెప్పకుండా భక్తులతో కలసి ఖరగ్పూర్ వెళ్ళిపోయారు. కాని అప్పటికే ఆయనలో యోగశక్తులు ప్రకటమయ్యేవి. చివరకు ఆయన శిరిడీ దగ్గరున్న సాకోరిలో స్థిరపడి శ్రీ ఉపాసనీ మహరాజ్‌గా ప్రసిద్ధికెక్కారు. అక్టోబరు 15వ తేదీ 1918వ సంవత్సరము శ్రీ శిరిడీసాయిబాబా మహాసమాధి చెందిన తరువాత 7వ రోజున కాశీ వెళ్ళి 1100 మంది బ్రాహ్మణులచేత కాశీవిశ్వేశ్వరునికి అభిషేకం చేయించి, ఆ బ్రాహ్మణులందరికీ భోజనముతోపాటు శాలువా, దక్షిణ కూడ సమర్పించారు శ్రీ ఉపాసనీబాబా. వేలాదిమంది సామాన్యులతో పాటు అసమాన్యులు కూడ శ్రీ ఉపాసనీ మహరాజ్ దర్శనార్థము విచ్చేసేవారు. వారిలో ప్రముఖులు, శ్రీ మహాత్మాగాంధీ, శ్రీ మెహర్‌బాబా, శ్రీ రవీంద్రనాథ్ మొదలైనవారు కూడ కలరు. డిసెంబరు 24, 1941న సమాధి చెందారు. శిరిడీకి 12 కిలోమీటర్ల దూరములో గల శ్రీ ఉపాసనీ మహరాజ్ సమాధి మందిరం ఎందరో భక్తులపాలిట కల్పతరువు అయ్యింది. శిరిడీ దర్శించినవారు తప్పకకుండా దర్శించాల్సిన ప్రదేశం సాకోరీలోని శ్రీ ఉపాసనీబాబా సమాధి మందిరము.

సౌజన్యం : **శ్రీ ఉపాసనీబాబా చరిత్ర**
సేకరణ : **శ్రీమతి తులసి**, గుంటూరు


ఓం శ్రీ సాయినాథాయనమః | ఆహ్వానము | శ్రీ భరద్వాజ గురవేనమః



# దత్తజయంతి మహోత్సవములు



**వేదిక**

**శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం**

ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, పరవాడ, విశాఖ - 21



**తేదీలు**

**2019 డిసెంబరు 11 మరియు 12**
**(బుధ, గురు వారములు)**

**దత్త జయంతి మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు**

**2019 డిసెంబరు 11 మరియు 12 (బుధ, గురు వారములు) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు**

ప్రతి రోజూ భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం శ్రీ గురుచరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, **11వ తేది** సామూహిక శ్రీ గురుచరిత్ర ఏకాహ పారాయణ, **12వ తేది** శ్రీ దత్తాత్రేయుడికి సామూహిక క్షీరాభిషేకం, గురుపూజలు మరియు భక్త సమారాధన, సామాజిక సేవ మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును. ఆ యా కార్యక్రమాలలో పాల్గొని, శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహము పొందుటకు అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

గమనిక : దూర ప్రాంతాలనుండి వచ్చు భక్తులకు
2 రోజులు ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేయడమైనది.

నిర్వహణ : **శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు** (రిజిష్టర్డు)
ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం) విశాఖ - 531 021.
సెల్ : 9849645224

# శ్రీ దత్త సంప్రదాయము

ప్రతి మనిషి కూడా సాధ్యమైనంత వరకూ సుఖముగా, సంతోషంగా జీవించాలనే కోరుకుంటాడు. దానిని పొందే మార్గంలో మంచి ఉద్యోగస్తుడు కావాలనో, ప్రముఖ రాజకీయవేత్త కావాలనో, డబ్బు, కీర్తి సంపాదించాలనో ఎవరికి తగ్గ లక్ష్యాలను వారు ఏర్పరుచుకుంటారు. ఐతే ఇందులో కొందరు మాత్రమే తమ లక్ష్యాలను సాధించుకోగల్గడం, కొందరు ఎంత కృషి చేసినప్పటికి పొందలేకపోవటం చూస్తున్నాము. కాని కొందరే తమ లక్ష్యాలను సాధించుకోవడం మిగిలినవారు సాధించుకోలేకపోవడం అనేది మనకు అంతుపట్టని ప్రశ్నగా వుండిపోయింది. దీనికి సమాధానం మనకు పరిపూర్ణమైన మహాత్ముల వల్ల లభ్యమౌతుంది. ప్రతి మనిషియొక్క జీవితంలో ఎదురయ్యే సంఘటనలు ముందుగా నిర్దేశించబడిన కర్మసిద్ధాంతం వల్ల జరుగుతువుంటాయి. దీనినిబట్టి చూస్తే, ప్రతి మనిషి యొక్క జీవితం వాడికి తెలిసినా తెలియక పోయినా ఈ కర్మ సిద్ధాంతానికి అనుగుణంగా సాగుతుందని భగవద్గీత గ్రంధాలు తెలుపుతున్నాయి. ఐతే ఈ కర్మసిద్ధాంతానికి అనుగుణంగా మన జీవితం సాగించాల్సిందేనా? లేక, దీనిని సవరించి మనకు సుఖమైన జీవితం అందించే మార్గం ఏదైనా వుందా?



భగవంతుడు భూమిపై సద్గురువుగా అవతరించినదే శ్రీ దత్తాత్రేయ తత్వం. ఈ కలియుగంలో దత్తస్వామి మానవరూపంలో శ్రీపాద వల్లభులుగా, శ్రీ నృసింహసరస్వతిగా, శ్రీ మాణిక్య ప్రభువుగా, శ్రీ స్వామి సమర్థగా మరియు శ్రీ షిర్డిసాయినాధుడుగా అవతరించారు. ఈ మహనీయులు చరిత్రలో, కర్మసూత్రాన్ని సవరించి తమ భక్తులను రక్షించిన అనుభవాలను స్మరిద్దాము.

గోపీనాధుని కుటుంబం దత్తభక్తులు. వారికి దత్తస్వామి అనుగ్రహం వల్ల కల్గిన బిడ్డకు (దత్తుడు) స్వామిపేరు పెట్టుకున్నారు. ఇతనికి వివాహమయిన దగ్గర నుండి తీవ్రమయిన క్షయవ్యాధి వచ్చింది. భర్తయొక్క వ్యాధిని ఆ శ్రీగురుడే తొలగించగలరని విశ్వసించి అతనిని స్వామిదర్శనానికి తీసుకువెళ్ళింది అతని భార్య అయిన సావిత్రి. కాని అతను మార్గమధ్యంలోనే మరణించాడు. ఆమె ఎంతో బాధపడి స్వామి దర్శనాంతరము సహగమనం చేసుకోవాలని నిర్ణయించుకొని, శ్రీ గురుని దర్శించినది. స్వామి సావిత్రిని "దీర్ఘ సుమంగళీభవ" అని దీవించి, చనిపోయిన ఆమెభర్తని తిరిగి బ్రతికించారు. బ్రహ్మరాతను మార్చటం ఎలా సాధ్యమని సందేహిస్తున్న భక్తునితో, "బ్రహ్మ అనుమతితో వచ్చే జన్మనుండి 30సం॥ ఆయుష్షు ఈజన్మకు మార్చామని" స్వామి తెలిపేరు.

రామన్న పొలంపని చేసుకుంటూ వుండగా పాముకాటువల్ల మరణించాడు. స్వామి సమర్థుల భక్తుడైన జాదవ్ స్వామివారి చర్మపాదుకలు తీసుకువెళ్ళి చనిపోయిన రామన్న తలపైపెట్టి అతనిని బ్రతికించాలని ప్రయత్నించాడు. ఆ సమయంలో స్వామి కోపంతో జాదవ్‌ని తిట్టి, అతను స్వామి వద్దకు వచ్చాక, జాదవ్‌నువెళ్ళి రామన్న చెవిలో మూడుసార్లు పేరుపెట్టి పిలుపు బ్రతుకుతాడని చెప్పారు. అతను అట్లా చేయగానే రామన్న తిరిగి బ్రతికాడు. స్వామి ఆగ్రహానికి కారణం రామన్న విధి మార్చవలసి వచ్చినందుకే.

భీమాజీపాటిల్ తీవ్రమయిన క్షయవ్యాధితో షిర్డీసాయినాధుని దర్శించాడు. ఈ వ్యాధి పూర్వకర్మ వలన వచ్చిందని తాము నివారించమని సాయి తెలిపారు. అతను ఎంతో దీనంగా ప్రార్ధించినమీదట సాయి కరుణించి మసీదులోకి అనుమతించారు. సాయిని దర్శించినప్పటినుండి అతనికి రక్తంపడటం ఆగిపోయింది. ఒకరోజు భీమాజీకి కలలో రోడ్డురోలర్ అతని మీదగా వెళ్ళుచున్నట్లు అయి చాలా బాధపడ్డాడు. తెల్లవారిన తరువాత నుండి అతనిరోగం పూర్తిగా తొలగిపోయింది. అంటే సాయి, అతను భౌతికంగా అనుభవించాల్సిన కర్మఫలితాన్ని స్వప్నంలో అనుభవింపచేసి బాధ తొలగించారు.

పై మహనీయుల చరిత్రలు చూచినట్లయితే భక్తులయొక్క దుష్కర్మను తొలగించి వారికి సుఖసౌఖ్యాలు ప్రసాదించిన సంఘటనలు కోకొల్లలు.

నూటికి తొంబైతొమ్మిది మందికి కర్మసిద్ధాంతం ప్రకారం నిర్ధేశించబడిన దుఃఖము అనుభవించి తీరాల్సిందే సద్గురువుని ఆశ్రయించి, వారి అనుగ్రహం పొందినవారికి మాత్రమే దుఃఖనివృత్తి కల్గిన సందర్భాలు పైన తెల్పిన లీలలవల్ల తెలుస్తుంది.


కాని సద్గురువును ఆశ్రయించటమే మన ప్రధాన సమస్య అయినది. ఈ కలియుగంలో, ఆత్మజ్ఞానమే లేకనే సద్గురువులుగా ప్రకటమౌతారని బ్రహ్మంగారు, పురాణాలన్నీ హెచ్చరించాయి. అందుకే సాయిబాబా కూడా నిజమైన ఫకీరు చాలా అరుదు. ఎవరివద్దకు ఉపదేశాలకొరకై పరుగులిడ వద్దని హెచ్చరించారు. "శ్రీగురుచరిత్ర" పారాయణ ద్వారా సాటిలేని సద్గురువు సన్నిధికి చేరి, జన్మసార్ధకత చేసుకోవటం జరుగుతుంది.

*డిసెంబరు 12వ తేదీ శ్రీదత్తజయంతి శుభాకాంక్షలతో...*

సౌజన్యం : **'త్రివేణి సంగమము'** సేకరణ : **'శ్రీ'**

# సమర్ధ సద్గురు శ్రీ సాయినాధుని అవతరణము

ప్రపంచంలో మానవ మనుగడకు వెలసినవే మతాలు, మతసంప్రదాయాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, కలికాలం గడుస్తున్నకొద్దీ అవి శిధిలమవుతూ వచ్చాయి. పరిశుద్ధ సంప్రదాయానికి విరుద్ధమైన అంశాలెన్నో అచారాలుగా, సంప్రదాయాలకు భిన్నవ్యాఖ్యలు అందులో చేరి అసలైన సత్యపధం మరుగున పడింది. ప్రతి మతంలోనూ మతాంతరాలు, వాటిమధ్య విభేదాలు, చీలికలూ ఏర్పడ్డాయి. ఉదాహరణకు మతాన్ని తీసుకుందాం. అందరినీ ఆ భగవంతుడే (అల్లా ) ప్రకటించాడని ఖురాన్ చెపుతుండగా దానిలో షియా, సున్నీల బేధమెందుకు వచ్చింది. షరియత్ సూఫీ సాంప్రదాయం ఎందుకు నెలకొంది. అంటే మానవులలోని గుణవర్గాల (సంస్కారాలు) ననుసరించి వారేర్పచుకొన్న జీవిత విధానమది. కాబట్టి బేధం అనివార్యం. మతేతరమైన సిద్దాంతాలకు ఈ విభేదం తప్పడం లేదు. కార్ల్‌మార్ప్ చెప్పిన సిద్దాంతానికి రష్యా ఒకరకంగా, జెకోస్లోవేకియా, పోలాండ్, చైనా, క్యూబా, అర్జంటీనా, హంగరీలు ఒక్కొక్కరకంగా వ్యాఖ్యానించి వేర్వేరు మార్గాలను ఏర్పరచుకొన్నాయి. అదే విధంగా ఆధ్యాత్మ సిద్దాంతంలో తీసుకుంటే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన భగవద్గీతను కలియుగంలో శ్రీ శంకరాచార్యులు అద్వైతపరంగా మధ్వాచార్యులు ద్వైతపరంగా, రామానుజాచార్యులు విశిష్ఠాద్వైతపరంగా వ్యాఖ్యానించారు. బహుశా వారు వ్యాఖ్యానించిన ఆయా వ్యాఖ్యానాలు ఆదేశ కాల ప్రజలకు సరిపోయాయెమో కాని ఈ కాలానికవి జనాలలో విపరీతమైన కన్‌ఫ్యూజన్ కలిగిస్తున్నాయి. ఒకేమతంలో శైవ, వైష్ణవ సిద్దాంతాలు ప్రబలి అవితేల్చుకోవలసిన సమయం వచ్చేసరికి యుద్దాల ద్వారా రక్తపుటేరులు పారికూడా తేల్చుకోలేకపోయారు శివకేశవ బేధమే లేదని శృతులు చెపుతున్నా, వాటిని కూడా మనం పెడచెవిని పెట్టి మన మూర్ఖత్వాలను మనం చాటుకోలేదా, కాకపోతే మిగతా మతాలకంటే ప్రాచీన మతం హిందూమతం కాబట్టి ఈ మార్పుల వైవిధ్యమూ మరీ ఎక్కువ అయ్యాయి. దీనినే భగవద్గీత ధర్మగ్లాని అన్నది. అట్టి సందర్భాలలో దైవమే తిరిగి అవతరించి మూలధర్మాన్ని పరిశుద్ధమొనర్చుతాడని గూడా చెబుతుంది. బైబిల్‌లో ఏసుక్రీస్తు తాను ప్రాచీనధర్మాలను పరిపూర్తిగావించడానికే వచ్చానని చెపుతారు ఖురాన్‌లో కూడా అల్లా ఎందరో ప్రవక్తలను వివిధ కాలాల్లో వివిధ దేశస్తుల మధ్యకు పంపారని, వారందరూ ప్రకటించినది ఒకే సత్యమని, కాని కాలాంతరంలో ఆయా ధర్మాలు నశించాయని, తిరిగి ఆ సనాతన ధర్మమే మరలా ఖురాను ద్వారా మానవాళికి వెల్లడిస్తున్నామని వ్రాయబడియున్నది. మన ధర్మశాస్త్రాలలో కూడా ధర్మాచరణ విషయాలలో శంక కలిగితే సర్వజ్ఞులైన మహనీయుల ఆచరణే మనకు మార్గదర్శకమని స్పష్టంగా చెప్పబడివుంది. పరిపూర్ణులైన మహనీయుల అవతరణ ప్రయోజనాలలో అతిముఖ్యమైనదిదే.



పై అంశాల దృష్ట్యా సద్గురుసాయినాధుని అవతరణ చరిత్రలో నేటికెవ్వరూ చేయలేనంత విశేష ప్రాధాన్యత కలిగియున్నది. సాయిలో సర్వమతాలలోని మహోన్నతమైన సమన్వయం కనపడుతుంది. ఆయనలో అన్ని మతాలకు మూలమైన సనాతన ఆధ్యాత్మికతత్వం అవతరించింది. ఆయనే వేషం, భాష, తరచూ అల్లామాలిక్ అని స్మరించడం, మసీదులో నివసించడం, ముస్లింలతో కలసి ఫాతిహా అనే ప్రార్ధనను పఠించడం,ఉర్దూ, అరబ్బీ భాషల్లో భక్తిపాటలు పాడుతుండటం వల్ల కొందరాయనను ముస్లిం అని తలచారు. కాని మసీదులో నిరతాగ్నిని, తులసిని, ప్రతిష్ఠించి, మసీదుకు ద్వారకామాయి అని పేరుపెట్టి తానెంతవరకూ ముస్లిమో అంతవరకు హిందువని కూడా నిరూపించారు. ధూలియాకోర్టు న్యాయవాదితో తమ మతం కబీరనీ, కులం దైవకులం అని చెప్పడంతో తమ తత్వం వెల్లడిచేసారు. ఈ సద్బ్రాహ్మణుడు (బ్రహ్మనిష్ఠుడు) లక్షలాది మందిని శుభ్రమార్గంలో నడిపిస్తాడు. ఇది బ్రాహ్మణమసీదని కూడ చమత్కరించారు.

ఆధ్యాత్మిక విద్య మతసాంప్రదాయాలకతీతమని ఆయన బోధించదలచారు. ఆయన ఈయుగానికి, రానున్న యుగాలకు యుగకర్త. అందుకే ఆయన ఏమతధర్మాన్ని బోధించలేదు, నిరసించలేదు. అన్ని మతాలలోని మత మౌఢ్యాలను నిష్కర్షగా ఖండించారు. హిందూ ఆచారాలను మశీదులో పాటిస్తున్నందుకు ఒక ముస్లిం "మీరు ముస్లింలయివుండి యిదేమిటి?" అన్న వ్యక్తితో ఆయన "జైసాదేశ్ వైసావేష్ - దేశాన్ని బట్టి వేషం" అన్నారు. అంటే దేశకాలాలను బట్టి వివిధ వేషాలు ధరించిన ఆధ్యాత్మికసూత్రం తామని భావం. "ఒకే సత్యాన్ని పండితులు వివిధ రీతుల నిర్వచించారన్న" సూత్రంతో యిది సరిపోవడం లేదా? అల్లానుండి ఎల్లపుడూ అందరు ప్రవక్తలద్వారా ప్రకటమైనదని ఖురాన్‌లో చెప్పిన వాణి కాదా, ఆధ్యాత్మికత మతభేధాలకతీతమని చెప్పిన వాణి మూలస్థంభం. దేశ మతబేధాలకతీతమయినది - వర్ణబేధానికికతీతంకాదా! అన్ని మతాలను, మత సాంప్రదాయాలను తమలో యిముడ్చుకున్న సర్వమత సామరస్యంకాదా యిది. కాబట్టి మనమందరం మత బేధాలకతీతమైన సాయిపధంలో సాగిపోదాము. విజయదశమి శుభాకాంక్షలు

రచన : **వి.సి. వెంకటేశ్వరరావు**, పుత్తూరు.

# మహోన్నతం మాష్టారి మానవత్వం

కళ్ళలో దీపకాంతుల ప్రకాశం, ముఖాన చిరునవ్వుల చిద్విలాసం, నిరాశతో తన దరిచేరేవారి మనస్సులో ఉత్సాహం, ఆయన సన్నిధిన ఆనంద కెరటాల ఉత్తేజం, అశాంతి అస్తమయం, శాంతి పునర్జీవం. మాష్టారుగారు గుర్తుకురాగానే మన కళ్ళ ముందు మెదిలే దృశ్యం ఇది.



మన జీవనయాత్ర అజ్ఞానం నుండి జ్ఞానం వైపు, అశాంతి నుండి శాంతి వైపు, చీకటి నుండి వెలుగువైపు, అమంగళం నుండి సుమంగళం వైపు సాగాలని ప్రబోధించడమే మాష్టారిగారి తత్వం. దీని ద్వారా మనస్సు మానవత్వం వైపు మళ్ళుతుందని తెలియచేసారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారు.

మనకు ఏదైనా సమస్య ఎదురైతే దాన్నుంచి ఎలా బయటపడాలో అని తెగ ఆలోచిస్తాం. స్నేహితులతో, బంధువులతో సలహాలు తీసుకొని ఆ సమస్య నుంచి ఎలాగోలా గట్టెక్కెస్తాం. మన తరువాత వాళ్ళకి కూడా అదే సమస్య వస్తే – ఏదైనా చేస్తామనే ఆలోచన కొంతమందికి మాత్రమే వస్తుంది. వారిలో మన మాష్టారిగారికి ఒక ప్రత్యేకత ఉంది.

మాష్టారిగారికి వీరి అన్న కుమారుని మరణంతో జనన, మరణాల మర్మం ఏమిటి? సుఖదుఃఖాల మూలమేమిటి? అనే అంశం జిజ్ఞాసగా మారి, అది అన్వేషణకు దారి తీసి హేతువాదానికి బీజం వేసింది. అయినప్పటికి మనస్సు సమాధానపడలేదు.

1963 ఫిబ్రవరి 9వ తేదీ శిరిడీలో సాయిసన్నిధియందు విశ్వచైతన్యానుభూతి పొందిన తదనంతరం అంతవరకు అశాంతిగా వున్న మనస్సు అనిర్వచనీయమైన శాంతిగా మారింది. తను పొందిన శాంతి సౌఖ్యాన్ని తనవరకే పరిమితం కాకుండా, విశ్వమానవాళికి అందించాలనే ధ్యేయంవైపు అడుగులు వేసి, తన రచనల, ప్రవచనాల ద్వారా భావితరానికి పంచాలని, ఇంటింటా, గ్రామాల్లో, పల్లెలలో, పట్టణాలలో సత్సంగాల ద్వారా ప్రతి మనిషిలో సాయితత్త్వాన్ని నింపాలని ఆరాటపడ్డారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టరుగారు.

లౌకికము, ఆధ్యాత్మికము అనే రెండు కొండల నడుమ సంసారము (మాయాజగత్తు) అనే లోయలో పడకుండా తానొక చెక్కవంతెనగా మారి సాధకులకు, సన్మార్గులకు ఆలంబనముగా నిలిచి, వారిని దరిచేర్చడానికి బద్ధకంకణుడైన మహనీయమూర్తి మన మాష్టారు.

"మానవసేవే మాధవసేవ అనేది ఒకప్పటి మాట". "సర్వజీవుల సేవ సద్గురుసేవ" అనేది నేటి మాటగా మాష్టారుగారు తెలియజేశారు.

మాష్టారుచెప్పింది తక్కువ. ఆచరణాత్మకంగా బోధించేదే ఎక్కువ. ఆయన నడిచిన దారి, పలికిన పలుకు, ఏదైనా సమస్యకు చూపిన పరిష్కారం, ఇచ్చిన జవాబు ప్రతీదీ చూడగలిగితే, గమనించగలిగితే అదే మనకు ఒక సందేశంగా, ఆదేశంగా కనిపిస్తాయి.

మాష్టారిగారి మానవత్వానికి మచ్చుతునకగా కొన్ని వివరించుకుంటే ఆయనలో ఉన్న దైవత్వం మనకు అవగతమవుతుంది.

స్వంతలాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడవోయ్! అన్నట్లుగా ఏ ప్రతిఫలాన్ని ఆశించక ఆర్థిక యిబ్బందులలో వున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు, బట్టలు అందించారు. పెద్ద సరిగ అంచు కండువా భుజాన వేసుకుని ఏదో వ్రాసుకుంటున్నప్పుడు ఒక భిక్షువు వచ్చి "స్వామీ! మీరిచ్చిన పంచె చినిగిపోయింది, చలికి ఛస్తున్నాను. ఏదైనా గుడ్డ యివ్వండి" అన్నప్పుడు తలకూడా ఎత్తకుండా భుజం మీద కండువా తీసి ఆ భిక్షకునికి యిచ్చిన సహృదయులు మాష్టారుగారు. యింకా చెప్పాలంటే గుప్తదానమే అధికంగా చేసేవారు.

ప్రతి వ్యక్తిలో ఆశావాదం ఉండాలి. నిరాశావాదం ఉండకూడదు అంటారు కొందరు నిపుణులు. కాని ఆశావాదం వద్దు, నిరాశావాదం వద్దు. వాస్తవికంలో ఉండాలి. (Live in Present) అని అంటారు మాష్టారు. ఎందుకంటే Past is History, Future is Mistery, Present is Victory. ఇదే మాష్టారి సూత్రం.

మనసు గురించి మాట్లాడుతూ ఇంటి కప్పు సరిగా లేకపోతే, వాన నీళ్ళు ఇల్లంతా కారినట్లు..... ఆలోచనలో (వివేకం) లోపం ఉన్నప్పుడే మనసులోకి చెడు ప్రవేశిస్తుందంటారు. ఆ విషయమే మనకు శ్రీగురుచరిత్ర ద్వారా స్పష్టమవుతున్నది.

మంచిని చూడాలన్నా, చెడును విడిచిపెట్టాలన్నా, అంతా మన చేతిలోనే ఉంది అనే వారు మాష్టారుగారు. ఉదాహరణకు ఒక శిష్యుడు గురువు గారికే పరీక్ష పెట్టాడు. "గురువుగారూ! నా గుప్పెట్లో ఓ పిట్ట వుంది. అది బ్రతికుందా లేక చనిపోయిందా?" అని అడిగాడు. గురువుగారు బ్రతికివుంది అని చెబితే చంపేదామన్న ఆలోచన, చనిపోయింది అని చెప్తే 'బ్రతికే ఉందిగా!' అని నిలదీద్దామని శిష్యుని పన్నాగం, "నీ ప్రశ్నకు సమాధానం నీ చేతుల్లోనే ఉంది" ఇది సమర్థ గురువుగారి జవాబు.

ఒక హాలులో ఆధ్యాత్మిక ప్రవచనం జరుగుతున్నది. **Where is God?** దేవుడు ఎక్కడ ఉన్నాడు? అనేది ప్రశ్న! **No Where** ఎక్కడా లేదు అనేది శ్రోత సమాధానం. శ్రోత సమాధానంలోనే ఉంది **Now here** ఇక్కడే ఉన్నాడని, అంటే సత్యం (వాస్తవం) అనేది చూచే దృష్టి మీద ఆధారపడుతుందని తెలుస్తుంది.

అందుకే మన జీవితం తెల్లకాగితం లాంటిది, నీవు అందులో ఏది వ్రాసుకుంటావో అదే కనిపిస్తుంది. పిచ్చి గీతలు గీచుకుంటావో! లేక అద్భుతమైన భగవంతుని ప్రతిరూపం వ్రాసుకుంటావో అనేది మన ఆలోచనలో, చేతల్లో ఉందని మాష్టారుగారు చెప్పేవారు.

మాష్టారుగారు సూళ్ళూరుపేటకు 1989వ సం॥ ఫిబ్రవరి రెండవ తేది వచ్చినప్పుడు చివరి సత్సంగ ప్రవచనాలలో చెప్పినది – పారాయణం, సత్సంగం, హారతి విధిగా జరుపుకోమని.

పారాయణ ఎందుకు చేయాలి? ఎలా చేయాలి ? ఎప్పటి వరకు చేయాలి? అనే ప్రశ్న వచ్చినప్పుడు మాష్టారుగారి సమాధానం ఈ క్రింది విధంగా ఉంటుంది....

**'పారాయణమంటే భగవంతుని లీలలు, అవతార విశేషాలు చదువుకుంటూ, శ్రవణం చేస్తూ, అందులో పరాయణత చెందడం ద్వారా మన ఆలోచనలు, ఆచరణ, ఆశయాలు అన్నీ దైవీపరంగా మారడం జరుగుతుంది.**

**గృహస్థులు తమ కుటుంబ శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసినట్లుగా ఏమి చేస్తున్నా, ఎక్కడ ఉన్నా అవి మరపురానట్లుగా!**

**భగవంతునిపై ప్రీతిని, స్మరణను పెంచేలాగున, చదవడము, మననము చేసేలాగున పారాయణ చేయాలి.**

**ప్రేయసికి ప్రియమైనవన్నీ, ప్రియుడికి ప్రీతికరములై, మిగిలినవన్నీ అయిష్టమైనట్లు, అలాగే మన సద్గురువుకు ప్రీతికరమైన మాటలు, పనులు, నడవడులే మనకు ప్రీతికరమయ్యేంతగా పారాయణ చేస్తుండాలి,**

**ముఖం జిడ్డుగా మారినప్పుడు ప్రతిసారి తుడుచుకున్నట్లుగా! గుడ్డలు మాసినప్పుడు ప్రతి సారి క్రొత్తవి ధరించినట్లుగా! యింకా చెప్పాలంటే మనసు మనకబారనంత వరకు పారాయణ చేయవలసిందే!..**

పశుభావం నుంచి, మనుష్యత్వానికి తీసుకుని వెళ్ళేదే మాష్టారితత్త్వం. దీనికి మూలం శిరిడీ సాయినాధుని సాంప్రదాయం.

1963 సం॥లో మాష్టారుగారు శిరిడీ నందదీపం దగ్గర జ్యోతి వెలిగించుకుని, తాను మరోనందదీపంగా మారిన మన మాష్టారుగారు నాటికి, నేటికి, ఏనాటికైనా వెలుగుతూనే వుంటారు . ఆ వెలుగులో మాష్టారు వేసిన బాట – పట్టుదల, వైరాగ్యం, సత్యశోధన, వివేకం, సాధనా పటిమనే పంచసూత్ర ప్రణాళిక.

ఈ మార్గంలో మనకు లభించేవి – గురుభక్తి, సమాజసేవ, ధర్మనిరతి, మత సామరస్యం, ధైర్యం, ధ్యానము, మతాల కతీతమైన ఆధ్యాత్మికత.

(అక్టోబరు 30వ తేదే పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **యమ్. చంద్రబాబు**, సూళ్ళూరుపేట, నెల్లూరు జిల్లా

# హృదయ జ్యోతి

ఓ దుష్టుడైన కుర్రవాడున్నాడు. వాడు ఎవరినైనా సరే తిట్టి పారిపోతుంటాడు. ఓనాడు ఓ సాధుబాబా ఓ మర్రిచెట్టు క్రింద కూర్చుని ఉన్నాడు. ఆ కుర్రవాడు వచ్చి అతణ్ణి దూషించి పారిపోయాడు, తిట్టడం వల్ల సాధువు కుపితుడై తనను కొట్టడానికి పరుగెత్తుకు వస్తాడనీ, అప్పుడు మహామజాగా ఉంటుందనీ వాడనుకున్నాడు. సాధువు మౌనంగా కూర్చున్నాడు. అతడు వాడివైపు చూడనైనా లేదు.



ఆ కుర్రవాడు ఆ సాధువుకు మరీ దగ్గరగా వచ్చి మరల గట్టిగా దూషించ సాగాడు. సాధువు తన ధ్యానములో లీనమై ఉన్నాడు. ఏదో కుక్కయో, కాకియో అరుచుకుంటున్నదని ఆ బాబా అనుకున్నాడు. అక్కడకు మరో కుర్రవాడు వచ్చి– "బాబాజీ! వీడు మిమ్మల్ని తిడుతున్నాడు కదా!" అని అడిగాడు. బాబాజీ సమాధానం యిచ్చాడు "అవును నాయనా! దూషిస్తున్నాడు. కాని నేను ఆ తిట్లను స్వీకరిస్తేకదా! నేను వాటిని పట్టించుకోనప్పుడు ఆ తిట్లన్నీ వాడిదగ్గరే ఉంటాయి కదా!."

"కానీ వాడు చాలా చెడుతిట్లు తిడుతున్నాడు బాబా" అని ఆ కుర్రవాడనగా ఆ సాధువు, ''బాబూ! ఇది మరీ నీచవిషయమంటావా? అవేమీ నాకు తగలలేదు, అన్నీ వాడి నోటిలోనే ఉండిపోయాయి. వాడినోరే మలినమై పోతుంది'' అన్నాడు.

ఆ తిట్లుతిట్టే కుర్రవాడు సాధువు సమాధానాలు ఆలకిస్తున్నాడు. వాడు ఆలోచించాడు "ఈ సాధువు సత్యమే చెబుతున్నాడు. ఎవరినైనా నేను దూషిస్తుంటే వారు నా తిట్లను స్వీకరించి నన్ను కొట్టుటకు పరుగులు తీస్తుంటారు. పరుగెత్తలేని వారైతే దుః ఖించేవారు. నా తిట్లను యీ సాధువు స్వీకరించక పోవడంవల్ల అవన్నీ నా దగ్గరే ఉండిపోయాయికదా!". ఆ కుర్రవానికి అతని స్థితి చాలా నీచంగా అనిపించింది. ''ఛీ! ఛీ! నా దగ్గర అసహ్యకరమైన ఎన్ని తిట్లు ఉండిపోయాయో కదా" అని మనసులో అనుకున్నాడు.

చిరికి వాడు సాధువుకు దగ్గరగా వెళ్ళి "బాబాజీ! నా అపరాధాలు ఎలా విముక్తమవుతాయి? నా నోరు ఎలా శుద్ధమవుతుంది?" అని ప్రశ్నించాడు.

సాధువు శాంతంగా సమాధానం యిచ్చాడు. "పశ్చాత్తాపం చెందడం వల్లనూ, ముందెన్నడు దూషించను అని ప్రతిజ్ఞ చేయడం వల్లనూ నీ అపరాధాలు దూరవుతాయి. సద్గురువునామ స్మరణవల్ల నోరు పరిశుద్ధమవుతుంది".


ఎదుట వ్యక్తిని అకారణంగా దూషించే వ్యక్తి మలం తినే పందితో సమానమన్నారు శ్రీసాయి. సాధన చేస్తాము, ధ్యానము చేస్తాము, అయితే దానికి ముందుగా మనలోని రాగ ద్వేషాలు జయించాలి. అలాకాక బలవంతంగా ఏదో మార్గం ద్వారా భగవంతుడిని మెప్పించి కోరికలు తీర్చుకుందామన్నా, అది రాక్షసులు చేసిన తపస్సుతో పోలి ఉంటుంది. అందుకని ధ్యానం చేస్తాము, మంత్రం జపిస్తామనేదాని కన్నముందు ఆ నోటితో ఇతరులను దూషించటము మానాలి. అదే నిజమైన తొలిమెట్టు. పుజ్యశ్రీ భరద్వాజగారు అన్నట్లు "సాధన అంటే మనలోని సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమైన ప్రయత్నమే." అలాంటి సాధన ప్రారంభించి మనలోని అజ్ఞానమనే చీకటిని పారద్రోలి జ్ఞానమనే వెలుగుతో హృదయాన్ని నింపుకొని, ఆ వెలుతురులో మన మార్గం సుగమం చేసుకుంటూ ఆధ్యాత్మిక పథంలో ముందుకు సాగుతూ, నిరంతరం హృదయ దివ్వెను సరిచేసుకుంటూ, ఆ వెలుతురు పది మందికి పంచుతూ సాయి పథంలో పయనం చేయటమే నిజమైన దీపావళి. దీపావళి శుభాకాంక్షలతో ...

(అక్టోబరు 27వ తేదీ ఆదివారం దీపావళి సందర్భంగా సమర్పణ)

రచన : **వి.వి.పూర్ణచంద్రరావు**

# శ్రీ మాణిక్యప్రభువు

కలియుగములోని దత్తావతార పరంపరలోని 3వ అవతారమైన శ్రీమాణిక్యప్రభువు కర్ణాటక రాష్ట్రములోని గుల్బర్గా జిల్లాలోని కళ్యాణి అనే పట్టణమున విశ్వ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మనోహర నాయికులు బయాదేవి అనే దంపతులకు 12-12-1817, ఈశ్వర నామ సంవత్సరాన రెండవ కుమారునిగా జన్మించిరి. తల్లి తండ్రులు వీరికి 'మాణిక' అని నామకరణము చేసెను, వీరికి చిన్న తనములోనే తండ్రి మరణించెను. శ్రీమాణిక చిన్నతనమునుండి తోటి బాలురతో కూడా సమీపమునందలి అడవికెళ్ళి తిరుగాడుతూ ఉండేవారు. ఆ సమయములోనే అనేక దివ్యలీలలు చేసేవారు. ఒకనాడు మిత్రులతో కలసి ఒక గ్రుహలోనికి ప్రవేశించి, అచ్చటి బైరాగిని సమీపించి ప్రసాదము అడుగగా, ఆ బైరాగి తన భిక్షాపాత్రలోని రొట్టెను కుక్కపాలు, చనిపోయిన పాముతో ముద్దచేసి ఇవ్వగా ప్రభువు దానిని స్వీకరించిరి. తోటి బాలురు అదిచూసి భయపడి అడవినుండి గ్రామములోకి పారిపోయిరి. కొన్ని దినములకు ఇంటికివచ్చిన కుమారుడిని తల్లి మందలించగా, తన నోరు తెరచి మాణిక్య ప్రభువు తన నోట త్రిమూర్తులను తల్లికి దర్శింపజేసెను.



శ్రీ మాణిక్యప్రభువు అన్నగారయిన దాదామహరాజ్ ఉపనయనమగువరకు మౌనముగా ఉండేవారు. ఉపనయనా నంతరము మాటలాడిరి. వీరు మారుతి అవతారమని అందరూ అనుచుండేవారు. వీరు ఎక్కువగా ఏకాంతంగా ఉండేవారు. యుక్తవయస్సురాగానే వీరికి వివాహము చేయదలచి ముహూర్తము కూడ నిశ్చయించారు కాని, కావలసిన ధనము, సామగ్రి ఆర్థిక లోపమువలన అన్ని సమకూర్చుకోలేకుండిరి. తల్లి బయాదేవి ముహూర్తము సమీపించుకొలది బాధ పడసాగింది. ఆ సమయమున మాణిక్యప్రభుని భక్తులెవరో కావలసిన వస్తువులన్నిటినీ తెచ్చి సమర్పించిరి. వివాహము వైభవముగా జరిగెను.

శ్రీ మాణిక్యప్రభువు తమ్ముడైన నృసింహతాత్యాకు 6వ సంవత్సరమున ఉపనయనము చేయదలచిరి. ధన, వస్తు సముదాయము లేకుండెను. తల్లి బయాదేవి పేదరికము వలన బాధపడుచుండెను. మాణిక్యప్రభువు గణపతిని అర్చించిరి. వెంకప్ప అనే వ్యాపారస్థుడు సంతానము లేక ప్రభుని దర్శించి, అయాచితముగ 400 మందికి సరిపడు భోజన సామగ్రి సమర్పించి, వస్త్రములుకూడ సమకూర్చెను. ఉపనయనము శాస్త్రవిధిగా జరిగెను.

ప్రభువుల మేనమామ వీరిని పోషించుచుండెను. ప్రభువుల వారిని పన్నులు వసూలు చేయు ఉద్యోగమున ప్రవేశింపచేయగా, వారు వసూలుచేసిన పన్ను మొత్తములను బీదలకు పంచిపెట్టేవారు. అందుచే పై అధికారులు అతనిని ఉద్యోగమునుండి తీసివేసిరి. మేనమామ విసుగుచెంది మాణిక్యప్రభువును ఇంటినుండి వెళ్ళిపొమ్మన్నారు. స్వేచ్ఛ దొరికినదే చాలునని మేనమామకు నమస్కరించి ప్రభువు విశాల ప్రపంచములోనికి ప్రవేశించారు. 4 నెలల పిదప శ్రీప్రభువులవారి లీలల గూర్చి వినిన బంధువులు ఇంటికి రమ్మన్నారు. కుటుంబపోషణ తన కర్తవ్యము కాదనియు, దానిని తన మిత్రుడు నిర్వహించుననియు, తాము నిర్వహించవలసిన కార్యములు వేరనియు చెప్పి ఇంటికిపోవ నిరాకరించిరి శ్రీమాణిక్యప్రభువు. వారు అడవులందున్నను వేల సంఖ్యలో భక్తులు వారిని దర్శించి మేలు పొందుచుండిరి. వారు సదా అంతర్ముఖులై యుండిరి. మరికొంత కాలము గడచిన పిదప, భక్తులు బలవంతపెట్టగా కళ్యాణి నగరమును దర్శించిరి. ప్రభువుల వారి శక్తి సామర్ధ్యములకు ఈర్ష్య చెందిన లక్ష్మణరావు అనే వాడు ధనమదమున, వారిని కించపరుచదలచెను. ప్రభువుల సోదరుడు నృసింహతాత్యాకు తమ చెల్లెలినిచ్చి వివాహము చేయుదుననియు, కాని ప్రభువు వేయి రూపాయలు సమకూర్చుకొనవలెననియు ప్రకటించెను. ప్రభువు అందుకు అంగీకరించెను. కాని వారు వేయి రూపాయల నెట్లయినను సమకూర్చుకొన జాలరని లక్ష్మణరావు తలచెను. ప్రభువాతనిచే వాగ్దానమును వ్రాయించుకొనిరి. ముహూర్తము నిర్ణయింపబడెను. కాని ముహూర్తదినము ముందురోజువరకును ధనము కాని - వస్తువులు కాని ప్రభువు తెప్పించలేదు. కుటుంబసభ్యులందరు విచారించసాగిరి. ఆ సమయమున బసప్ప షాహుకారను వ్యాపారి వివాహమునకు కావలసిన సమస్తమును బండ్లపై దెచ్చి, ప్రభువుకుటుంబీకులకు సమర్పించిరి. లక్ష్మణరావు తన చెల్లెలినిచ్చి వివాహముచేయక తప్పలేదు. ప్రభువిదంతయు 'దత్తాజీ లీల' అనిరి. ఇంకనూ ఈర్ష్యమానక లక్ష్మణరావు ఎక్కువమంది బంధువులను భోజనమునకు పిలుచుకొనివచ్చెను. పదార్థములు చాలవనుకొని బంధువులు తలచిరి, ప్రభువు మంత్రదండముతో వానిని తాకి వడ్డింపజేసిరి. అందరును సమృద్ధిగా భుజింప యింకనూ పదార్థములు మిగిలిపోయెను. ఒక కొంటెవాడు హాస్యమాడ తలచి, మరల మరల అడిగి, వడలు వడ్డించుకుని తినెను. 'లేవు' అనక అతనికి వడ్డించిరి. తినిన వెంటనే అతనికి కడుపునొప్పిరాగా నేలపై పొర్లాడసాగెను. అది చూసి అతని బంధువులు ప్రభువును ప్రార్థింపగా అతనిని తన హస్తముతో తాకి బాధను నివారించిరి. ప్రభువులీలలు ప్రచారము పొందెను.

కళ్యాణి నగరమున భక్తులెందరున్ననూ, ప్రభు లీలలపై కొందరు ఈర్ష్య వహించిరి. ప్రభువా పట్టణమునుండి సంచారమున కేగుచు, ఆ పట్టణమునకు చేటు మూధనున్నదనిరి. కొలది దినములకే చోరభయము, అంటువ్యాధులు ప్రబలెను. ప్రభువుల సోదరుడు నరసింహతాత్యాకు కూడ కలరావ్యాధి సోకెను. తల్లి తమను తలచుకొనగా, మాణిక్యప్రభువు అచ్చటికి వచ్చి, తీర్థమిచ్చి సోదరుని బ్రతికించిరి. కాని అతని భార్య పుట్టినింటనుండి కలరావ్యాధిచేతనే మరణించెను. లక్ష్మణరావు దురుద్దేశ్యమిట్లు

పరిణమించెను. అతడు పశ్చాత్తాపముపొంది ప్రభువును శరణు వేడెను. స్వామి కరుణతో క్షమించి, తమ బృందమున చేర్చెను.

ప్రభువు బోధలను ముసల్మానులు కూడ స్వీకరించుచుండిరి. ఈర్ష్య వహించిన ముసల్మానొకడు ప్రభువు నంతమొందింప క్షుద్ర ప్రయోగముచేసి, చివరకు తానే వ్యాధిగ్రస్థుడై మరణావస్థలోఉండెను. ఆతని సోదరుడు ప్రభువువద్దకేగి ప్రాణభిక్ష పెట్టమని ప్రార్థింపగా, నిజము చెప్పిన పిదప ఆ క్షుద్ర మాంత్రికునికి స్వస్థత చేకూర్చి **“నీవు క్షేమముగా ఉండదలచినచో ఇతరుల క్షేమమునే ఎల్లప్పుడును కోరుకొనుము”** అని బోధించి వెడలిపోయిరి. చావుతప్పిన ముసల్మాను ప్రభువును కొనియాడి ఈర్ష్య లేక తన క్షుద్ర విద్యలను వదలివేసెను. కొలది దినములపిదప జయమ్మ యను భక్తురాలి ప్రోత్సాహముచే హైదరాబాదు ఉద్యోగి యశ్వంతరావు అనే అతడు తన పెద్ద కుమార్తెను నృసింహతాత్యాకిచ్చి వివాహమును కళ్యాణి నగరముననే జరిపించెను. కళ్యాణినేలు నవాబు సమస్త వస్తువులను సమర్పించి, స్వయముగా వివాహమును తిలకించెను. నగరమందలి ముసల్మానులు, హిందువులు ఎల్లరు ఆనందముగా పాల్గొనిరి. ప్రభువింటియందలి శుభకార్యము ప్రజలందరకు ఆనందకరమయ్యెను. పట్టణమంతయు వివాహ సందడితో నిండెను.

కేతకి గ్రామంలో, ప్రభువు ఒక పిచ్చివాడని తలచి, సంశయిస్తున్న ఒక బ్రహ్మచారికి, కుష్ఠువ్యాధితో బాధ పడుతున్న అతని గురువును కరుణించి, తీర్థప్రసాదముల నిచ్చి వారి వ్యాధిని నివారించెను. ఈ కేతకి సంగమమున ఒక గాదీని ఏర్పరచిరి.

బీదరు వాస్తవ్యులు పలువురు తమ గృహములకు విందునకు ఆహ్వానించిన వారికి తమ సమ్మతి తెలిపి, ఒకే కాలమున వారి గృహములందు విందారగించి, ప్రభువు తమ విశ్వరూపమును ప్రదర్శించిరి. కొందరు మహమ్మదీయులు ప్రభువుని పరీక్షింప విందున కాహ్వానించి, మాంసాహార పదార్థములు ఉన్న పళ్ళెము పై గుడ్డ కప్పి వారికి ఆరగించమని ఇచ్చిరి. ప్రభువు పళ్ళెముపై గుడ్డ తీసిన అన్ని ఫలపుష్పములే ఉండెను. మహమ్మదీయులు క్షమాపణవేడి, ప్రభువును “పిరాన్ పీర్ దస్తగిర్” అను బిరుదున కీర్తించిరి. వేలకొలది హిందూ, ముస్లిం భక్తులు వచ్చి వారిని దర్శించి, పూజించిరి. ఈ స్థానముననే తమ గాదీని స్థాపించిరి. కొంతకాలము తర్వాత బీదరు విడిచి కల్యాణి నగరమునకు మేనాలో ప్రయాణించుచుండ హుమ్నాబాదు అరణ్యమందలి దట్టమైన చెట్లలో మేనా చిక్కుకున్నది. ప్రభువు మేనా దిగి సమీపాన గల బిల్వ వృక్షము క్రింద విశ్రాంతి తీసుకొనిరి. ఆ మేనా ఆగిన ప్రదేశముననే ప్రభువు దేవాలయము నిర్మింపబడినది. ఈ ప్రదేశముననే “మాణిక్య నగరం” ఏర్పడినది. ఇచ్చట స్థాపించిన గాదీనకే “దత్తాజీ గాదీ” అని పేరు పెట్టిరి. ఇచ్చటే వారి దర్బారు జరుగుచుండేది.

శ్రీ ప్రభువు ఎల్లప్పుడు ఆత్మానంద స్థితి యందుండి, భక్తులతో మధురముగ మాటలాడేవారు. గాదీపై కూర్చొని ఉన్నపుడు విలువైన బంగారు జరీ దుస్తులు ధరించెడివారు. సువర్ణాభరణాలంకృతులై ఉండేవారు. ఒక్కొక్కప్పుడు శుద్ధ ఫకీరు వేషమున ఉండి, భక్తుల కష్టములను వినుచుండెడివారు వారి దర్బారులో ఏకకాలమున వేదపఠనము, శాస్త్రచర్చ, నృత్య, గీత ప్రదర్శనలు జరుగుచుండేవి. ఎల్లప్పుడు వారి దర్బారు విద్వాంసులు, గృహస్థులు, సాధువులు, ఫకీరులు, గోసాయీలతో నిండుగా ఉండేది. తాము కూర్చుండిన దూదిమెత్త క్రింద చేయిపెట్టి రూపాయలను విరివిగా తీసి కష్టములలో ఉన్నవారికి యిచ్చుచుండిరి. అవి ఎచ్చటినుండి వచ్చెడివో ఎవరును ఎరుగరు. వివిధ దేవాలయములను నిర్మింపచేసిరి. శ్రీ మాణిక్య ప్రభువు “సకలమతాచార్య చతుర్థ దత్తావతారు”లని ప్రసిద్ధి గాంచిరి. వీరి సంప్రదాయము “సకల మత సంప్రదాయమని” పేరుగాంచి, మరే సంప్రదాయమునకు విరుద్ధముగాక, జగత్తులోని సర్వధర్మములు, వానిని అవలంబించినవారికి, పరమేశ్వర ప్రాప్తిని కలుగచేయగలవు అని బోధించిరి.

శ్రీ మాణిక్య ప్రభువు తమ నిర్యాణమును గూర్చి ఆరునెలల ముందుగానే ఆంతరంగికులకు తెలిపిరి. వారిచే తమ కుటీరముననే అతి రహస్యముగా సమాధి నిర్మింప జేసిరి. 1865వ సం॥ మార్గశిర శుద్ధ దశమి దినమున దర్బారు జరిపి, తమ భక్తులందరికి తమ చివరి దర్శనమును ప్రసాదించి, ఆ రోజల్లా దాన ధర్మములు జరిపిరి. మరుసటి రోజు ‘ఏకాదశి’ నవంబరు 29వ తేదీ 1865న తమ సోదరుడు తాత్యా మహరాజ్ ఇద్దరు కొడుకులను పిలిపించి తమ గాదీపై కూర్చుండజేసి, వారి మెడలో పుష్పహారములు వేసి పంపిరి. తదుపరి వీరిరువులు గాదీ నలంకరించి ''మనోహర మాణిక్యప్రభువు'' ''మార్తాండ మాణిక్య ప్రభువు'' అని పిలువబడిరి. శ్రీ ప్రభువు సమాధియందు ప్రవేశించి ద్వారమును మూయించిరి. శ్రీ మాణిక్య ప్రభువు దివ్య జీవితమట్లు పరిసమాప్తి చెందెను. తమ జీవిత కాలమునంతను తమ చెంతకు వచ్చిన వారి కష్టములను మహాదానశీలురై తీర్చిన ''సమర్థ సద్గురువులైన దత్తాత్రేయావతారులు''. శ్రీమాణిక్య ప్రభువు ఎచ్చట కూర్చొను చుండిరో, అచ్చటనే దివ్యమైన దేవాలయము నిర్మింపబడెను. ఇచ్చట జరుగు ఉత్సవములలో దత్తజయంతి ముఖ్యమైనది.

**మార్గం :** హైదరాబాదు నుండి గుల్బర్గా వెళ్ళే బస్సులో హుమ్నాబాద్ చేరి అక్కడినుండి 4 ఫర్లాంగుల దూరంలో నున్న మాణిక్యనగర్ చేరవచ్చు.

## శ్రీ మాణిక్య ప్రభువు పంచ సూక్తులు

1. దుష్టజంతువులైనను వాని వ్యాపారములలో మనము కలుగచేసి కొననంత సేపు అవి మనలను బాధింపవు.

3. ‘నేను నేను’ అనెడి అహంభావము మిథ్య, అసత్యము. ఎవరికెవరు ప్రభువు? ఎవరికెవరు నౌకరు?

4. నీ బాగును కోరుకునే యెడల ఇతరుల బాగును సదా కోరుచుండుము.

6. తీవ్రమైన కోరిక యున్నప్పుడు ముక్తి కలుగుట కష్టము కాదు, కాని అది పొందుటకు లౌకిక వ్యవహారములను వదులుకొనవలెను.

7. వ్యక్తి ప్రధానము కాదు, స్థానమే ప్రధానము.


*డిసెంబరు 7వ తేదీ (తిథి ప్రకారము) శ్రీ మాణిక్యప్రభువువారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ*

సౌజన్యం : **‘శ్రీమాణిక్యప్రభువు జీవితచరిత్ర’**

సేకరణ : **శ్రీమతి వై సాయి.శిరీష**, బెంగుళూరు

# శ్రీగురుచరిత్ర పారాయణ ఫలితాలు

## (అధ్యాయ పరంగా)



| | |
|---|---|
| 1వ అధ్యాయము | – శ్రీదత్తరూపులైన మహాత్ముల దర్శన ప్రాప్తి కలుగును |
| 2వ అధ్యాయము | – గురుభక్తి దృఢపడుట కొరకు, ఆధ్యాత్మిక అభ్యున్నతి కొరకు, కలి ప్రభావం మనపై పడకుండుట కొరకు |
| 3వ అధ్యాయము | – ఎవ్వరి కోపమునకు గురి కాకుండుటకై మరియు స్వకీయ శీల రక్షణ కొరకు |
| 4వ అధ్యాయము | – శ్రీదత్తదేవుని కృప పొందుటకు |
| 5వ అధ్యాయము | – యోగ్యులు, బుద్ధిమంతులైన సంతానం కొరకు |
| 6,7వ అధ్యాయములు | – ఘోరపాప నిర్మూలన కొరకు, శాపవిముక్తి కొరకు మరియు రోగ విముక్తి కొరకు |
| 8వ అధ్యాయము | – ఉత్తమమైన ఉత్తర జన్మ లభించుట కొరకు |
| 9వ అధ్యాయము | – భోగభాగ్యములు, సంపద కొరకు |
| 10వ అధ్యాయము | – వ్యాపారాభివృద్ధికొరకు |
| 11,12వ అధ్యాయములు | – సుపుత్రప్రాప్తికొరకు |
| 13వ అధ్యాయము | – కడుపునొప్పి నివారణకొరకు |
| 14వ అధ్యాయము | – అధికారుల అనుకూలతకొరకు |
| 15,16వ అధ్యాయములు | – తీర్థయాత్ర ఫలితంకొరకు |
| 17వ అధ్యాయము | – విద్యా ప్రాప్తికొరకు |
| 18వ అధ్యాయము | – పేదరిక నిర్మూలనకొరకు |
| 19వ అధ్యాయము | – శ్రీగురు నిజతత్వ ప్రాప్తికొరకు |
| 20,21వ అధ్యాయములు | – ఋణవిముక్తికొరకు |
| 22,23వ అధ్యాయములు | – దారిద్ర్య నిర్మూలనకొరకు |
| 24–28వ అధ్యాయములు | – అహంకార నిర్మూలనకొరకు |
| 29వ అధ్యాయము | – భస్మ మహత్యం తెలియుటకొరకు |
| 30–34వ అధ్యాయములు | – అపమృత్యుభయం తొలగుటకొరకు |
| 35వ అధ్యాయము | – స్త్రీ సౌభాగ్యం కొరకు |
| 36,37వ అధ్యాయములు | – సదాచార నియమములు తెలియుటకు, సందేహ నివృత్తికొరకు |
| 38వ అధ్యాయము | – అక్షయ సంపదల కొరకు |
| 39వ అధ్యాయము | – గొడ్రాలుకు సంతానప్రాప్తికొరకు |
| 40–42వ అధ్యాయములు | – రోగనివారణకొరకు, గురుభక్తి దృఢపడుటకొరకు |
| 43వ అధ్యాయము | – పోగొట్టుకున్న సంపదలు తిరిగి పొందుటకు |
| 44వ అధ్యాయము | – క్షేత్రయాత్ర భాగ్యంకొరకు |
| 45,46వ అధ్యాయములు | – రోగ నివారణకొరకు |
| 47వ అధ్యాయము | – గురుమహిమ తెలియుటకొరకు |
| 48వ అధ్యాయము | – సస్యసమృద్ధికొరకు |
| 49వ అధ్యాయము | – గాణ్గాపుర తీర్థమహిమ తెలియుటకొరకు |
| 50,51వ అధ్యాయములు | – గురుకృప ప్రాప్తికొరకు |


(డిసెంబరు 12వ తేదీ శ్రీదత్తజయంతి సందర్భముగా "శ్రీగురుచరిత్ర" పారాయణచేసి సద్గురుకృపకు పాత్రులవుదాము)

సౌజన్యం : **"శ్రీగురుచరిత్ర"**

సేకరణ : **విరించి**

# శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామి - శ్రీశైలం

శ్రీ పూర్ణానందస్వామి వారు తమిళనాడులోని మధురై పట్నములో 1939వ సంవత్సరము నవంబరు 1వ తేదీన సకల మంత్ర, తంత్రయంత్ర సిద్ధులైన శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీమతి పర్వతవర్ధని దంపతులకు ఐదవ సంతానముగా జన్మించారు. చిన్న తనములో తండ్రి ప్రధమ గురువుకాగా వారివద్ద సకల విద్యలు నేర్చుకున్నారు. తల్లి తండ్రులు పెట్టిన పేరు కామేశ్వరన్. విద్యార్థి సమయమందే శ్రీ కామేశ్వరన్ లోని ప్రజ్ఞ వెల్లడి కాసాగింది. పదవ తరగతి పాసై టైపు, షార్ట్‌హాండ్ కూడా నేర్చుకున్న స్వామివారు 1962 సంవత్సరము డిసెంబరులో తన తండ్రి స్వర్గస్థులవ్వటంతో కుటుంబ పోషణ నిమిత్తము.అనేక కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేశారు. కొంతకాలము తరువాత తన అవతార కార్యసిద్ధికై భవబంధాలు వదిలి వేసి, తపస్సు కోసం అరణ్యాలకు బయలుదేరేరు. అక్కడ శ్రీ నిత్యానందస్వామి (గణేష్‌పురి) వారి శిష్యులైన శ్రీ రాఖాడీబాబా గారి దర్శనమైంది, వారిని గురువుగా స్వీకరించి శ్రీ స్వామివారు వారిసేవలో ఉండిపోయినారు.



1967వ సంవత్సరము కార్తీక పౌర్ణమిరోజున బాణతీర్థములోని తాంబ్రపర్ణీనదిలో రాఖాడీబాబా గారు శ్రీ కామేశ్వరన్‌కు అభిషేకము చేసి "పూర్ణానంద" అని నామకరణము చేసి సన్యాసదీక్ష ప్రసాదించినారు. అనంతరము శ్రీ పూర్ణానందస్వామివారు బాణ తీర్థములో కొంతకాలము తపస్సు చేసి, ఈశ్వరసాక్షాత్కారము పొందిన తరువాత, తన గురువైన శ్రీ రాఖాడీ బాబా గారి ఆజ్ఞ మేరకు శిరిడీ వెళ్ళి సాయి సన్నిధిలో వారం రోజులుండి సాయి యొక్క దివ్యమైన సందేశము మేరకు, శ్రీ పూర్ణానంద స్వామి వారు 1969వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో శ్రీశైలములోని హఠకేశ్వరము వచ్చి ఒక చెట్టు ఛాయలో తన తపస్సును కొనసాగించారు. ఆ సమయములోనే ఎందరో స్వామివారిని దర్శించి అద్భుతమైన దివ్యానుభూతులు పొందేవారు. అటు పిమ్మట శ్రీ స్వామివారు 1974వ సంవత్సరములో భక్తుల ప్రార్ధనను అనుసరించి శ్రీశైలము ప్రాజెక్టు కాలనీ విష్ణుగిరి (సున్నిపెంట)లో తన గురువైన శ్రీ రాఖాడీ బాబా (శ్రీ ఓంకారనంద స్వామీజీ) వారి దివ్య శ్రీచరణముల కొఱకు ఆశ్రమము నెలకొల్పిరి. అందులో శ్రీ స్వామివారు స్వహస్తములతో శ్రీ భువనేశ్వరీదేవి మహాయంత్రమును, శ్రీ చక్రమేరును ప్రతిష్టించారు. శ్రీస్వామివారి దర్శనార్థమై దేశవిదేశాల నుండి సాధువులు, సంసారులు, బాల బాలికలు, వృద్ధులు ఇంకా అనేకులు వచ్చి వారి సంస్కారం ననుసరించి స్వామి వారి నుండి పూర్ణానందముతో కూడిన దివ్య బోధలనుఅందుకొని, మధురానుభూతితో వెళ్ళేవారు. జాతి, మతము ప్రశక్తి లేక సర్వులు పూర్ణ తేజస్వి అయిన స్వామివారి సన్నిధిలో అడుగిడినంతనే బాహ్య ప్రపంచము మరిచిపోయేవారు. చిరుమందహాసవదనులైన స్వామివారు ధరించబట్టి కాషాయానికి వన్నె వచ్చిందా అన్నట్లుగా స్వామివారి రూపం మనోహరంగా ఉండి కాషాయరంగుతో పోటీ పడుతూ ఉండేది.


తమ దివ్య భాషణములతో భక్తులను, తేజస్సుతో పరిసరాలను ప్రభావితం చేసిన శ్రీ పూర్ణానందస్వామి వారు తేదీ 06-04-2000వ సంవత్సరములో తన భౌతిక దేహం వీడి సృష్టి చైతన్యములో నిలిచారు. స్వామివారి భౌతిక దేహం ఆశ్రమములోనే సమాధి చేసి అద్భుతమైన మందిరము నిర్మాణము చేసారు. ఈనాటికి ఆ ఆశ్రమములో అడుగిడినంతనే ఎంతటి చంచల మనస్కుడికైనా మనస్సు నిశ్చలత చెంది, ఆనందానుభూతిలో తేలియాడుతుంది. ఆశ్రమములో ప్రతి అణువులో స్వామివారు నిండి, మన వెంట ఉన్నట్లు మధురానుభూతి కలుగుతుంది. అక్కడ అందరికీ స్వామివారి అనుగ్రహ ప్రసాదమే, కాకుండా అన్న ప్రసాదము కూడ అన్నపూర్ణాలయములో దొరుకుతుంది. శ్రీ శైల మల్లిఖార్జునుడినే కాక మన మధ్య నడయాడిన ఈశ్వర స్వరూపి అయిన శ్రీ పూర్ణానందస్వామి వారి ఆశ్రమము మరియు శ్రీశైలములోని పాలధార పంచదార్లకు ఎదురుగా గల హఠకేశ్వరములోని స్వామివారి తపోభూమిని జిజ్ఞాసులైన వారు తప్పక దర్శించ తగ్గవి. మరిన్ని వివరములకు శ్రీ స్వామివారి ఆశ్రమమును సంప్రదించగలరు.

అడ్రస్సు : శ్రీ స్వామి పూర్ణానంద ఆశ్రమము, పి-4 కాంట్రాక్టర్స్ కాలనీ, సున్నిపెంట, శ్రీశైలం డామ్ (తూర్పు), కర్నూలు జిల్లా-518102
ఫోన్ : 08524-86073

**(నవంబరు 1వ తేదీ శ్రీ పూర్ణానందస్వామి వారి జన్మదిన సందర్భముగా ప్రత్యేక వ్యాసం)** సేకరణ : **"సత్యాన్వేషి"**

# పుష్కర నిర్ణయం

తేది 05-11-2019 శ్రీ వికారి నామ సంవత్సర కార్తీక శుద్ధ అష్టమి మంగళవారం తెల్లవారుజామున గం॥ 05.18 ని॥ లకు దేవ గురువు అయిన బృహస్పతి తన స్వక్షేత్రమగు ధనుస్సురాశి యందు ప్రవేశించటముతో పుష్కర వాహిని నది అనగా 'బ్రహ్మపుత్ర' నదికి పుష్కరములు ప్రారంభమయ్యి, 16-10-2019 శనివారముతో పుష్కరాలు ముగియును. ఆసియా ఖండంలోని అతిముఖ్యమైనదిగా పరిగణించబడే బ్రహ్మపుత్రనది యొక్క సంస్కృత నామం 'లేహిత్య' ఇది టిబెట్‌లోని ఉత్తర హిమాలయాలలో కైలాస పర్వతం దగ్గర ప్రాంతములో హిమనీ నదముగా జన్మించి, భారత దేశం, బంగ్లా దేశాలలో ప్రవహిస్తుంది. బ్రహ్మపుత్రా నది ప్రపంచములోనే అతి ఎత్తైన పీఠభూమి మీద మరియు అతి లోతైన లోయలలో సహితం ప్రవహిస్తుంది. ఈనది భారతదేశంలో అరుణాచలప్రదేశ్, అస్సాం, రాష్ట్రాలలో ప్రవహిస్తుంది. అస్సాంలోని గౌహతికి 16 కిలోమీటర్ల దూరంలో గల శివసాగర్ అనే ప్రాంతం పుష్కరస్థానాలకు అనువయినదిగా తెలియుచున్నది.




## ఆరోగ్య సూత్రాలు

1. సెల్‌ఫోన్ ఎల్లపుడూ ఎడమ చేత్తోనే మాట్లాడాలి.
2. చల్లని నీటితో టాబ్లెట్స్ (మెడిసిన్) వేసుకోరాదు.
3. మెడిసిన్ తీసుకున్న వెంటనే నిద్రించరాదు.
4. పగటిపూట ఎక్కువ, రాత్రిపూట తక్కువగా నీరుత్రాగాలి.
5. బ్యాటరీ 10 శాతం ఉన్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడరాదు. ఆ సమయంలో మామూలు సమయం కన్నా 1000 రెట్ల అధిక రేడియేషన్ విడుదల అవుతుంది.

**మైలలేని వస్తువులు :** పసుపు, కుంకుమ, పూలు, పళ్ళు, వక్క తమలపాకు, పాలు, పెరుగు, తేనె, తులసి, గంధంచెక్క, నెయ్యి, కూరగాయలు, వీటికి అసౌచం (మైల) ఉండదు.

**వినియోగం :** దేవాలయాలలోను, పేరంటం సమయాలలోను ఇచ్చిన పసుపు, కుంకుమలను, ఏ పరమార్ధం కోసం ఇచ్చారో, దానికే ఉపయోగించాలి. పసుపును కూరల్లోను, కుంకుమను దైవపూజకు వాడరాదు.

## భర్తకు ఎడమవైపు భార్య ఎందుకుండాలి?

సంప్రదాయ ప్రకారం పూజలు, వ్రతాలు మొదలైన వాటన్నింటిలోనూ భార్య, భర్తకు ఎడమవైపునే కూర్చోవాలని శాస్త్రం నిర్దేశిస్తుంది. అర్ధనారీశ్వరుడైన శివుడికి పార్వతి ఎడమ భాగమైతే, లక్ష్మి నారాయణులలో విష్ణువక్షస్థలం ఎడమవైపునే లక్ష్మీ కొలువై ఉంటుంది. అందుకని భార్య, భర్తకు ఎడమవైపునే ఉండటము సంప్రదాయము. మానవ హృదయం ఎడమవైపునే ఉంటుంది కనుక, భర్తకు హృదయేశ్వరి అయిన భార్య ఎడమవైపునే ఉండటం సముచితమని, కవులభావన.

**జీవిత సత్యం :** ఒకసారి **కుండను** "నువ్వు ఎలాంటి పరిస్థితులలోనూ చల్లగా (ప్రశాంతముగా) ఉంటావ్ కదా! అది ఎలా సాధ్యమవుతుంది?" అని అడిగేరుట ఒకరు.

"నేను వచ్చింది మట్టిలో నుంచి, వెళ్ళేది మట్టిలోనికే. మధ్యలో అహంకారం, గర్వం, ఆవేశం, ద్వేషం వంటివి అవసరమా అని! ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటాను" అని బదులిచ్చింది కుండ.

## ఔషధాలు

**క్యారెట్ :** క్యారెట్‌ను మొట్టమొదట ఆహారంకోసం కాకుండా, ఆరోగ్య ఔషదం కోసం పెంచేవారు. ప్రతిరోజు క్యారెట్ తినటం వలన కంటిచూపు మెరుగుపడటమే కాకుండా ఒకక్యారెట్ తినటం ద్వారా ఒక మైలు నడిచే శక్తి కూడ లభిస్తుంది.

**ములగకాయ :** ములగకాయలు ఆహారంలో భాగముగా చేయటం వలన ఎముకల దృఢత్వం, రక్త శుద్ధి, ఆహార అరుగుదలకు, వ్యాధి నిరోధకశక్తి మెరుగవ్వటమే కాకుండా, శ్వాస సంబంధిత వ్యాధులను నిరోధిస్తూ, రక్తంలో చక్కెరశాతాన్ని అదుపుచేయటములో కూడ సహకరిస్తుంది.


## "శ్రీదత్తమూర్తి"

శ్రీదత్తాత్రేయుల వారికి మూడు తలలు ఉన్నట్లు వర్ణించారు ఋషులు. అకార, ఉకార, మకారాలకు ఆ మూడు శిరస్సులు సంకేతాలు. అందువలన దత్తాత్రేయుల వారు పరబ్రహ్మము, ప్రణవ స్వరూపం. అందుకని ఆయన మూడు శిరస్సులూ త్రిమూర్తులకు, వారి కార్యాలయిన సృష్టి, స్థితి, లయలకు, నాద, బిందు, కళలకు త్రయీ విద్య యనబడు వేదాలకు, మూడు పాదములుగల గాయిత్రికి, మూడు యజ్ఞాగ్నులైన గార్హపత్య, ఆవాహనీయ, దక్షిణాగ్నులకు చిహ్నాలు. సద్భక్తుల అంతఃకరణ చతుష్టయమే ఆయన చెంతనున్న నాలుగు కుక్కలు. స్వతహాగా చాపల్యం గల్గిన హీన జంతువులైనప్పటికి శిక్షణ యిచ్చిన వాణ్ణి నమ్మికతో సేవించి, దుర్గుణాలనే చోరులనుండి రక్షించేవి. హృదయంలో ఆ సద్గురుమూర్తిని నిలుపుకున్నవారిని నమ్మికతో సేవించేవి.

ఆయన చెంతనున్న ఆవు కామధేనువు. ఆవు సాత్వికమైన నాలుగు పురుషార్ధాలను గ్రహించగల మనస్సుకు సంకేతం. అంతః కరణ చతుష్టయాన్ని గురుధ్యానంతో ధరించిన మనస్సే కామధేనువు. కామ మంటే పురుషార్ధం. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్నట్లు ముముక్షువులుగాని వారికి ధర్మార్ధ కామాలనే ప్రసాదిస్తూ సద్గురు భక్తులకు అంతర్ముఖమై మోక్షాన్ని ప్రసాదించేది మనస్సు. అందుకని అది కామధేనువు.

శ్రీ దత్తమూర్తి సామాన్యంగా మూడు తలలు, ఆరు బాహువులు కలిగియున్నట్లు వర్ణించటము మనకు తెలిసిందే. కుడి చేతిలో 'రుద్రాక్షమాల' మంత్ర శాస్త్రానికి సంకేతం. ఢమరుకం, శబ్దరాశి అయిన శృత్యాది శాస్త్రాధ్యయానికి చిహ్నం. ఆ పై కుడిచేతిలోని చక్రం కర్మ బంధచ్ఛేదకమయిన సత్వర మోక్షప్రదమైన జ్ఞానానికి సంకేతం. అది అహంకార విధ్వంది. స్వప్రభావ ప్రకాశప్రదము. ఎడమచేతిలోని కలశంలోని జలం, కర్మకు సంకేతం. దానినుండే జీవులకు అన్నపానీయాలు లభిస్తాయి. మరొక ఎడమ చేతిలోని త్రిశూలం, ఆచార, వ్యవహారిక కర్మకాండకు చిహ్నం. ప్రవృత్తి మార్గావలంబులకు ధర్మార్ధ కామప్రదము. మరొక చేతిలోని శంఖువు, దాని పూరణ బద్ధ జీవులకు సంసార చక్ర ప్రవర్తకము సృష్టి కారణమైన శబ్ద బ్రహ్మ.

శ్రీ దత్తమూర్తి యొక్క ఎడమ భాగంలోని దేహము భగవంతుడు. కుడి భాగం ముక్తి ప్రదాత అయిన సద్గురువు.




### ఆదర్శం

ఆశతో కాకుండా ఆశయముతో పనిచేస్తే
ఫలితం ఆదర్శవంతంగా ఉంటుంది.

### ఆనందం

భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించే వాడికి భయం ఉంటుంది.
గతం గురించి ఎక్కువ ఆలోచించే వాడికి బాధ ఉంటుంది.
వర్తమానంలో జీవించే వాడికి ఆనందం ఉంటుంది.

### వివేకం

తనకు నచ్చితే మూర్ఖుడు సైతం
ఘనకార్యం సాధించగలడు, కాని
వివేకి ప్రతి పనినీ తనకు నచ్చే రీతిలో మలుచుకుంటాడు
– స్వామి వివేకానంద

### మౌనం

నీవు చికాకులో ఎక్కువగా మౌనం వహించు
ఆ సమయంలో నీ నోటినుండి వచ్చేవి
మాటలు కాదు – మారణాయుధాలు

### ఆశ, కష్టం

అందమైనది ఎప్పుడు 'ఆశ' పెడుతుంది
ఇష్టమైనది ఎప్పుడు కష్టపెడుతుంది
ఇష్టమైన దానికోసం కష్టించి, ఆనందంగా జీవించు.

### అదృష్టం

అదృష్టం తనంత తానుగా వచ్చి తలుపు తడుతుందని
అందరూ చెబుతుంటారు, నమ్మవద్దు
అది అవకాశం రూపంలో ఉంటుంది, దాన్ని
అందిపుచ్చుకొని స్వంతం చేసుకో. అదే అదృష్టం అంటే.
– జాన్‌వాట్సప్

### అచలం

విశ్వాసం అనేది కొద్దిపాటి గాలికి వాలిపోయేది కాదు
అది అచంచలమైనది, హిమాలయాలంత స్థిరమైనది.

### గీతలు

నీ గమ్యాన్ని నిర్ణయించేది నీ చేతలు, నీ నిర్ణయాలే
తప్ప నీ అరచేతి గీతలు కావు.

### ముఖ్యం

విజయాలే లక్ష్యాలు కావు
విలువలు ఉన్న వ్యక్తిగా ఎదగటము ముఖ్యం.

### ఆలోచించండి

చెట్టు నీడలోని సుఖం తెలిసినవారు
గొడ్డలి పట్టుకుని దాని కొమ్మలు నరకరు.

### గ్రహించు

ఎదురుదెబ్బ తగిలినప్పుడు తొందరపడకు
కాసేపు ఆగి ఆలోచించు, జీవితం నీకేదో నేర్పటానికి
ప్రయత్నిస్తుందని గ్రహించు.

### స్నేహం

మిత్రుడు ఆనందంతో ఉన్నప్పుడు ఆహ్వానిస్తే వెళ్ళాలి
కష్టాల్లో ఉన్నప్పుడు పిలవకున్నా వెళ్ళాలి.

### అభిప్రాయం

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన
తప్పుల్ని సరిదిద్దుకోలేడు, నేటికంటే రేపు ఎక్కువ
వివేకం ప్రదర్శించాలనుకుంటే, మనిషిలో మార్పు అవసరం.
– ఎడ్వార్ట్

### నిత్య సంతోషి

గెలిచిన వాడు ఆనందంగా ఉంటాడు, ఓడినవాడు
విచారముగా ఉంటాడు, అవి రెండూ శాశ్వతం కాదని
తెలిసిన వాడు నిత్యం సంతోషంగా ఉంటాడు.

### ఓటమి రహదారి

ఆచరణ లేని ఆలోచన, ఆలోచనలేని ఆచరణ
రెండూ ఓటమికి రహదారులే.

# 25వ సద్గురువుల పాదుకా మహోత్సవము చిత్రమాలిక




విజయదశమి, దీపావళి, దత్తజయంతి మరియు పూజ్య ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి 80వ జయంతి శుభాకాంక్షలతో...

**శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం** - డోర్ నెం. 6-9-20, కెల్లవీధి, శ్రీకాకుళం.


## జన్మదిన శుభాకాంక్షలు



డిసెంబరు 17వ తేదీన సింగపూర్‌లో
జన్మదినము జరుపుకుంటున్న
**శ్రీ బి.చంద్రశేఖర్, శ్రీమతి బి.సుశీల**
దంపతుల కుమారుడు
**చి॥ బి.యశోభరత్** కు

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహముతో
ఉజ్వలమైన భవిష్యత్తు ప్రసాదించాలని కోరుకుంటూ
శ్రీ భరద్వాజ సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



డిశెంబర్ 12వ తేదీన శ్రీకాకుళంలో
జన్మదినం జరుపుకుంటున్న
**శ్రీ కె. వెంకటరమణ, శ్రీమతి జయలక్ష్మి**ల కుమార్తె
**చి॥ కె. తేజశ్వని** కు

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది



Director
S. MOHAN REDDY

# SUN SCHOOL

(Recognised by the Govt. of A.P.)

Indira Nagar Colony,
Opp. Dougles High School, SRIKAKULAM.
Ph : 08942-220224, Cell : 9440436478

**Nursery to X Class**
**ENGLISH MEDIUM**

Hostel & Bus Facilities, Dancing, Music, Karate & Computer Education are Available

## జన్మదిన శుభాకాంక్షలు



డిశెంబర్ 10వ తేదీన
జన్మదినము జరుపుకుంటున్న

**చి|| ఆర్. సూర్య శ్రీనివాస్ కు**

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది







## పెళ్లిరోజు శుభాకాంక్షలు



డిశెంబర్ 8వ తేదీన శ్రీకాకుళంలో
పెళ్లిరోజు జరుపుకుంటున్న

**శ్రీ హరికృష్ణ పట్నాయక్, శ్రీమతి ఉషారాణి**

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో
గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



అక్టోబర్ 28వ తేదీన హైదరాబాద్‌లో
జన్మదినము జరుపుకుంటున్న

**శ్రీ జి.వి.వి. విశ్వేశ్వర్లు గారికి**

శ్రీ దత్త సాయి భరద్వాజులు తమ
కృపానుగ్రహములు అందించాలని కోరుతూ
సద్గురువాణి తన శుభాకాంక్షలు అందజేస్తున్నది

అభినందనలతో : భార్య : శ్రీమతి జి. రాజేశ్వరి
కుమార్తెలు : హిమశ్రీ, కావ్యశ్రీ

Printed, Published & Owned by Smt. V.S. LAKSHMI BRAMARAMBA, Address : M/s. Sri BHARADWAJA PUBLICATIONS, Plot No. 13, Power City, Near Gowthu Lachanna Nagar, Parawada Mandal, Visakhapatnam-21 and Printed at **M/s. UNITED POWER ENTERPRISES,** # 8-8-33(9), Opp. Hotel Sudha, Gajuwaka, Visakhapatnam-26 and Published at Power City, Visakhapatnam, Editor : **V.V. POORNA CHANDRA RAO**